
ఆంధ్రపత్రిక
సచిత్ర వార పత్రిక
ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY



కష్టజీవి

—ఫొటో: ఎస్. సత్యనారాయణరాజు.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ


ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 49
సంచిక 29
21.3-56

మన్మథ ఫాల్గుణ శుద్ధ నవమి బుధవారం



విశాలాంధ్ర రాజధాని హైదరాబాద్‌లో చార్మినార్ సుందర దృశ్యం.

విషయానుక్రమణిక

ముఖచిత్రం: హిందీ నటి శ్యామ.



బడ్జెట్ అంశాలు ముందుగా బయటపడే లోపం న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన తాజా గందరగోళం.

బ్రిటిష్ హయాంలో బడ్జెట్ రహస్యాలు గవర్నరు జనరలు, ఆయన ఆర్థికమంత్రి మధ్యనే దాగిఉండేవి. మంత్రివర్గపు బడ్జెట్ సమావేశం ఫిబ్రవరి నెల ఆఖరిరోజు సాయంత్రము 4-30 కు జరిగేది. తరవాత 5 గంటలకు మంత్రివర్గ సభ్యులు కేంద్ర శాసనసభలోకి వచ్చి కూర్చునేవారు. ఆర్థికమంత్రి బడ్జెట్ ఉపన్యాసం ఇచ్చేవాడు.

ఆ రోజుల్లో కేంద్రశాసన సభకు బడ్జెట్ సమర్పించబడటానికి 24 గంటల ముందే బడ్జెట్ యావత్తూ రాయిటర్స్, అసోసియేటెడ్ ప్రెస్ వార్తా సంస్థలు సంపాదించేవి. పత్రికా విలేఖరులకు ఫిబ్రవరి నెల ఆఖరి రోజున ఆర్థికమంత్రి లేచి ఉపన్యాసం ఇవ్వబోయే ముందు బడ్జెట్ వివరాలన్నీ తెలుపబడేవి. సర్ జేమ్స్‌గ్రిగ్ ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు గావును అసోసియేటెడ్ ప్రెస్‌కు 24 గంటలు ముందుగా బడ్జెట్ ఇచ్చే ఆచారానికి స్వస్తిచెప్పడం జరిగింది.

ఆ రోజుల్లో శాసనసభ భవనం బయట ఒక పారిశ్రామిక ప్రముఖుని కారొకటి వేచి ఉండేది. లోపల పత్రికా విలేఖరులకు బడ్జెట్ కాపీలు పంచిపెట్టగానే స్థానిక పత్రికా విలేఖరి ఒకడు గబగబ బయటకి వచ్చి కారులో కూర్చున్న డ్రైవరుకు అందించేవాడు. డ్రైవరు బడ్జెటు పట్టుకుని యజమాని వద్దకు అఘమేఘాలమీద పోయి ఇచ్చేవాడు. ఈ విధంగా మిగతా వ్యాపారస్థులకంటె ముందుగా ఆ పారిశ్రామికునికి కొత్త పన్నుల విషయం తెలిసిపోయేది. దాన్నతడు చక్కగా ఉపయోగించుకునేవాడు.

పత్రికలకు వ్యాపారస్థులకూ ఉన్న ఈ సంబంధం ఆర్థికమంత్రికి తెలిసి దాన్ని అరికట్టడానికి ఒక ఉపాయం చేశాడు. బడ్జెటును రెండు భాగాలుచేసి, రెండో భాగాన్ని, అంటే పన్నుల విధింపునకు సంబంధించినభాగాన్ని, ఇప్పటిలాగే ఆర్థికమంత్రి ఉపన్యాసం అయిన తర్వాత పత్రికల వారికి ఇచ్చేవారు. దీనివలన పన్నుల విషయం బయట పడడం కొంత ఆలస్యమైనా, మొత్తానికి ముందుగానే తెలిసేది. ఎగువసభలో ఆర్థిక కార్యదర్శి బడ్జెట్ ప్రతిపాదనలు క్లుప్తంగా వెల్లడించేవాడు. ఎగువ, దిగువ సభలు రెండూ బడ్జెట్ సమావేశాన్ని సాయంత్రం అయిదింటికి మొదలు పెట్టేవి గనుక, పత్రికా విలేఖరి ద్వారా ప్రముఖ పారిశ్రామిక మహాశయునికి, దిగువ సభలో వారికంటె ఒక గంట ముందుగానే బడ్జెట్ ప్రతిపాదనలన్నీ అందిపోయేవి. ఈ లోపాన్నికూడా తొలగించడానికి రెండు సభలనూ అయిదున్నరకే

శ్రీకృష్ణ
(ఆంధ్రపత్రిక విలేఖరి)

ప్రారంభించేవారు. రెండు చోట్లా ఒకేసారి బడ్జెట్ ప్రతిపాదనలను వెల్లడించేవారు. పన్నుల ప్రతిపాదనలను ఆర్థికమంత్రి కార్యాలయంలో ఆయనకు నమ్మకస్థులయిన వారిచేతనే సైక్లోస్టయిల్ చేయించేవారు.

బ్రిటిష్ హయాంలో ఇంత అపనమ్మకపు వాతావరణంలో బడ్జెట్ వ్యవహారం జరిగేది. స్వాతంత్ర్యం రాగానే ఇదంతా మారిపోయింది. ప్రభుత్వ రహస్యాలు అంటూ లేవనే చెప్పవచ్చును. ఆర్థికమంత్రి తన సహమంత్రులను, రాష్ట్రాల మంత్రులను సంప్రదించి బడ్జెట్ తయారు చేయడం ఒక అలవాటుగా పరిణమించింది. ఒక ఉదాహరణ :—

మద్రాసు శాసనసభలో జనవరి 25న ఆర్థిక మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం త్వరలో వస్త్రం మీద ఎక్సైజుపన్ను అధికంగా వేయవచ్చునని వెల్లడించారు.


ఇదిగాక కొన్ని పన్నులను వెంటనే వసూలు చేయ ప్రారంభించవలసిందని ఉత్తర్వులివ్వబడినాయి. ఇటువంటి ఉత్తర్వులవలన కూడా బడ్జెట్ రహస్యాలు వెల్లడవుతూ ఉంటాయి.

సుదీర్ఘహస్తాలు

సర్ జేమ్స్ గ్రిగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు న్యూఢిల్లీలో ప్రభుత్వ ముద్రణాలయం అధికారీ, ఒక న్యూఢిల్లీ పారిశ్రామికుని కార్యదర్శి మంచి స్నేహితులు. ఈ కారణం వల్ల ఆ అధికారిని సిమ్లాకు బదిలీ చేసి, రిటైరయ్యేదాకా మళ్ళీ ఢిల్లీ రానివ్వలేదు. దీన్నిబట్టి వ్యాపారస్తుల హస్తాలు ఎంత పొడుగు సాగగలవో తెలుస్తుంది.

ఈ రోజుల్లో వచ్చిన మరో చిక్కేమిటంటే ఆర్థికమంత్రి ఉపన్యాసం హిందీలోకి కూడా ముందు తర్జుమా కావలసి ఉంది. అంటే బడ్జెట్ రహస్యాలు తెలిసేవారి సంఖ్య ఎక్కువయిందన్న మాట.

బడ్జెట్ బయట పడినందుకుగాను ఇదివరలో ఒక బ్రిటిష్ ఆర్థికమంత్రి రాజీనామా ఇచ్చినట్లుగా, మన ఆర్థిక మంత్రి కూడా రాజీనామా ఇవ్వాలనే వాదం సరియైనది కాదు. శ్రీ చింతామన్ దేశ్‌ముఖ్ బడ్జెట్ రహస్యాలు వెల్లడించారనే అపవాదు లేదు. అదీగాక ఇండియా మాదిరిగా కాక బ్రిటన్‌లో యూనిటరీ ప్రభుత్వం ఉన్నది.


లోక్‌సభ స్పీకరుగా ఎన్నుకోబడిన శ్రీ అనంతశయనం అయ్యంగార్.

★ న్యూఢిల్లీ లేఖ ★

బ్రిటిష్ మార్కు ప్రజాస్వామ్యం కూడా బూజుపట్టిన విధానమై పోయింది.

న్యూఢిల్లీ పత్రికా విలేఖరులలో ప్రభుత్వ రహస్యం బయటపడడానికి, కాపీ తీయడానికి తేడా ఉంది. ఇతరులకంటె ముందుగా నేనొక వార్త ప్రచురించ గలిగితే అది కాపీ. ఇతరులు కూడ నాతో సమంగా ప్రచురిస్తే అది రహస్యం వెల్లడికావడం. నేను కాపీ వార్త ప్రచురిస్తే అందరూ నన్ను అభినందించాలి. ఇతరులు ప్రచురిస్తే రహస్యం బట్ట బయలైందని తిట్టిపోయాలి.

కాపీ రెండువేల రూపాయలు

ఈసారి బడ్జెట్ రహస్యాలు బయట పడగానే, వాటిని సైక్లోస్టయిల్ తీసి కాపీ రెండువేల రూపాయల చొప్పున అమ్ముతున్నారట.

ఇది చాల తీవ్రమైన వ్యవహారం.

అవినీతి ఎంత మితిమీరి పోయిందో దీనివల్ల తెలుస్తున్నది. ఈ అవినీతిని కఠినంగా అరికట్టకపోతే బడ్జెట్ రహస్యాలకిక రక్షణ అంటూ ఉండదు.

* * *

ఆసియాలో భూసమస్యలపై బాంకాక్‌లో జరిగిన గోష్ఠిలో భారత ప్రభుత్వ ఆహారశాఖ ప్రతినిధి ఒకరు చేసిన ప్రసంగం పరిశీలిస్తే, మన దేశంలో స్థితిగతుల గురించి విదేశాలకు అందచేసే సమాచారం స్వరూప స్వభావాలు తెలుస్తాయి.

ఆయన ప్రసంగంలో కొన్ని భాగాలు ఇక్కడ పొందుపరచబడ్డాయి.

ఆసియాలో అనేక దేశాలలాగే భారత దేశంలో కూడా అతి క్లిష్టమైన సమస్యలలో ముఖ్యమైనది వ్యవసాయ కూలీలకు సంబంధించినది. ఈ వ్యవసాయ కూలీలకు ఏడాది పొడుగునా పని ఉండేటట్లు చూడవలసి ఉంది. వారి దారిద్ర్యాన్ని నిర్మూలించ వలసిఉంది. 1951 లో సేకరించిన జనాభా లెక్కల ప్రకారం వ్యవసాయ కూలీలు, వారిపై ఆధారపడిఉన్నవారు నాలుగుకోట్ల నలభైఎనిమిది లక్షలమంది ఉన్నట్లు తేలింది. అంటే మొత్తం జనాభాలో నూరింట 12-6 గురు అన్నమాట.

నూటికి 85 మందికి...

వీరికి పని పాటులు, కూలీ నాలీ మొదలైన విషయాలకు సంబంధించిన వివరాలను 1949-50 లో నమూనా ప్రాతిపదికపై సేకరించి, అంచనాలు కట్టడం జరిగింది. దీని ఫలితంగా వీరిలో నూటికి 15 మందికి మాత్రం హెచ్చుపక్షం నెలరోజులయినా వరసగా పని దొరుకుతూ ఉంటుందని తెలిసింది. సాధారణంగా, ఈ తరహా పనివారిని సాలుకోసారి కుదుర్చుకుంటూ ఉంటారు. పోతే, మిగతా 85 మందికీ ఈమాత్రం ఆధారంకూడా లేదు. వారు ఏరోజు కారోజు, లేదా వారం పదిరోజులకోసారో కొత్తపని వెతుక్కుంటు నేఉండాలి. మొదటి తరగతికి చెందినవారికి సగటున ఏడాదిలో 326 రోజులు పని దొరుకుతుంది. ఈ రెండో తరగతి పనివారికి ఏడాదిలో పని దొరికేది దాదాపు 200 రోజులు. వీరిలో నూటికి 21 మంది పొలం పనులేకాక, ఇతరమైన పనులు కూడా చేసుకుంటూ ఉంటారు. ఈ మార్గాన ఉ: 50 రోజులు పనిదొరుకుతుంది. నూరింట పదిమందికి ఇంతో అంతో భూములుంటాయి. ఎటుచూసినా మొత్తానికి ఏడాదిలో నూరురోజులు వీరికి బొత్తిగా పనులుదొరకవు.

కూలీ నాలీ

ఇక కూలినాలి విషయం. కొలువు కుదుర్చుకునే పదిహేనుమందికీ, సాలుసరి ఆదాయం (ఆలుబిడ్డలు తెచ్చేదికూడా కలిపి)

రు. 450. ఈ వ్యవసాయ కూలీలలో స్త్రీలు నూరింట 14 మంది ఉన్నారు. వీరికి ఏడాదిలో 184 రోజులు కూలి దొరుకుతుంది.

ఇక ఈ వేతనాలు రొఖ్ఖంగానే ఇవ్వడం మామూలు. ఇంతకాలం పనిచేస్తే ఇంత ఇవ్వేటట్లు నిర్ణయించి, ఆ ప్రకారం లెక్కకట్టడం జరుగుతూ ఉంటుంది. పోతే, ఈ పనికి ఇంత అని నిర్ణయించే పద్ధతి అనుసరించడం తక్కువే. పండుగ పబ్బాలకు పెళ్ళిళ్ళకూ కట్నాలూ కానుకలూ ఇచ్చే ఆచారం ఉంది. ఇటువంటి కానుకలు సగటున, సాలుకు గిట్టే రాబడిలో నాలుగో వంతువరకూ ఉంటూ ఉంటాయి.

కూలిరేట్లు ప్రాంతానికో పద్ధతిలో, ఆయా పనులనుబట్టి మారుతూ ఉంటాయి. స్థూలంగా లెక్కకడితే సగటున పురుషుడు సంపాదించేది రోజుకు రూపాయ అణన్నర. స్త్రీకి గిట్టేది పదకొండు అణాలు. ఈ రాబడిలో నూరింట 88 పాళ్లు ఆహారానికి, 6.8 పాళ్లు వస్త్రాలకూ ఖర్చు అవుతుంది.

కాఫీ, తేయాకుతోటలలో పనిచేసేవారు పన్నెండు లక్షలమంది ఉంటారని అంచనా.


ఇటీవల కొన్ని రాష్ట్రాలలో, వ్యవసాయకూలీలకు, వారు ఆక్రమించి ఇళ్లు కట్టుకున్న స్థలాలను తిరిగి ఎవరూ తీసుకోకుండా శాసనాలు చేయడం జరిగింది.

కనీస వేతనాలు

కనీస వేతనాల చట్టం 1948లో ఆమోదించబడింది కాని, ఆ కనీసవేతనాలకు నిర్ణయించడానికి అవసరమైన వివరాలు లభించనందువల్ల దీన్ని అమలు పరచడం సాధ్యపడలేదు. ఈ మధ్యనే మూడు రాష్ట్రాలలో దీన్ని ప్రవేశపెట్టారు. త్వరలోనే మరో ఎనిమిది రాష్ట్రాలలో అమలు జరుప సంకల్పించారు. క్రమేపీ మిగతా ప్రాంతాలలో కూడా ప్రవేశపెడతారు. దీన్ని అమలు జరిపే వ్యవహారం రెవెన్యూశాఖే నిర్వహిస్తుంది. ఈ చట్టం అమలు జరుపడం చాల కష్టమైనపని. రెవెన్యూ శాఖలో క్రింది తరగతి ఉద్యోగులలో సానుభూతి కనపడదు. ఈ పరిస్థితులను చక్కబెట్టి, వ్యవహారాలు అదుపుకు రావడానికి కొంతకాలం పడుతుంది. ఇందుకై కృషి జరుగుతోంది.


ఇది జయప్రదం కావడానికి, దీనికి అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని సంఘటితపరచడం చాలా అవసరం.


ఈ కనీసవేతనాల చట్టానికి సంబంధించిన అంశాలు మాత్రం వాస్తవానికి దూరం అనే చెప్పాలి. ★



హైదరాబాద్ హైకోర్టు. దిగువ చిత్రం. మ్యూజియం


విశాలాంధ్ర రాజధాని





ఉస్మానియా విశ్వవిద్యాలయం   దిగువ చిత్రం ఉస్మానియా వైద్యాలయం

హైదరాబాద్ నగరం.



రాజ్యాంతే నరకం ధ్రువం!

ప్రాచీన గాథాలహరి

కాశ్మీర రాజధాని శ్రీనగరంలో అప్పుడప్పుడే ఉదయిస్తున్న సువర్ణ సూర్యకాంతులలో జగదీశ్వరాలయమంతా ఒక సహస్రదళపద్మంలా మెరిసిపోయింది. ఆ నిశ్శబ్ద సూర్యోదయ వేళలో దేవాలయ ఘంటాధ్వనులు మంద్రమంద్రంగా మారు మోగుతున్నాయి.

కాశ్మీర యువరాజు గోపాలవర్మ జగద్ధాత్రీ దేవి పూజ ముగించుకొని జగదీశ్వరాలయమంటపం ఎదట అలాగే నిలబడిపోయాడు. అతడెక్కి వచ్చిన పంచకల్యాణి పక్కనే సిద్ధంగా నిలబడిఉన్నది. మరుక్షణంలోనే అతడక్కడినుంచి తిరిగి వెళ్ళిపోవచ్చునని అర్చకులందరు మనసారా ఆశించారు. కాని అది జరగలేదు. గోపాలవర్మ అలాగే పంచకల్యాణి పక్కనే నిలబడి గాఢంగా ఏదో ఆలోచించాడు. అర్చకులంతా అతనికెదురుగా దోసిలు లొగ్గి నిలుచున్నారు.

"అమ్మవారి ఆభరణాలన్నీ ఏమైపోయాయి? ఒక్కటీ కనబడదేమి?" అని గద్దించి అడిగాడు గోపాలవర్మ.

అర్చకులంతా తలలు వంచేసుకున్నారు. వారిలోఒక వృద్ధుడుమాత్రం తలవంచుకోలేదు.

"ఏం? ప్రత్యుత్తరం ఇవ్వదలుచుకోలేదా?"

మళ్ళీ గర్జించాడు గోపాలవర్మ. వృద్ధుడు "మహాప్రభూ! బందిపోటు దొంగలు ఆభరణాలన్నీ దోచుకుపోయారు." అన్నాడు. గోపాలవర్మ నిర్ఘాంతపోయాడు.

"ఎంతకాలం అయింది!"

"ఒకమాసం కావచ్చింది."

"దొంగలు దొరకలేదా?"

"లేదు"

"మహామాత్యులకీవిషయం తెలిసిందా?"

"మేమంతా ఈ మధ్యనే వారిని సందర్శించి వచ్చాము. వారిది విసివిసవట్టుంగా మాట్లాడ కూరుకున్నారు."

వృద్ధుడు చెప్పిన ప్రత్యుత్తరం విని

గోపాలవర్మ ఒక్క ఊపుతో పంచకల్యాణి మూపుపై కూర్చున్నాడు.

వృద్ధుడిచ్చిన సమాధానంతో అర్చకులందరికీ తిరిగి ప్రాణాలు కుదటపడ్డాయి. వెంటనే గోపాలవర్మ పంచకల్యాణి మహామాత్యునిభవనంవైపు దౌడు తీసింది.

జగదీశ్వరాలయం గోపాలవర్మ పితామహుడు అవంతివర్మ నిర్మింపజేసిన శైవ దేవాలయం. ఆలయ ప్రతిష్ఠ జరిగిన కాలంలో అది శ్రీనగర దేవాగారాలన్నిటిలోకీ మకుటాయమానంగా ఉన్నదని పౌర జానపదులు పరమానంద భరితులైనారు. నాటినించీ ఆ ఆలయంలో నిత్యార్చనాది వ్యవహారాలన్నీ యథావిధిగా కొనసాగిపోతున్నాయి. అంతఃపురంలోని మహారాణు లెందరో అమ్మవారి కెన్నెన్నో అమూల్యాభరణాలు సమర్పించారు. ప్రత్యేకంగా గోపాలవర్మ పితామహి అవంతివర్మ పట్టపుదేవి జగద్ధాత్రీదేవి పాదాలకు రత్న మంజీరాలు సమర్పించింది. పితామహుడు అవంతివర్మ ఆ దేవికి సువర్ణపాద పీఠిక సమర్పించాడు. ఇలాగ కాశ్మీర రాజవంశీయులందరు ఆదేవి కెన్నెన్నో ఆభరణాలు సమర్పించారు.

ఆనాడు యువరాజు గోపాలవర్మ జన్మదినోత్సవం. సూర్యోదయానంతరమే జగద్ధాత్రీజగదీశ్వరులను సేవించుకోవాలని గోపాలవర్మ ఆ దేవాలయ గర్భగుడిలో ప్రవేశించాడు. అతని కెదురుగా ఆభరణాలు లేని వట్టి శిలాప్రతిమలు మాత్రమే ప్రత్యక్షమైనాయి! అతని కళ్ళకు చీకట్లు కమ్ముకున్నట్లయింది. ఎలాగో అలాగ పూజ ముగించుకొని ఇవతలికి వచ్చివేశాడు.

కాశ్మీరరాజధాని శ్రీనగరమధ్యంలోనిర్మించిన శైవదేవాలయంలో పట్టపగలే చౌర్యం జరిగిపోయింది! అది జరిగి దాదాపు ఒక మాసం కావచ్చింది. అయినా ఆబంది

పి. గణపతిశాస్త్రి

పోటు దొంగ లెవరో పట్టుబడలేదు! దండనాయకులు, సేనానాయకులు, మహామాత్యులు మొదలైన మహామహులంతా ఏమైనారు? సుఖంగా మృష్టాన్నం భుజించి నిద్రమత్తులో మునిగిపోయారా? ఎంతటి మహాప్రమాదం! ఎంతటి అపచారం!

యువరాజు హృదయంలో ఈ విధమైన ఆలోచనలెన్నో పొంగి పరవళ్లు తొక్కాయి. ఆ పైన దానికి అతని ఉడుకురక్తంకూడా తోడైంది. గోపాలవర్మకీజన్మదినోత్సవంతో నిండినవి ఇరవైఏళ్ళు.

ఆ ఉడుకురక్తం ఉద్ధృతంలో గోపాలవర్మ శరవేగంతో మహామాత్యుని భవంతి సింహద్వారం సమీపించాడు. వెంటనే అక్కడి ద్వారపాలకులా వార్త మహామాత్యుని కందజేశారు. ఆతడా వార్తవిని నిర్ఘాంతపోయి నిలుచున్నపాటుగా సింహద్వారం సమీపించి రాజోచిత మర్యాదలతో యువరాజును భవంతిలోపలికి తీసుకుపోయాడు. అతని ధోరణి కొంచెం పరిశీలించగానే మహామాత్యునికేదో పెద్ద అవాంతరమే వచ్చి ఉండవచ్చునని అనుమానం తగిలింది. అందుచేత మంత్రి యువరాజు ననేకవిధాల రాజోపచారాలతో శాంతింపజెయ్యాలని శాయశక్తులా ప్రయత్నించాడు. అయినా యువరాజు ముఖంలో ప్రసన్నత స్ఫురించలేదు.

మార్గాంతరంలేక మంత్రి కొంతసేపటికి గోపాలవర్మను నెమ్మదిగా ప్రసంగంలోనికి దింపాడు. గోపాలవర్మ అలాగే రుసరుసలాడుతూ తీవ్రంగా ఇలా గడిగాడు:

"ఇంతకీ శ్రీనగర దండనాథులంతా ఏమైపోయారు?"

"చేతనైనంతవరకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. కాని ఎక్కడా ఆ దొంగలజాడ పొడగట్టనేలేదు!"

"ఎంత అసమర్థత! శ్రీనగర మధ్యంలో శివాలయంలో పట్టపగలే చౌర్యం జరిగింది! మాసం గడచినా చోరులు పట్టుబడలేదు! తమకేమీ ఇది పట్టినట్టే కనబడలేదు!" అన్నాడు యువరాజు దురుసుగా.

"పిలిచినవారంత ఆగ్రహిస్తే నేనేమి విన్నవించగలను! నేనున్నూ రాత్రిం బగళ్లు

నిద్రాహారాలు విడిచి చెయ్యగలిగినన్ని ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాను. ఎంత ప్రయత్నించినా మరి నాకు శక్యం కాలేదు." అన్నాడు మంత్రి.

"అలాంటప్పుడు సమర్థుల కెవరికైనా తమ పదవి అప్పగించడం మంచిదేమో!" అన్నాడు గోపాలవర్మ.

మంత్రి ఈ మాటతో లోపల మండి పడిపోయాడు. నలభై ఏళ్ళుగా నిర్వహిస్తున్న మహామాత్యపదవి కీనాడు ఆ సామర్థ్య దోషం పట్టిందే అని లోలోపల ఎంతైనా కుంగిపోయాడు. రాజసేవ కాకుబాములతో చెరలాటమే అని అతనికి తెలుసును. అయినా లోలోపలి కోపం అంతా అణచివేసుకుని పైకొక చిరునవ్వు నవ్వి బింకంగా ఇలాగన్నాడు. "తమ కింకా ముక్కు పచ్చలారలేదు! ఈ రాజ్య కార్య నిర్వహణలో లోతులింకా తమకు తెలియవు! మరి తమకు నే నేమని మనవి చెయ్యగలను!"

ఈ సమాధానంతో యువరాజు కన్ను లెర్రబడ్డాయి.

"తమ రెవరితో ప్రసంగిస్తున్నారో మరిచి పోయినట్లున్నారు!" అన్నాడు ఆవేశంతో.

"తమ దయవల్ల నా కింకా అంతటి మరుపు రాలేదు! నేను కాశ్మీర యువ రాజులు శ్రీ శ్రీ శ్రీ గోపాలవర్మ ప్రభువర్యులతో ప్రసంగిస్తున్నాను." అన్నాడు మహామాత్యుడు అంతకన్నా బింకంగా!

"ఓహో! అలాగా! అయితే సూర్యాస్తమయానికి పూర్వమే ఆ బందిపోటు దొంగల తల లెగిరిపోయి తీరాలి!" అన్నాడు కాశ్మీర యువరాజు.

"అందుకు సందేహమా! నిరభ్యంతరంగా ఎగిరిపోతాయి! ఆ బందిపోటు దొంగలను అంతగా వెతికివెతికి పట్టుకోవలసిన అవసరం కూడా లేదు. వారంతా మన కాశ్మీర సైన్యంలో యోధులే!" అన్నాడు మంత్రి.

యువరాజు నిర్ఘాంతపోయాడు.

"అయితే ఈ దురంతాలన్నీ మీ ఎరుక లోనే జరుగుతున్నాయన్న మాట!"

"నా ఎరుకలో జరగడమేమిటి మహా ప్రభూ! నేనే స్వయంగా చేయిస్తున్నాను!"

"ఆఁ! అయితే జగదీశ్వరాలయం బందిపోటు దొంగల పేరుతో కొల్లగొట్టించింది మీరేనా?"

"అవును!"

"కాశ్మీర రాజ్యంలో ప్రజ హాహాకారాలు చేస్తున్నా, భరింపరాని పన్నుల భారంలో కుంగిపోతున్నా, కొత్త పన్నులు విధించి పీడిస్తున్న వారు మీరేనన్న మాట!"

"అవును. నిజమే! ఇంత స్పష్టంగా విప్పి చెప్పినా ఇంకా ఎందుకలా ప్రశ్నిస్తున్నారో నాకర్థం కావడం లేదు! కనక నే మీ కీ రాజ్య వ్యవహారాల లోతులు బాగా తెలియవని మనవిచేసుకొన్నాను" అన్నాడు మహామాత్యుడు. ఆపైన హేళగా ఒక్క విషపునవ్వు నవ్వాడు.

గోపాలవర్మ ఇంకా ఆ విషపునవ్వు ఆఘాతంలోనించి కోలుకోలేదు. అలాగే నిశ్చలంగా మంత్రికేసి చూసి—"ఈ అధికారం మీ కెవరిచ్చారు?" అన్నాడు.

"ఇది వెల్లడించడానికి వీలులేదు!"

"వెల్లడించక తప్పదు!"

"రహస్యభంగం చెయ్యమని వాగ్దానం చేస్తే మనవి చేస్తాను." ఈ మాటతో గోపాలవర్మ నోట మాట రాలేదు.

తర్వాత ఒక్క నిమిషం ఊరుకొని మంత్రి కోరినట్లు వాగ్దానం చేశాడు.

"ఇది కాశ్మీరాధీశ్వరులఆజ్ఞ!" అన్నాడు మహామాత్యుడు.

"నిజమేనా?"

"నిజమే! మరి మీరు నా కిచ్చిన మాట తప్పకూడదు!" అన్నాడు మంత్రి

గోపాలవర్మ రెండు చేతులతోను తల పట్టుకుని అలాగే కూర్చుండిపోయాడు.

తరవాత మెల్లిగా తలపైకెత్తి మంత్రికేసి చూసి—

"ఇంతటి దురంతాలకు కారణం?" అన్నాడు.

"కోశాగారంలో ధనాభావమే"

"మా పితామహులు కూడబెట్టిన ధనరాసులన్నీ ఏమైపోయాయో?"

"తమరలాగ ప్రశ్నిస్తే నేనేమి చెప్పగలను?" అన్నాడు మంత్రి.

తిరిగీ యువరాజు రెండు చేతులతోనూ తల పట్టుకొన్నాడు.

"దీనిలో మీ రింతగా మథనపడవలసిందేమీ లేదు. రాజధర్మమే అట్టిది!" అన్నాడు మంత్రి యూదాలాభంగా.

గోపాలవర్మ ఒక పెద్దనిట్టూర్పు విడిచిపెట్టి మంత్రిదగ్గర సెలవుతీసుకు నేమాటకూడా మరిచిపోయి నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. అలాగ నాలుగడుగులు వేసి తిరిగీ వంచ కల్యాణిమీద కూర్చున్నంతవరకు అతని కి శరీరంమీద స్పృహ లేదు!

౨

గోపాలవర్మ రాజప్రాసాదానికి తిరిగి వచ్చివేసి జగదీశ్వరాలయ విషయంలో వేగులవారిని, కొందరు సన్నిహితులయిన రాజాధికారులను కలుసుకొని దేవాలయ వ్యవహారంలో నేకాక, కాశ్మీర రాజ్యపరిపాలనలో జరుగుతున్న దురంతాలెన్నో లోతుగా అవగాహన చేసుకున్నాడు. అవి వింటున్న కొద్దీ అతనిహృదయం పగిలిపోయింది.

కాశ్మీరచక్రవర్తి శంకరవర్మ పరిపాలన ప్రారంభంలో కాశ్మీరరాజ్య ప్రాభవ వైభవాలు భారతవర్షంలో అంతటా ప్రతిధ్వనించాయి.

గోపాలవర్మ అప్పటికింకా చాలా చిన్న వాడు. అయినా పౌరజానపదులు శంకరవర్మయెడలచూపే భక్తిప్రపత్తులు, గౌరవాదరాలు గోపాలవర్మకు ఇంకా బాగా జ్ఞాపకం ఉన్నాయి. అతని పితామహుడు అవంతివర్మ మహాధర్మాత్ముడని ప్రసిద్ధికెక్కిన మహితాత్ముడు. అతని తరవాత రాజ్యానికి వచ్చిన శంకరవర్మ ధర్మపాలనలో అవంతివర్మను కూడా అతిక్రమించివేస్తున్నాడని ఆనాడు ప్రజలనేకవిధాలుగా ప్రశంసించేవారు. చాలాకాలం గడచినా ఆ విషయాలన్నీ గోపాలవర్మకు ఇటీవలే జరిగినట్లున్నాయి.

కాని క్రమక్రమంగా కాశ్మీరాధీశ్వరుడు శంకరవర్మ హృదయంలో విపరీతమైన ధనలోభం బయలుదేరింది. కొన్ని కొన్ని దుర్వ్యసనాలేవో అలవడ్డాయనికూడా ప్రజలు గుసగుసలాడుకొనేవారు. అవేమీ పైపైకి అంత స్పష్టంగా కనిపించకపోయినా భయంకరమైన ధనలోభమూ, దానివలన ఏర్పడిన క్రౌర్యమూ అతనిలోలోపల బాగా పెచ్చు పెరిగిపోయాయి తనతండ్రి హృదయంలో బయలుదేరిన క్రౌర్యప్రవృత్తి గోపాలవర్మకు తెలిసినప్పుడు అతని హృదయం ఎంతో అలమటించిపోయేది. తండ్రిహృదయంలో హఠాత్తుగా బయలుదేరిన ఈ పాశవిక క్రౌర్యప్రవృత్తికి కారణమేమా అని లోలోపల అతడెంతో మథనపడుతూండేవాడు.

క్రమక్రమంగా శంకరవర్మహృదయంలో క్రౌర్యంతోబాటు ప్రజలను పీడించే దుష్టప్రవృత్తికూడా బాగా మితిమీరిపోయింది. అవంతివర్మ తన ఆస్థానంలో ప్రతిష్ఠించిన ప్రసిద్ధకవీశ్వరులందరికీ దేవిడీ మన్నాలు జరిగిపోయాయి. వారందరు మరి వేరే గత్యంతరం లేక శ్రీనగర రాజవీథులలో యాయవారము మొదలైన నీచవృత్తు లవలంబించి జీవితాలు వెళ్ళ

★ రాజ్యాంతే నరకం ధ్రువం! ★

…యిచ్చుకుంటున్నారు. ఇంతేకాక కృషి వాణిజ్యాది వృత్తులతో జీవించే వారి వరుమానాలపై విపరీతమైన పన్నుల భారాలు విధించి వారందరినీ పీల్చి పిప్పిచెయ్యడం మొదలుపెట్టాడు. ఈ క్రూర పరిపాలనతో క్రమక్రమంగా కాశ్మీర ప్రజానీకంలో హాహాకారాలు చెలరేగాయి. రాజకోశాగారంలో ధనలోపం వల్లనే ఇలాంటి పరిస్థితు లేర్పడుతున్నాయేమోనని గోపాలవర్మ భావించేవాడు. కొంతకాలం పాటు ఆ దుష్పరిపాలన కంతటికీ మహామాత్యుని క్రౌర్యమే కారణమని అతడూహించేవాడు. ఆ పైన బందిపోటు దొంగల మిషతో శ్రీనగరంలో ప్రసిద్ధ దేవాలయాలు కూడా కొల్లగొట్టించే భీషణ క్రౌర్యం కూడా బయటపడిపోయింది. దీనికి వెంటనే ప్రతీకారం జరిపించకపోతే క్రమక్రమంగా ప్రజల్లో విద్వేషాగ్ని చెలరేగగలదని గోపాలవర్మకెంతో భయం వేసింది. విద్వేషాగ్ని మాట అటుంచినా ఆ అధర్మ పరిపాలన తలుచుకుంటే గోపాలవర్మ హృదయం దహించుకుపోయింది.

ఇది ఎలాగో అలాగ అరికట్టి తీరాలనీ కాశ్మీరంలో తిరిగీ అవంతివర్మ కాలంనాటి ధర్మ పరిపాలన నెలకొల్పించాలనీ గోపాలవర్మ నిశ్చయించుకొన్నాడు. ఒకసారి తండ్రిగారితో ఆ విషయాలన్నీ ముఖత ప్రసంగించాలని నిశ్చయించుకొన్నాడు. అంతమాత్రంచేత ఆయన తన క్రూర ప్రవృత్తి మానివేసే అవకాశం కలగదేమోనని అతని అనుమానం. ఏమైనా ఇది సాధించి తీరాలనే దృఢనిశ్చయం కూడా వెంటనే గోపాలవర్మలో బాగా బలపడిపోయింది. అంతలోనే అతనికొక వరప్రదానవిషయం స్ఫురణకు వచ్చింది. దానితో తప్పకుండా తన కార్యం సాధించుకోవచ్చునని గోపాలవర్మ లోలోపల ఎంతో మురిసిపోయాడు. ఆవర ప్రదానవిషయం ఇది:

ఒకనాడు గోపాలవర్మ శంకరవర్మతో కలిసి కాశ్మీర పరిసరారణ్యంలో మృగయావినోదం చూడడానికి వెళ్లాడు. ఆ మృగయా వినోదంలో గోపాలవర్మ పాల్గొనలేదు. కాశ్మీర మహారాజు శంకరవర్మ పరిజనులతో కలిసి అరణ్యంలో వేటాడుతున్నాడు. వేట తమకంలో ఎవరూ వెనకచూపు లేకుండా ముమ్మరంగుకు సాగిపోతున్నారు. ఆనాడు శంకరవర్మ ఎన్నెన్నో క్రూరజంతువులను సంహరించివేశాడు. అంతలోనే ఒక చిరుతపులి అమాంతంగా వెనకనించి ఎగిరివచ్చి శంకరవర్మ మీదికి లంఘించింది.

కనురెప్పపాటులో అది శంకరవర్మ కంఠం చీల్చి వేసేదే! కాని ఆ వెనకనే నిలుచున్న గోపాలవర్మ ఒక్క బల్లెం పోటుతో దానిని అక్కడే కూల్చి వేశాడు. శంకరవర్మ దానికెంతో సంతోషించి గోపాలవర్మతో—

"నాయనా! నీకేమి వరం కావాలో కోరుకో!" అన్నాడు.

గోపాలవర్మ ఆ వరం అవసరం వచ్చినప్పుడు స్వీకరిస్తానని అన్నాడు. శంకరవర్మ అతని దూరదృష్టికి మరింత సంతోషించాడు. అది జరిగి అప్పుడే అయిదారు నెలలయిపోయింది. ఆ వరం నేడు అడుగవలెనని గోపాలవర్మ నిశ్చయించుకొన్నాడు. పైగా అది గోపాలవర్మ జన్మదివసం కూడాను. అందుచేత తండ్రి తప్పక తనకోరిక నెరవేర్చవచ్చునని అతని ఆశ. ఆ వరప్రదానం చెయ్యకుండా తప్పించుకుపోవడానికిక మార్గాంతరమేమీ లేదు. ఆ ఆనందంతో ఉప్పొంగిపోతూ గోపాలవర్మ నెమ్మదిగా శంకరవర్మ ప్రాసాదానికి బయలుదేరాడు.

దారిలో అతనికి శ్రీనగరం అంతా బీద ప్రజ దీనవదనాలతో పాడుపడిపోయినట్టు కనబడింది. ఆ దీనదరిద్రుల దైన్య జీవితం చూచేసరికి అప్రయత్నంగా అతని కళ్లమ్మట వేడివేడి కన్నీటిధారలు ప్రవహించాయి.

అతడు రాజభవనం సమీపించేసరికి రెండు ఝాములయింది. ఆనాడు గోపాలవర్మ

జన్మదినోత్సవం కావడంవల్ల కాశ్మీర మహారాజు శంకరవర్మ సుఖంగా సింహాసనం మీద కూర్చుని అత్యంతాప్తులయిన నలుగురయిదుగురు రాజబంధువులతో ఇష్టాగోష్ఠి జరుపుతూ ఎంతో ఉల్లాసంగా ఉన్నాడు. కొంచెం దూరంగా నలుగురైదుగురు విట విదూషకులు కూర్చున్నారు. తమలోతామే వేవో ఛలోక్తులు విసురుకొంటున్నారు.

యువరాజు లోపలికి ప్రవేశించేసరికి విట విదూషకులంతా శంకరవర్మకు కొంచెం దూరంగావెళ్లి కూర్చున్నారు. వెంటనే తమ తమ ఛలోక్తులు కూడా కట్టిపెట్టివేశారు.

శంకరవర్మ అతన్ని చూస్తూనే ఎంతో ఆప్యాయంగా సరసన కూర్చోబెట్టుకొని—

"ఏం పంచకల్యాణి బాగున్నదా ?" అన్నాడు. అది శంకరవర్మ కుమారునికి జన్మదినోత్సవం కానుకగా బహూకరించిన ఉత్తమాశ్వం. ఆ విషయం గోపాలవర్మకు హఠాత్తుగా స్ఫురించింది.

"అవునవును! చాలా చక్కని ఉత్తమాశ్వం!" అన్నాడు గోపాలవర్మ కొంచెం కంగారుగా.

శంకరవర్మ అతని ధోరణి పసికట్టివేశాడు. అతడు జన్మదినోత్సవంనాడావిధంగా నిరుత్సాహంగా ఉండడానికి కారణమేమో అతనికి బోధపడలేదు. ఎంతో ఆప్యాయంగా దగ్గరకు పిలిచి దానికి కారణమేమని అడిగాడు. గోపాలవర్మ ఎంతో వినయవిధేయతలతో అతనికి ప్రత్యుత్తరం ఇచ్చాడు.

"మీరు నా కోక వరం ప్రసాదిస్తామన్నారు! జ్ఞాపకం ఉన్నదా ?"

"లేకేమి !"

"నే నావరం ఈనాడు కోరుకుంటున్నాను."

శంకరవర్మకు లోలోపల కొంచెం అనుమానం తగిలింది. అయినా అది పైకి కనబడనీయలేదు :

"ఓ! అలాగే కోరుకోవచ్చును! దానికేమి! ఈవేళ జన్మదినోత్సవం కదా !"

గోపాలవర్మ తిరిగి ఎంతో వినయంగా—

"తప్పకుండా నేను కోరుకున్న వరం అనుగ్రహించాలి." అన్నాడు.

శంకరవర్మకు దీనితో అనుమానం బాగా దృఢపడింది :

"ఏమిటావరం !" అన్నాడు.

గోపాలవర్మ మొదట కొంచెం తటపటాయించాడు. తరవాత కాశ్మీర ప్రజ అధర్మపరిపాలకుల పదాఘాతం కింద పడి సతమతమైపోతున్నదనీ ఇటువంటి అధర్మపరిపాలన పూర్వకాలంలో ఎన్నడు కనీవినీ ఎరగమని ప్రజలంతా వాపోతున్నారనీ తిరిగి పితామహులు అవంతివర్మకాలంనాటి ధర్మపరిపాలన ప్రతిష్ఠించవలసినదనీ అదే తన వరమనీ గోపాలవర్మ ఎంతో వినయపూర్వకంగా విన్నవించాడు.


మహారాజామాట విని ఒక్కసారిగా విరగబడి నవ్వాడు.

అదిచూచి 'ఎంత విషపు నవ్వో!' అనుకున్నాడు గోపాలవర్మ.

కనుబొమ్మలు కలిసిపోయి ఒకే నీలరేఖగా స్ఫురించే శంకరవర్మ ముఖకవళికలో ఆ విషం అంతా మూర్తీభవించినట్లు స్ఫురించింది.

తరవాత కాశ్మీరాధీశ్వరుని ముఖంలో ఆ నవ్వంతా ఒక్కసారిగా అదృశ్యమైపోయింది. వెంటనే కొంత విషాదచ్ఛాయ గోచరించింది. తన కుమారుడే ఆవిధంగా తన పరిపాలన నిందించేసరికి అతని నెవరో వెనకనించి ఒక్కసారిగా వాడిశూలంతో పొడిచి

(54-వ పేజీ చూడండి)



9

అపూ వాళ్లయింటికి అల్లంత దూరంలో పెద్ద రావి చెట్టు ఒకటుంది. వసారాలో కాని, కిటికీదగ్గిర కాని నుంచుంటే ఆ చెట్టు చిటారుకొమ్మలు కనపడతాయి. అపూ అప్పుడప్పుడు ఊరికే అటుకేసి చూస్తూ నుంచునేవాడు. అలా చూస్తున్నప్పుడు ఏ దూరదేశాల కథలో ఎన్నెన్నో గుర్తుకొస్తూ ఉండేవి. ఆ దేశాలు ఏవో, అవి ఎక్కడున్నాయో తెలీదు. అవన్నీ వాళ్ళ అమ్మ చెప్పేకథల్లో రాజకుమారుల దేశాలు.

బహు దూరదేశాలకథలు గుర్తుకు రావటంతో, వాడి లేతమనస్సు చిలికినట్లయి, ఎక్కడలేని ఆనందం కలిగేది. నీలిమబ్బులే దూరమో, నీలి మైదానం ఎక్కువదూరమో తెలియదు. ఇంకొకర్ని అడగాలన్నా చేతకాదు కాని ఇవన్నీ తలపుకు రావటంతో వాడిమనస్సు ఎక్కడికో తేలిపోయేది కాని చిత్రం! ఆ ఊహలు ఎంతోదూరాలు వెళ్ళి వెళ్ళి చటుక్కున అమ్మపైకి మళ్లేవి. అప్పుడు వాడిమనస్సు అమ్మకోసం తహ తహలాడిపోయేది ఊహను తేలిపోయే దూరాలలో అమ్మ ఉండేది కాదు. ఇలా ఎన్నిసార్లయింనో!

విశాల ఆకాశంలో ఎక్కడో ఒకచోట గ్రద్ద ఒకటి గాలిలో తేలుతూపోయేది. అది పోను పోను చిన్నదై, నలుసంతై చివరికి, తాటితోపు చాటులో మాయమయ్యేది. అది కనపడకుండా పోయేవరకూ అటే చూస్తూ నుంచుని, ఇహ ఒక్క పరుగులో వంటయింటి వసారాలోకి వచ్చి వాలేవాడు పనిచేసుకుంటున్న అమ్మను ఆపళంగా వాటేసుకునేవాడు.

'అపూ! అబ్బబ్బ! ఏం పనిరా యిది. ఉండుండు. అంటచేతులు కనపట్టంలా! నా తండ్రికదూ! నా బంగారుకొండకదూ! ఇదుగో చూడు, నీకోసం చేపలకూర! నీకిష్టం కాదూ! నా తండ్రి చక్కగా నామాట వింటాడు. కాదూ!" అంటూ బుజ్జగించేది.

భోజనాలయాక ఒకరోజు మధ్యాహ్నం పూట అమ్మ ఏ కిటికీపక్కనో కొంచు పరుచుకు పడుకుని చిరిగిపోయిన కాశీదాస మహాభారతగ్రంథం తీసి రాగవరసలో చదివేది ఇంటపక్క కొబ్బరిచెట్టుమీద పాలపిట్ట కూసేది అపూ పలకమీద క చాలు దిద్దుకుంటూ, తల్లి చదివే భారతం శ్రద్ధగా వినేవాడు 'రెండు ఆకులు సున్నంరాసి తేవె గుర్రా!' అనేది అమ్మ 'ఆ పిడకచేసుకునే ముసిల్ది కైలాసానికి వెళ్ళిన కథ చెప్పవే అమ్మా'' అని అడిగేవాడు అపూ.

"అదా! ఆ కథ ఇందులోనిది కాదురా. 'అన్నదా మంగళ' లోది"—అంటూ ఆమె మళ్లీ తనచదువు సాగించేది

అపూ తల్లిదగ్గిరచేరి, ఆమె ముఖం రెండు చేతులా పట్టుకుని, నోటికి నోరందించి 'అమ్మా! నా కొంచెం తమ్మ పెట్టవూ' అని అడిగేవాడు. తల్లి వాడి నోట తమ్మ అందించి 'అబ్బ! తెగ పగులా! అది దూక

* * *

జరిగిన కథ:—

నిశ్చిందిపురం బెంగాల్‌లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్ అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరం పెట్టాడు. దుర్గ పుట్టిన చాలఏళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇంట్లో ఎప్పుడుచూసినా 'ఇవాళ ఎలా గడుస్తుందిరా భగవంతుడా' అనే చింతే. కాని పిల్లల కిదేం పట్టింది? దుర్గకి ఒక్కనిమిషం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఏ తోటలోనో, ఏ చెట్టుకిందనో ఆడుకుంటూ ఉంటుంది. అపూ ఎప్పుడూ ఊహాలోకంలోనే గడుపుతాడు. వాడికి ప్రతిదీ కొత్తే. ప్రతీదీ వింతే. వాడి జీవితపరిధిలోకివచ్చే ప్రతి సాధారణవిషయమూ అసాధారణమైనదిగా, అద్భుతమైనదిగా వాడికి కనిపిస్తుంది.

అనువాదం:

మద్దిపట్ల సూరి



"పథేర్ పాంచాలి"—

మహాభారతంలో రథికులు పద్దెనిమిది రోజులే యుద్ధం చేసి కీర్తి గడించారు కాని వాళ్లే ఈనాడు బతికి వస్తే కీర్తి సంపాదించటం ఇప్పుడంత సులువుకాదని తెలిసివచ్చేది. (చిత్రకారుడు దివాకర్ సేన్‌రాయ్)

★ పథేర్ పాంచాలి ★

...ని మాలంగా. ఇలాంటి పద్యాలని వినుకురాకండీ అని సంతోషిస్తున్నట్టు చెప్తూనే ఉంటూ. "కానేం లాభం!" అనేది.

కిటికీ అవతల వెదురు పొదలతో, ఇంకా అవతల దూరంలో అడవిలోకి చూస్తూ, మహాభారతం,—అందులోనూ కురుక్షేత్ర యుద్ధం అలా తన్మయుడై ఆలకిస్తూ ఉండేవాడు. మహాభారతంలోకల్లా వాడికి కర్ణుడి కథ ఎంతో బాధించేది. కర్ణుడంటే వాడికి అదో రకం మమకారం. రథ చక్రం భూమిలో దిగబడిపోయింది. దాన్ని పెకలించడానికి కర్ణుడు ప్రాణాలొడ్డి పెనుగులాడుతున్నాడు. నిరస్త్రుడు, అసహాయుడు, విపన్నుడైన కర్ణుడు వద్దు వద్దని వేడుకున్నా వినక అర్జునుడు బాణం వదిలి చంపేశాడు! అమ్మ నోట ఇది విన్నప్పుడల్లా వాడి పసి హృదయం కరుణతో నిండిపోయేది. ఎంత ఆపుకుందామన్నా కన్నీరాగేది కాదు. కళ్లు మూసుకునేవాడు; లేత బుగ్గలమీద నీరు ధారలు కట్టేది.

మానవులకు దుఃఖంలో కన్నీళ్లు రావడంలో కూడా ఉండే ఒక విధమైన అలౌకికానందం వాడికి నవ చైతన్యంతోపాటు ఏదో నవ్యానుభూతి కలిగించేది.

యథార్థ జీవనయాత్రలోని దైన్యంలో, కన్నీటిలో, మృత్యువులో, హతాశలో, వేదనలో మనుష్యులకు ఏకరుణాభావం కలుగుతుందో అదే కరుణభావం ఈ పాతపుస్తకంలో చిరిగిపోయిన పుటల మధ్య వాసనల్లోనూ, పాట చదివే అమ్మ తియ్యని కంఠంలోనూ వాడికి అనుభవానికొచ్చి, ఆ మధ్యాహ్నపు మండుటెండలో ఆ పసి చూపుకేదో జీవనయాత్రామార్గం నిర్దేశమైనట్టుండేది.

ప్రొద్దు వాటారకి తిరిగిపోతూంటే వాళ్ళమ్మ ఇవతలి పనులు చేసుకోటానికి వెళ్ళిపోయేది. అపూ బయటికి వచ్చి, వసారా కటకటాల నానుకుని ఆ రావిచెట్టుకేసి చూస్తూ నుంచునేవాడు. చైత్ర వైశాఖ మాసాల యెండలకి రావిచెట్టు చివరలు దుమ్ముకొట్టుకుని ఉన్నట్లో, సాయంకాలపు నీరెండచిటారుకొమ్మల్లో చిక్కుకుని కదలలేకపోతున్నట్లో కన్పించేది వాడికి. ఆ చెట్టుకేసి చూస్తున్నకొద్దీ వాడి మనసు ఎలాగో అయిపోయేది. కర్ణుడింకా ఎందుకో, ఆ రావిచెట్టుకి అటుపైపు ఎక్కడో దూరంగా అంతరిక్షపు టంచుల్లో ఈనాటికీ భూమిలో క్రుంగిన రథచక్రంతో ప్రాణాలొడ్డి పెనుగులాడుతూనే ఉన్నాడు; రోజు తరవాత రోజు, యుగయుగాలుగా పెనుగులాడుతూనే ఉన్నాడు. కర్ణుడు మహా వీరుడు! ఎవరికీ జాలి కలగదు! ఆ కరుణ భావం సమసిపోనిది. యుద్ధంలో విజయి అర్జునుడు కాడు! అతడికి రాజ్యం లభించింది. మన్నన లభించింది. కాని రథమెక్కి కూచుని విపన్నుడైన శత్రువుపై బాణం వేసి నాశం చేశాడు. విజయుడు ముమ్మాటికీ కర్ణుడే! మానవులకు ఎన్నటికీ ఆరని కన్నీట జాలికలిగించి, మానవుల వేదనానుభూతిలో మూర్తీభవించి శాశ్వతంగా ప్రకాశిస్తున్న కర్ణుడే విజయుడు!

ఒకరోజు భారత గాథ వింటూంటే, అందులో యుద్ధం అనేదాన్ని గురించి బొత్తిగా తక్కువ రాశారని అపూకి తోచేది. ఆ వెలితి తీర్చుకొని, ఆ యుద్ధం అనేదాన్ని గురించి ఆశ తీర్చుకోడానికి ఒక ఉపాయం కనిపెట్టాడు. సన్నని వెదురు చువ్వతో విల్లు అమ్మ తయారు చేసుకున్నాడు. అది పట్టుకుని ఇంటి ముంగిలిలోనో, వెనక వెదురుపొదల్లోనో అటూ ఇటూ తిరుగుతూ బాణం ఎక్కుపెట్టుతూ ఊహాకల్పనలో చుట్టూ కురుక్షేత్రం నిర్మించుకునేవాడు. తనలోతనే అనుకునేవాడు: ద్రోణుడొక్కసారి పదిబాణాలు వదిలాడు. అప్పుడు అర్జునుడేం చేశాడు! ఒక్కసారే రెండువందల బాణాలు వేశాడు! ఆపైన—అబ్బా! ఎంత ఘోరయుద్ధం! బాణపరంపరలతో దిక్కులు నాలుగూ చీకటైపోయాయి! (ఎవరెన్నెన్ని బాణాలు వేస్తే తనకి తృప్తిగా ఉంటుందో అన్నన్ని ఊహించుకునేవాడు. కాని అమ్మ చదివే కాశీదాస మహాభారతంలో వర్ణించిన యుద్ధక్రమాన్ని మాత్రం తప్పేవాడు కాదు.) ఇహ అర్జునుడు మళ్ళీ ఏంచేశాడు? దాలూకత్రీ పుష్పకుని రథం మీంచి దూకాడు. అబ్బ! అప్పుడు జరిగిన యుద్ధం చెప్పతరం కాదు. దుర్యోధనుడు వచ్చాడు, భీముడు వచ్చాడు. బాణాలతో ఆకాశం అంతా అంధకారమయమైపోయింది. ఎక్కడా ఏమీ కనపడ్డంలేదు...

మహాభారతంలో రథికులు పద్దెనిమిది రోజులే యుద్ధంచేసి కీర్తిగడించారు. కాని వాళ్లే ఈనాడు బతికివస్తే కీర్తి సంపాదించటం ఇక్కటింత సులభం కాదని తెలివచ్చేది. పసివాడి కొంచెం తెరవరకూ మాసాల తరబడి ఎడతెగకుండా యుద్ధం చేయటం మాటలేనా?

ఎండా కాలం. వైశాఖమాసం సగం గడిచిపోయింది.

నీలమణి రాయిగారి నివేశనం పైపు అడవి చివర - మధ్యాహ్న వేళ - ద్రోణాచార్యుల వారు పెద్దచిక్కులో పడ్డారు, కపికేతనుని రథం కంఠంమీదికి వచ్చేస్తోంది.

కనురెప్పపాటులో గాండీవంతో బ్రహ్మాస్త్రప్రయోగం జరిగిపోతుంది. కురుసైన్యంలో హాహాకారాలు మిన్ను ముట్టుతున్నాయి-ఇంతలో శాఖోటకవనాని కవతలనుంచి "ఏమిట్రా అపూ అది?" అని వినపడింది. అపూ త్రుళ్లిపడి, ఆకర్ణాంతం ఎక్కుపెట్టిన విల్లును చటుక్కున వదిలేసి, ఆవైపు చూశాడు. వాళ్ళ అక్క ఆ అడవిమనిష్లా, నిలబడి వాడికేసి చూసి కిలకిల నవ్వుతోంది. అపూ అటుకేసి చూడగానే "ఏమిట్రా! పిచ్చి సన్నాసీ! నీలో నువ్వు గొణుక్కుంటూ, కోతుల్లా చేతులూ ఎగరేస్తూ! ఏమిట్రా అది?" అంటూ దుర్గ ఒక్క పరుగునవచ్చి, వాడి లేత బుగ్గముద్దెట్టుకుని, "నువ్వు ఒట్టి పిచ్చివాడివిరా ఎక్కడో! నీలో నువ్వు ఏమిటి గొణుక్కుంటున్నావ్?" అని అడిగింది.

అపూ సిగ్గుపడిపోతూ "ఫో: నేనేం గొణుక్కుంటున్నానేమిటి." అన్నాడు.

దుర్గ ఎలాగయితేనేం ఆఖరికి నవ్వు ఆపుకుని "రారా నాతో" అంది.

అపూ చెయ్యిపట్టుకుని ఆ అడవిలోకి తీసుకెళ్ళింది దుర్గ. కొంతదూరం వెళ్ళాక నవ్వుతూ చేత్తో చూపిస్తూ "అదిగో, చూశావా, ఎన్ని రామాఫలాలుపండాయో: వాటినిప్పుడు ఏలా కోయటం చెప్పు?" అని అడిగింది.

"అప్పునే! చాలా ఉన్నాయి అక్కా! కర్రతో కొంతోనయినా అందుకుని కోయకూడదూ?" అన్నాడు అపూ.

"నువ్వేం పనిచెయ్యి. పరుగు పరుగున వెళ్లి మనయింట్లో కొంకి కర్ర పట్టుకురా, కొంకి కర్రతో లాగి పట్టుకొని కోయవచ్చు, చూడు ఇంకా మరి—"

"నువ్విక్కడే ఉంటావా? ఇక్కడున్నట్లు వచ్చేస్తాను నేను—"

అపూ కొంకికర్ర తీసుకొచ్చాక, ఇద్దరూ కలిసి ఎంతసేపు ప్రయత్నించినా నాలుగయిదు పళ్లకంటె ఎక్కువ అందలేదు. చెట్టు చాలా ఎత్తుంది. చిటారుకొమ్మన ఉన్న పళ్లు కొంకికర్రకి అందలేదు.

"చాల్లే, ఇప్పటికివి చాల్లే, పోదాంపద. స్నానానికి వచ్చినపుడు అమ్మనుకూడా తీసుకువద్దాం."

అమ్మకయితే బాగా అంగుతాయి. ఆ పళ్లు నా చేతికిచ్చి, ఈ కర్రనువ్వుపట్టుకో... ఒరే, అడ్డబాస పెట్టుకుంటావురా?" అన్నది దుర్గ.

నేల బారుగా ఉన్న ఒక పొదమీది తీగెలో తెల్లటి పూలు చూసి, దుర్గ చేతిలో పళ్లు కింద పెట్టి, ఆ పూల గుత్తులు అందుకుని పూలు కోయసాగింది.

"ఇలారా అందకా్కగా అడ్డబాస పెడతాను నీకు!" అన్నది.

వాళ్ళ అక్కకి అలాంటి పూలు కోసుకొచ్చి అడ్డబాసలాగా పెట్టుకోవటం అంటే చాలా యిష్టం. దుర్గ ఆ అడివంతా గాలించి ఇలాంటి పూలు ఎప్పుడూ తీసుకువస్తూ ఉంటుంది. ఇదివరకు చాలాసార్లు తమ్ముడికిలాంటి అడ్డబాస పెట్టింది. కాని వాడికి అది ఇష్టం లేదు.

'నాకు అడ్డబాస వద్దు, ఏం వద్దు' అని చెప్పుదామని మనసులో అయితే వాడికి ఉంటుంది, కాని అక్క భయంతో వాడా మాట పైకి చెప్పలేడు. అక్కకి కోపం తెప్పించటం వాడికేమాత్రం ఇష్టం ఉండదు. ఎందుచేతంటే, అక్క తోటలూ, దొడ్లూ తిరిగి రేగిపళ్లు, జామపళ్లు, సీతా ఫలాలు, మామిడికాయలు— అన్నీ తీసుకొచ్చి వాడికి చాటుగా పెడుతూ ఉంటుంది. అవన్నీ అపథ్య వస్తువులని ఇంట్లో అయితే తిననీయరు. కనుక అక్క మాటను కాదనగల నిబ్బరం ఉండదు వాడికి

దుర ఓ రెమ్మ తుంచి, దాని జిగురుతో ఓ తెల్లటి పువ్వును వాడి ముక్కుకి అతికించి, తానూ ఒకటి అతికించుకుంది. తర్వాత తమ్ముడి గడ్డం పట్టుకుని ముఖం తన వైపుకి తిప్పుకుని, "ఎంత బావుందో చూశావా? వాహ్ చాలా బావుంది. పద, అమ్మకి చూపించుదువుగాని" అన్నది.

అపూ సిగ్గుపడుతూ "వద్దు అక్కా!" అన్నాడు.

"రా, తీసిపారేసుకోకు. చక్కగా ఉంది."

ఇంటికి వచ్చి దుర్గ రామా ఫలాలు వంటయింటి వసారాలో పెట్టింది. సర్వజయ వంటచేస్తూ వాటిని చూసి, ఎంతో సంతోషంతో "అవి ఎక్కడివే?" అని అడిగింది.

"ఆ నిమ్మతోటలోవి. ఎన్ని ఉన్నాయనుకున్నావ్! రేపు నువ్వు వచ్చి కోస్తావా అమ్మా! ఎర్రగా ఎంత బాగా పండాయనుకున్నావ్?—"

దుర్గ చాటున ఉండకుండా ఎదుటికి వచ్చి "మాడు ఇంకా" అన్నది.

అపూ అడ్డబాస పెట్టుకుని అక్క చాటున దాక్కున్నాడు. సర్వజయ నవ్వుతూ "అరె! వీడికేమిటే, ఇంకా ఎవరో అనుకున్నాను. గుర్తుపట్టనేలేదు నేను—" అన్నది.

అపూ సిగ్గుపడి, ముక్కునవున్న పువ్వు కాస్తా చటుక్కున లాగేసుకుని—"అక్క అతికించింది వద్దంటూంటే" అన్నాడు.

దుర్గ ఉన్నట్టుండి—"రారా, అపూ! అదుగో ఎక్కడో డబడబ మోత విన్పిస్తోంది. కోతుల్ని ఆడించేవాడెవడో వచ్చినట్లున్నాడు. రా, చప్పున రా" అన్నది.

ముందు దుర్గ, వెనకాల అపూ ఇద్దరూ గబగబా ఇంట్లోంచి వీధిలోకి పరుగుతీశారు. కోతీ లేదు, ఏం లేదు. బొందిలి 'సీను' జంగిడి నెత్తినెట్టుకుని మిఠాయి అమ్ముతున్నాడు వీధిలో. అతడి దుకాణం ఆ వీధిని ఉంది. ఇదికాక అతడు బెల్లం, ధాన్యం వర్తకం కూడా చేస్తూ ఉండేవాడు కాని పెట్టుబడి ఆట్టే లేకపోవటంతో ఆ వర్తకం యేంకలిసి రాలేదు. అప్పటినుంచి నెత్తిన తట్టపెట్టుకుని బంగాళా దుంపలూ - అవీ అమ్మటం మొదలెట్టాడు. అదీ కలిసి రాకపోవటంతో కొన్నాళ్లు జోలెకట్టుకు తిరిగాడు. తర్వాత ఓసారి హఠాత్తుగా సున్నపురాళ్లు అమ్ముతూ ప్రత్యక్షమయాడు. చేపలు ఒక్కటిమినహా అతడు అమ్మని వస్తువనేది లేదంటారు చూసిన వాళ్లు. రేపు * దశహరా. అందుచేత ఇవాళే అందరూ 'సందేశ్' మొదలయిన తినుబండారాలు కొని ఉంచుకొంటారు. సీను హరిహరరాయ్ గారి ఇంటిముందునుంచే వచ్చినా వాళ్ళ యింట్లోకిమాత్రం వెళ్ళలేదు. ఆ యింట్లో వాళ్లు ఎప్పుడూ ఏమీ కొనరని తెలుసతడికి. అయినా దుర్గ, అపూ గుమ్మంలో వచ్చి నుంచోటం చూసి, "ఏమిటి? కావాలా?" అని అడిగాడు.

అపూ అక్క ముఖంకేసి చూశాడు. దుర్గ "వద్దులే" అంది.

సీను భువనముఖర్జీగారింటికి వెళ్లి, నెత్తినున్న జంగిడి దించేసరికల్లా ఇంట్లో పిల్లలంతా గొడచేసుకుంటూ వచ్చి అతడి చుట్టూ చేరారు. భువనముఖర్జీ బాగా కలవాడు. ఇంటిముందు అయిదారు ధాన్యం పురులూ, పాతర్లూ ఉంటాయి. ఈ ఊళ్ళో పాలం - పుట్రా విషయంలో కాని, డబ్బు దస్కం విషయంలో కాని అన్నదా రాయ్ తర్వాత అతడి పేరే చెప్పాలి.

భువనముఖర్జీ భార్య పోయి, చాలాకాలమయింది. అతడి మూడో అన్నగారి భార్య వితంతువు. ఆమే యిప్పుడీ యింటికి యజమానురాలు.

ఆవిడకు వలభైయేళ్లుపైగా ఉంటాయి. ఆమె చాలా కటిక గుండె గల మనిషి అనే ఖ్యాతికద్దు.

* జ్యేష్ఠశుద్ధ దశమి, గంగాదేవి జన్మదినం. ఆ రోజున గంగను కొలిస్తే దశవిధ పాపాలను హరిస్తుందట.

ఆమె ఒక పాత ఇత్తడిపళ్లెం తీసుకొచ్చి, సీనుదగ్గిర 'సందేశ్' 'వాతాసా' మొదలైన తినుబండారాలు దశమిపూజనాటికని కొన్నది. భువనముఖర్జీ గారిపిల్లలు, ఆమె కొడుకు సునీలుడూ అక్కడే నుంచుని ఉన్నారు. వాళ్ళకి తినడానికి ఏదో కొని పెట్టింది. ఇంతలో అపూని వెంటపెట్టుకొని దుర్గ సీనువెనకాలే వాళ్ళయింటికి వచ్చి, మెల్లగా మెల్లాలోకివచ్చి నుంచోటంచూసి ఆవిడ తనకొడుకు సునీల్‌ని "పోయి, వసారాలో కూర్చుని తిను, దేముడి ప్రసాదం ఇది, కిందపడిందంటే మైలపడిపోతుంది" అంటూ మెడమీద చెయ్యివేసి త్రోసింది.

సీను జంగిడి నెత్తి నెత్తుకుని మరోయింటికి వెళ్లాడు. "రారా, అపూ టునూ వాళ్లయింటికి వెళ్లి చూద్దాం" అన్నది దుర్గ.

వీళ్లు వీధి గుమ్మం దాటారో లేదో, ఆవిడ మూతి విరుచుకుని, "ఇంత నాకిరిగొట్టు పిల్లని ఎక్కడా చూడలేదమ్మా! తను ఇంటిదగ్గిరే కొనుక్కుని తింటూ కూర్చో రాదూ! అదేం లేదు. ప్రతి వాళ్ళ యింటికీ వెళ్ళి..... ఆఁ అతల్లి ఎంతో పిల్లలూ అంతే—ఛా ఛా" అన్నది.

దుర్గ అక్కడినుంచి రాగానే అపూని సముదాయించే ధోరణిలో "సీను మిఠాయి అసలు బాగుండదురా పాడు! ఈమాటు రథోత్సవానికి నాన్నదగ్గిర నాలుగుకానులు అడిగి తీసుకుందాం, నీకు రెండు కానులు, నాకు రెండుకానూ. మనం ఇద్దరం చక్కగా మరమరాలు కొనుక్కుతిందాం ఏం?" అన్నది.

కొంచెం సేపయినాక అపూ ఆలోచించి, ఆలోచించి "రథోత్సవం ఇంకా ఎన్నాళ్లుందే అక్కా?" అని అడిగాడు. ★

—ఇంకావుంది.

విశాలామురళీయం

(గతసంచిక తరువాయి)

5

ఇటు కథానాయకుడికి కూడా చాలా సంబంధాలు వస్తున్నాయి. అతనూ అన్నీ సంబంధాలూ కాదంటున్నాడు. తల్లితో తనగోడు చెప్పుకుని తండ్రిదగ్గర మధ్యవర్తిత్వం చేయమని బ్రతిమాలాడు. ఆవిడ మధ్యవర్తిత్వం ఫలితంగా ఊళ్లోవాళ్లందరూ కంగారుగా పరుగెత్తుకువచ్చారు "ఏమిటీ, ఏం జరిగిందంటూ." "ఇలాంటి చ్రి వేషాలు వేస్తే నా ఆస్తిలో ఒక చిల్లిగవ్వ నీకియను. పో, నా ఆస్తి అక్కరలేకపోతే పోయి ముగ్గురుపిల్లలున్న విధవదాన్ని చేసుకో నా కభ్యంతరంలేదు" అని అరిచాడాయన. మురళీ మొగం పాలిపోయింది.

ఈ గొడవలో రామాయణంలో పిడకల వేట అన్నట్టు బుల్లబ్బాయి కో సంబంధం వచ్చింది. ఏభైవేలు కట్నం. తల్లీ, తండ్రీ, కొడుకూ వెళ్లి పిల్లనిచూసి జడుసుకున్నారు. నల్లని సిద్దిరూపం, 'స్థూలతమ' కాయం, పైకి పొడుచుకువస్తున్న తెల్లనిపళ్లూ, మెల్లకళ్లూ ఆ పిల్లని చూడ వెళ్లిన బండిలోనే వెనక్కి తిరిగివచ్చారు. వచ్చిన తరువాత మూడు లంకణాలు చేశాడు బుల్లబ్బాయి.

మూడురోజుల తరువాత మురళీ దగ్గరకు వచ్చాడు బుల్లబ్బాయి. మురళీ తన మనోవేదన అంతా వెళ్లబుచ్చాడు. అతని నిట్టూర్పులు చూసి వెంటనే ఏదో ఉపాయమాలోచించకపోతే మురళీ నిజంగానే వేదాంతి అయిపోయేటట్లున్నాడని గ్రహించి కాకినాడ పోదామన్నాడు బుల్లబ్బాయి. అలాగే ఇద్దరూ ఇంటిదగ్గర ఏదో సాకుచెప్పి కాకినాడ చేరుకున్నారు. ఊళ్ళో రోడ్లు కొలవటం మొదలుపెట్టారు. చివరికి విశాల ఇల్లు కనుక్కున్నారు. ఇల్లు కనుక్కోవటమే కాదు. విశాలనే కలుసుకోగలిగారు. మురళీని చూసి విశాలకు ప్రాణం లేచివచ్చింది. విశాలను చూడగానే మురళీ వైరాగ్యం వదిలిపోయింది. రెండు హృదయాలూ ఏవేవో చెప్పుకున్నాయి. బుల్లబ్బాయి దూరంగా నిలబడి చెట్లమీద కాకుల్ని లెక్క పెట్టున్నాడు. నాయికానాయకులు చివరికి భూమిమీదికి దిగారు. తామిలా ఎప్పుడూ ప్రేమ ప్రకటనలతో నే గడిపుచ్చుకోవలసిందేనా. తన తండ్రినిగురించి చెప్పుకుంది విశాల. మురళీ తనగోడు చెప్పుకున్నాడు. మరి ఏం చేయాలి? ఎంత ఆలోచించినా ఏ ఉపాయమూ తోచలేదు. మురళీ విన్న కథల్లో ఎందరో ప్రేయసీప్రేమికులు చేసినట్లుగా ఇద్దరూ కలిసి 'ఏ విషమో — ఏ చెరువో'-అంటున్నాడు. విశాల గజగజలాడిపోయింది. చెప్పడమంటే చెప్పాడు కాని చెప్పుతూంటేనే చేదువచ్చింది మురళీ నోట్లోకూడా. పోనీ ఇద్దరమూ ఎవరికీ తెలియకుండా లేచిపోయి ఎక్కడో 'రిజిస్టరుమారేజి' చేసుకొని హాయిగా జీవితం గడుపుదామన్నాడు. కథలలోనూ కలలలోనూ అటువంటి సన్నివేశా లుత్సాహములో ఊహించింది కాని క్రియకు వచ్చేటప్పటికి భయం ముంచెత్తింది విశాలను. తల్లిదండ్రులు లేకుండా పెళ్లా? విశాల

వాసమూర్తి

'అవ్వా కావాలి బువ్వా కావాలి' ధోరణి చూసి మురళీకి కొంచెంసేపు మనస్సు పనిచేయలేదు. మళ్లీ ఒక కొత్తఉపాయమాలోచించాడు. 'రిజిస్టరుమారేజి చేసుకోనక్కరలేదు. తల్లిదండ్రులముందే అగ్నిసాక్షిగానే పెళ్ళిచేసుకోవచ్చు-ఒకటిచేస్తే' అన్నాడు. 'ఏమిటది' అంది విశాల. తనూ బుల్లబ్బాయి ఒక నిర్ణయించుకున్నరోజున ముందుగా నిడదవోలు పోయివుంటారు. ఆపైన విశాల రాజమండ్రీలో మేనమామ యింటికి వెళ్లివస్తానని చెప్పి తిన్నగా నిడదవోలు వచ్చి చేరాలి. అక్కడినుంచి ముగ్గురూ గుంటూరు వెళ్ళిపోవాలి తమ తలిదండ్రులు తమకోసం చాలా కంగారుపడతారు. బెంగ పెట్టుకుంటారు. పశ్చాత్తాపపడతారు. తమ పిల్లలు తిరిగివస్తే చాలు. వాళ్ళ ఇష్టం వచ్చినట్లే చేస్తామనే పద్ధతికి వస్తారు. అప్పుడు-అంటే గుంటూరుచేరిన ఒక వారం రోజుల తరువాత ఇంటికి ఉత్తరం రాయాలి. "తమ ఇష్టప్రకారం చేసేటట్లయితే ఇంటికి తిరిగి వస్తా"మని. తలిదండ్రు లలాగే ఒప్పుకుంటారు. అప్పుడు ఇంటికి తిరిగివచ్చి కోరిక నెరవేర్చుకోవచ్చునని పథకం విస్తరించి చెప్పాడు మురళీ. తలిదండ్రులు ఒప్పుకుంటారా అంది విశాల. ఒప్పుకుంటారన్నాడు మురళీ. పోలీసులకి రిపోర్టు చేయరా అంది. చేయరన్నాడు మురళీ. చేస్తే తమకే అప్రతిష్ఠ అని నలుగురికీ తెలియకుండానే ఉంచడానికి ప్రయత్నం చేస్తారన్నాడు. విశాల ఆలోచించింది. నిశ్చయానికి రాలేకపోయింది. బుల్లబ్బాయినికూడా సలహాకు పిలిచారు. "ఓ యస్ బ్యూటిఫుల్ గా ఉంది ప్లాను. మురళీ అంటే ఏమిటనుకున్నావు" అన్నాడు బుల్లబ్బాయి. చివరకు విశాల అంగీకరించింది. ప్లాను సరిచేశారు. ఇంకా ఆలస్యంచేస్తే తండ్రికి సంజాయిషీ ఇవ్వవలసివస్తుందని విశాల ఇంటికి పరుగెత్తుకుపోయింది.

అనుకున్నరోజున మురళీ బుల్లబ్బాయి నిడదవోలు చేరుకున్నారు. అనుకున్న వేళకు బండికోసం ఎదురుచూశారు. బండి వచ్చింది కాని విశాల కనిపించలేదు. కొంతసేపటికి తమ ఎదురుగావున్న పెట్టెలోనే విశాల ఉందని చూసి లోపలికెళ్ళారు. విశాల భయంతో ముడుచుకుకూర్చుంది. మురళీ పండ్లూ, బిస్కట్లూ, మేగజైన్లూ వగైరాలు కొని విశాలకిచ్చాడు. బండి నిడదవోలు నుంచి కదిలింది. మురళీ విశాలను కబుర్లలోకి దింపబోయాడు కాని ఏదో భయములో విశాల సరిగా మాట్లాడలేకపోతోంది.

ఇలా ఉండగా ఏలూరుదగ్గర ఒకముసలాయన బండిలోకి ఎక్కాడు. తిన్నగా వచ్చి మురళికిఎదురుగా కూర్చున్నాడు. కూర్చున్న వెంటనే కళ్ళజోడు తీసి, తుడిచి కళ్లకు పెట్టుకొని మురళికేసి, బుల్లబ్బాయికేసి, విశాలకేసి పరీక్షగా చూశాడు. మురళికేసి మరి కొంతసేపు చూసి 'ఏ ఊరు నాయనా' అని ప్రశ్న వదిలాడు. మురళీ ఉలిక్కిపడి, కంగారుపడి, కొంచెంసేపు తటపటాయించి నోటికివచ్చిన పేరు చెప్పాడు. "నీ పేరు?" -తరువాత ప్రశ్న. 'మోహనరావు' అని చెప్పాడు. "ఆ అబ్బాయి ఎవరు?— స్నేహితుడా?"

"అవునండి."

"ఆ అమ్మాయి ఏమవుతుంది—భార్యా నాయనా?"

విశాల ఉలిక్కిపడి చూసింది. మురళీ సంకటంలో పడ్డాడు. ఈ ముసలాయన ఏమిటీ ఈ ప్రశ్న లేమిటి? ప్రాణం తీస్తున్నాడే! మురళీ వివరంగా ప్లాను వేశాడు

కాని లోకంలో వ్యవహారాలన్నీ తనుకే కావాలనే ముసలి ధాదస్తులుంటారనే విషయం ఊహించుకోలేక పోయాడు. అదే ఇప్పుడు కొంపతీసింది. బుల్లబ్బాయి. 'చెల్లెలని చెప్పరా, బాబూ' అని ప్రక్కనుంచి గిల్లగా "మా చెల్లెలండి" అన్నాడు.

"చెల్లెలా !—పెళ్ళయిందా ?"

"లేదండి."

"నీకు"

"లేదండి"

"అమ్మాయీ నీ పేరేమిటి ?"

విశాల బిత్తరచూపులు చూస్తూ ఏమీ చెప్పలేకపోయింది. 'ఎందుకమ్మా అలా భయపడుతావు' అని అడిగాడు ముసలాయన. మురళీయే చెప్పాడు 'అన్నపూర్ణ' అని. విశాల అతనికేసి చురచుర చూసింది.

"మీ నాన్నగారి పేరేమిటి ?"

"గోవిందరావు అండి"

"ఇప్పుడు మీ రెక్కడికి వెళ్తున్నారు ?"

"తెనాలండి"

"అక్కడ బంధువు లెవరేనా ఉన్నారా? ఎవరింట్లో ఏ శుభకార్యమేనా ఉందా ?"

ఈ ప్రశ్నల వరస చూసి బుల్లబ్బాయి లేచి ప్రక్కస్టేషను రాగానే ప్రక్క పెట్టెలోకి తప్పుకున్నాడు. బుల్లబ్బాయి వెళ్ళిపోయేసరికి మురళీకి సగంప్రాణం వచ్చింది. ఈ ముసలాయన పరీక్షకి నిలవడం ఎలా ? లోపల తిట్టుకున్నాడు. ముసలాయనకు మూర్ఛరావాలని భగవంతుడిని ప్రార్థించాడు. కాని ముసలాయన ప్రశ్నలు మరింత ఉధృతమయ్యాయి. ఆ ప్రశ్నలకు మురళీ వెంటనే సమాధానాలు చెప్పలేక తటపటాయిస్తున్నాడు. తడబడుతున్నాడు. చెప్పినది కాదని మళ్ళీ ఇంకొకటి చెపుతున్నాడు. ముసలాయన అసాధ్యుడిలా ఉన్నాడు. ప్లీడరీ చేసిఉండాలి ప్లీడరిమీద చాలా ఆర్జించిఉంటాడు. ఇలా ప్రశ్నలడిగే వారిముందు ఎవరాగగలరు మరి తన ప్రాణాలు తినేందుకు వచ్చాడీ వేళ. "ఏం, నాయనా, అలా సమాధానాలు చెపుతున్నావు ? ఎందుకు సందేహిస్తున్నావు. మీ చెల్లెలలా భయపడుతోంది ఎందుకు? నీతో కూడా చనువుగా మాట్లాడడం లేదేం?" అని అడుగుతున్నాడు చాదస్తపు ముసలివాడు ఎక్స్రే కళ్లతో.

'ఉండండి ఇప్పుడే వస్తాను' అని మురళీ లావేటరీకి దారితీసి, అక్కడినుంచి స్టేషనులో బండి ఆగగానే పెట్టెలోనుంచి దిగిపోయి బుల్లబ్బాయి ఉన్న పెట్టెలోకి ఎక్కేశాడు కథానాయికను ముసలాయన బారిని పడవేసి. ఆయన విశాల మీదకు దృష్టిమళ్లించాడు.

"ఏం తల్లీ అలా భయపడుతున్నావు, మీ అన్నయ్యకూడా అలా సమాధానాలు చెప్తున్నాడేం ఏమిటికారణం" అంటూ ప్రశ్నలు కురిపించడం మొదలుపెట్టాడు. విశాల కొంతసేపు ఏమీ మాట్లాడకుండా తప్పించుకోబోయింది కాని చివరికి గుట్టు రట్టయిపోయింది. ముసలాయన ముక్కుమీద వేలు వేసుకొని హరిహరీ ఎలాంటి బుద్ధులు పుడుతున్నాయి ఈకాలపుపిల్లలకి" అని ఆశ్చర్యపోయి అక్కడినుంచి పావుగంటసేపు నీతిబోధ చేశాడు విశాలకు పెట్టెలో వాళ్లందరికీ తెలిస్తే ఆ అమ్మాయి బాధపడుతుందని గొంతుక తగ్గించి "నీవు నాతో మాయింటికి వచ్చి వేయమ్మా, సాయంత్రం బండికి నేను మళ్ళా మీ ఊరు తీసుకువెళ్లి మీ తల్లిదండ్రులదగ్గర దిగపెట్టాను. ఆ దుర్మార్గుల్ని పోలీసులకి పట్టిస్తాను" అన్నాడు. "పోలీసులకి చెప్పవద్ద"ని బ్రతిమాలింది విశాల. బెజవాడ స్టేషను వచ్చింది. విశాలనుకూడా దిగమని ముసలాయన ఆమెను వెంటబెట్టుకొని నడిచాడు. వాళ్ళిద్దరినీచూసి మురళీ బుల్లబ్బాయి పెట్టెలో వంగి కూర్చున్నారు. ముసలాయన ప్లాట్‌ఫారం దాటి వెళ్లిపోయినతరువాత బండిదిగారు. మెల్లగా కళ్ళుతుడ్చుకుంటూ ఊళ్లో ఒక హోటలుచేరారు. ఏం చేయాలో తోచలేదు. "ముసలి ముండాకొడుకు అనుకొని "ముసలివెధవ ముండాకొడుకు,"ముసలిచచ్చు వెధవ ముండాకొడుకు' అంటూ ఇద్దరూ 'వర్డ్ బిల్డింగ్' ఆడారు. కాని ప్రయోజనం లేకపోయింది. "ఇంతకీ ఆ ముసలాడెవరో! విశాల నెక్కడకు తీసుకుపోయాడో, ఏంచేస్తాడో"అని ఆ దుర్గాతో వెతకడానికి బయలుదేరారు. ప్రతి ఇంట్లోకి తొంగిచూస్తూ వీరిద్దరూ పోతుండడంచూసి అనుమానంవేసి కొందరు కర్రలు పుచ్చుకొని వచ్చారు. మురళీ పరుగెత్తగలిగాడు కాని బుల్లబ్బాయిమాత్రం అంతత్వరగా పరుగెత్తలేకపోయాడు. తత్ఫలితంగా బడితె బాజా అయింది అతనికి. ఇద్దరూ హోటలు చేరుకున్నారు. మురళీ హృదయంలోనుంచి కవితాధార మళ్ళీ పొంగింది. "ఉండరా బాబూ, ముందు అన్నం తిందాం, ఆపైన తీరికగా నీకవిత్వం విందాం" అని చెప్పి బుల్లబ్బాయి మురళీని భోజనాలగదిలోకి లాగుకువెళ్ళాడు. భోజనం చేసివచ్చి "ఇక నీకవిత్వం సాగించు వింటాను"అన్నాడు. మురళీ వేదనాపూరితగానం వింటూంటే బుల్లబ్బాయికి నిద్రవచ్చి, నిద్రలో వెనుక చూసిన కాలావతారం కనిపించి, ఎగిరిపడి లేచి, ఆంజనేయదండకం చదివించి, "ఒరే మురళీ, ఈ హోటలులో ఉండవద్దురా, ఇక్కడ పాడుకలలు వస్తున్నాయిరా" అని మాటామూల్లే సర్దాడు

కథానాయకుడూ, చెలికాడూ ఇలా దేశసంచారం చేస్తూండగా పేపర్లో ఒక ప్రకటన పడింది. "కనిపించుటలేదు. పేరు బుల్లబ్బాయి ఎత్తు నాలుగడుగుల ఎనిమిది అంగుళములు..... బుల్లబ్బాయీ, నీకోసం మీ

అక్క వెంకపెట్టుకొని మంచం పట్టింది. వెంటనే రావలసింది" అని ఉంది. అది చదవగానే బుల్లబ్బాయి అక్కడే కూలబడి కడుపునీళ్లు కార్చి "వెంటనే ఇంటికి పోదాం" అన్నాడు. మురళీ రానన్నాడు. బుల్లబ్బాయి ఎంతో చెప్పి చివరికిలాభంలేక తనకు ఉత్తరంమాత్రం రాస్తూఉండమని చెప్పి తిరుగుబండి ఎక్కాడు. మురళీమాత్రం ముందుకు సాగుతూ ప్రతిఊరులో బికారిలా తిరుగుతున్నాడు; తన నొక మజ్నూగా ఊహించుకుంటూ. నెల్లూరులో ఒక పెద్దాయన అతనిని చూసి జాలిపడి తన యింటికి తీసుకువెళ్లి భోజనం పెట్టించి, తన అఫీసులోనే టెంపరరీగా పని ఇప్పించాడు. కాని ఆయన పడుచుభార్య మురళీపట్ల చిత్రాంగికథవంటిది జరపబోగా మురళీ మళ్లీ రోడ్డు పుచ్చుకున్నాడు.

6

ముసలాయన చెప్పినట్లుగానే విశాలను తీసుకొని ఆ సాయంత్రమే కాకినాడకు బయలుదేరాడు. విశాల తండ్రితో అమ్మాయి వాట్టే కేకలు వేయవద్దని చెప్పి, వెంటనే ఒక సంబంధంచూసి పెళ్ళిచేసి వేయమన్నాడు. మొదట్లో కాదన్నా చివరికామే సర్దుకోగలదన్నాడు—దేశంలో ఎంతిమంది సర్దుకోవడం లేదుకాబట్టి! అలాగే విశాల తండ్రి చాలా తీవ్రంగా ప్రయత్నంచేసి ఒక సంబంధం స్థిరపరిచారు. మంచి సంబంధమే. పెళ్ళికొడుకుకి ఏభై ఎకరాల భూమి ఉంది. ఉన్నవూళ్ళో పెద్దమేడ వుంది. బాంకులో పాతికవేలు రొక్కముంది. పెళ్ళికొడుకుమాత్రం పండుకోతే.

కాకపోనీ, విశాలకు వచ్చిన సంబంధంకూడా కావడంలేదని కొంత సంతృప్తిచెందాడు.

తిరిగి తిరిగి చివరికి మురళీ మళ్ళీ ఇంటికే చేరుకున్నాడు. తండ్రి కొడుకునుచూసి కన్నీరు పెట్టుకుని "పెద్దవాడినేదో అంటే అది పట్టించుకుంటావా నాయనా. నీవు లేకపోతే నేనీ ఆస్తేంచేసుకోను. ఎప్పటికయినా ఈ ఆస్తి నీదేకదా, నాయనా" అని "ఇంతకీ ఎవరిని ప్రేమించావో చెప్పు నీలైతే ఆ సంబంధమే చేయడానికి చూస్తాను" అన్నారు. మురళీ చెప్పాడు. "అదేమిటిరా ఈ సంబంధమే వెనుక నేను తీసుకువస్తే కాదన్నావు కదరా" అన్నారు. "ఏమిటీ!" అన్నాడు మురళీ తెల్లబోతూ. "నాకు తెలియదే ఆ సంబంధమే విశాల సంబంధ"మని. తన తెలివితక్కువకి జుట్టు పీకుకున్నాడు. పళ్లు కొరుకుకున్నాడు. "ఇప్పటికీ మించిపోయింది లేదు. ఇప్పుడైనా కనుక్కుంటాను" అని తండ్రి బయలుదేరబోగా ఎవరో చెప్పారు ఆ అమ్మాయికి పెళ్ళి స్థిరమైపోయిందని. మురళీ మళ్ళీ జుట్టు పీకుకున్నాడు. చేసుకున్న కర్మ అనుకున్నాడు. వెదకబోయిన తీగ కాలికి తగిలితే తీసి దూరంగా గిరవాటు వేయడం కర్మకాకపోతే మరేమిటి. మళ్ళీ వేదాంతంలో పడ్డాడు. వేదాంతగ్రంథాలు పఠించడం మొదలుపెట్టాడు. గడ్డం గీసుకోవడం మానివేశాడు. మరి రెండురోజులకు మురళీతండ్రి తమ చుట్టాలింట్లో శుభకార్యానికి భార్యతో కొడుకుతో కాకినాడ వెళ్లారు. బుల్లబ్బాయికూడా స్నేహితుడితో వస్తానని బయలుదేరాడు.

7

విశాల వివాహం తేదీ దగరపడింది. విశాల తండ్రి పెద్దయెత్తున పెండ్లిప్రయత్నం చేస్తున్నాడు. మరి పెద్ద సంబంధం చేస్తున్నప్పుడు పెద్ద ఎత్తునే పోవాలి. పెద్ద పందిళ్లు వేశారు. అలంకరణలు చేశారు. ఐదురోజులకు కార్యక్రమం ఏర్పాటుచేశారు. పదిమంది వంటబ్రాహ్మణుల్ని కుదిర్చారు. సకలవస్తువులూ సమకూర్చుకున్నారు. చుట్టాలందరూ వచ్చి పడ్డారు. లక్ష్మీనారాయణకూడా వచ్చాడు. విశాల తండ్రీ, చుట్టాలూ చాలా ఉత్సాహంగా ఉన్నారు కాని, విశాలా, ఆమె తల్లీ మాత్రం దిగులుగా ఉన్నారు. విశాల తల్లికి ఈ సంబంధం సుతరామూ ఇష్టంలేదు చెప్పినంతమాత్రాన పండుకోతిని పెళ్ళాడేమా, తమ్ముళ్లకి చెప్పుకుని ఏడ్చింది. లక్ష్మీనారాయణ ముందుకూడా చెప్పి ఏడ్చింది. లక్ష్మీనారాయణ మళ్లీ ఆలోచనలో పడ్డాడు. ఆలోచించగా ఆలోచించగా అతనికొక 'బ్రెయిన్ వేవ్' వచ్చింది. 'అదీ, ఒక్క దెబ్బని రెండుపిట్టలు!' పెళ్ళిసమయంలో పెళ్లికొడుకు గైర్‌హాజరవగా సమయానికి ఉన్న ఏ మేనల్లుడితో ముడిపెట్టడం కథలు అతనికి జ్ఞాపకంవచ్చాయి. అవును తన మేనమామ పెద్దప్రయత్నం చేశాడు. ఇప్పుడు కనక సంబంధం తప్పిపోయేటట్లు చేస్తే మేనమామకు ఇంత ప్రయత్నం వృథాగా పోతూంటే ఊరుకోలేడు. తనకే యిచ్చి చేస్తాడు. మేనమామ ఇప్పటి పెళ్ళికొడుకు కిద్దామనుకున్న కట్నంలో సగం తనకియిస్తే తనూ రాజాలా ఉండగలడు. గెడ్డం అనుకుని మీసం, కళ్లజోడూ పెట్టుకుని పెళ్ళికొడుకు ఊరికి బయలుదేరాడు.

మగపెళ్లివారు ప్రయాణ సన్నాహం మీద ఉన్నారు. ఆ ఊరునుంచి పన్నెండు మైళ్ళు బళ్లమీదపోయి రైలెక్కాలి. పాతిక బళ్లు వచ్చాయి. పెళ్లివారందరూ భోజనాలు చేశారు రాత్రి ఎనిమిది గంటలకు బళ్లు బయలుదేరాయి. బళ్లు బయలుదేరిన తరువాత అంతవరకు దూరంనుంచిచూస్తున్న లక్ష్మీనారాయణ "శివరావూ, శివరావూ" అంటూ కేకలువేస్తూ వెనకబండి దగ్గరకు పరుగెత్తాడు. పెళ్ళికొడుకు గ తెలిసినవారెవరోఅయిఉంటారని ఆబండివారు "శివరావు మొదటినుంచి రెండ బండిలో ఉన్నాడండి. అంతవరకూ ఏం పరుగెత్తుతారు. ఇందులోనే ఎక్కండి" అన్నారు. లక్ష్మీనారాయణ ఆ బండిలోకి ఎక్కి కూర్చుని పెళ్లికొడుకు శివరావు తన పాతస్నేహితుడనీ, తన పెళ్లికి మరీ మరీ రమ్మని వ్రాశాడనీ, అందువల్ల బయలుదేరి వచ్చాననీ, దారిలో ఆలస్యమయిందనీ ఎలాగైతేనేం పెళ్లివారిబళ్లలో పడ్డానుకదా అంటూ పెళ్లికొడుకునుగురించి తెలిసినవాడిలా మాట్లాడుతూ వాళ్లదగ్గరనుంచే పెళ్లికొడుకును గురించి వివరాలన్నీ లాగాడు. కొంతసేపుండి పెళ్ళికొడుకుదగ్గరకే పోతానని చెప్పి బండి దిగి ఎదరకు వెళ్ళి శివరావును పెద్ద కేకలతో పిలుస్తూ బండి ఎక్కాడు. పెళ్ళికొడుకు ఈయ నెవరో తన చుట్టాలలో వాడని బండిలోకి ఎక్కి కూర్చొమన్నాడు. లక్ష్మీనారాయణ ఆ బండిలోకి ఎక్కి అంతకుముందు తెలుసుకున్నది ఆధారంగా చుట్టరికాలన్నీ చెప్తూ కబుర్లు చెప్పసాగాడు. బళ్లకుదుపుకు బళ్లలో వాళ్లకందరికీ జోగువచ్చింది. ఆఖరికి బళ్లతోలేవాళ్లు కూడా జోగుతున్నారు. బళ్లు రోడ్డునుబట్టి పోతున్నాయి. లక్ష్మీనారాయణ చూసి చూసి ముందుకు జరిగి తోలేవాడి కూర్చొని చెంబు గుబురుగా ఉన్న ఒకచోట ఆ బండిని ప్రక్కకు పట్టి ఆపుజేశాడు. పెళ్లివారివి కాని బళ్లు మరికొన్ని వెళ్తూంటే వాటి వెనకాల తోలి, నాలుగురోడ్లు కలిసే

తోట ప్రక్కరోడ్డుకు పట్టించి కొంత దూరం తోలి వదిలివేసి వెనక్కివచ్చి ఒక బండిలోకి ఎక్కి కూర్చున్నాడు. బళ్లు స్టేషను చేరాయి. పెళ్ళివారందరూ దిగారు. సామాన్లూ అన్నీ ఒకచోట చేర్చి జనం అందరూ వచ్చారా లేదా అని చూసుకోసాగారు. పెళ్ళికొడుకే లేడు! ఇదేమిటి, బళ్లన్నీ వచ్చాయా అని బళ్లు లెక్కపెట్టే పెళ్ళికొడుకు ఎక్కిన బండే లేదు. కొందరు వెనక్కి పరుగెత్తి చూశారు. ఎక్కడా బండి కనపడడం లేదు. బండివేళ అయిపోతోంది, బండిజాడ లేదు. అంతా కల్లోలంగా ఉంది. కొందరు మళ్లీ వెనక్కి పరుగెత్తారు. రైలు వచ్చింది. లక్ష్మీనారాయణ ఎవరికీ తెలియకుండా రైలు ఎక్కి కూర్చున్నాడు. పెళ్ళివారు నానాఅందోళన పడుతున్నారు. పోనీ కొందరేనా రైలెక్కి ముందుపొండి, తరువాత పెళ్ళికొడుకు మిగిలినవారూ తరువాత బండిలో వస్తామన్నారు కొందరు. ముందుపోయి ఏంచేస్తాం అన్నారు కొందరు. పెళ్ళికొడుకు జాడ ఎక్కడా లేదు. రైలు వెళ్ళిపోయింది.

పెళ్ళికొడుకు బండి ప్రక్కరోడ్డునే పడి చాలాదూరం పోయింది. ఆఖరికి ఒకఊరులో ప్రవేశించి, ఒక రైతు దొడ్లోకి వెళ్ళిపోయింది. ఎద్దులు గడ్డిమేటి దగ్గరకు బండితోనే వెళ్ళి గడ్డిమేస్తూ ఆగిపోయాయి. కొంతసేపటికి దొడ్లో ఏదో సందడి ,అయినట్లు గమనించి దొడ్డిగల ఆసామి తనవారిని తీసుకొనివచ్చి కేకలు వేయసాగాడు. ఆ కేకలు విని బండిలోవారు లేచి కళ్లు నలుపుకుంటూ 'స్టేషను వచ్చిందా' అంటూ దిగారు. "స్టేషనేమిటయ్యా, ఎడ్లు మా గడ్డిమేటిమీద బడి మేస్తూంటే" అంటూ అరవసాగారు. అక్కడి మనుష్యులు. పెళ్ళికొడుకూ అతని వాళ్ళు తెల్లబోయి, పరిస్థితి అర్థంచేసుకొని ఏదో పొరబాటో, మోసమో జరిగి ఉంటుందని గ్రహించి, అక్కడి మనుష్యులను బతిమాలి శాంతింపజేసి మళ్ళి బండి ఎక్కి వెనక్కి తోలుకుపోయారు.

వాళ్ళు వెనక్కి వెళ్ళేటప్పటికి ఆ పెళ్ళివారంతా గందరగోళంగా ఉన్నారు. రెండోబండికూడా వెళ్ళిపోయింది. మళ్ళి నాలుగుగంటలవరకూ బండిలేదు.

ఇక్కడ కాకినాడలో విశాల తండ్రి స్టేషనుకు వెళ్ళి పెళ్ళివారికోసం ఎదురు చూస్తారు. కార్లూ, మేళాలు అన్నీ కూడా వచ్చాయి. బండి వచ్చింది కాని పెళ్ళివారు రాలేదు. విశాల తండ్రి వాళ్ళూ కంగారు పడ్డారు. ఏమీ తోచలేదు. పోని పెళ్ళికొడుకుడోరుకు 'వైరు' ఇద్దామంటే 'వైరు' త్వరగా అందేఊరు కాదది. చివరికి ఎటూ పాలుపోక ఇద్దరు బంధువుల్ని పెళ్ళివారు ఎక్కవలసిన స్టేషనుకేసి వెళ్ళిరమ్మని అట్టు పోయే బండి ఎక్కించి పంపారు. అందోళన పడుతూనే ఇంటికి తిరిగి వచ్చారు. చుట్టాలూ స్నేహితులూ తలకొకవిధంగా వాగుతూ ఆయనను మరింత బెదరకొట్టేట్లు చేస్తున్నారు. కొందరు సలహా ఇచ్చారు. 'అంతా రెడీగా చేసి ఉంచుదాం, రెండో బండి ఉందికదా, దానిమీద వస్తూ ఉండవచ్చు. పెళ్ళికొడుకు రావడమే తరువాయి తిన్నగా పీటలమీద కూర్చోబెట్టి కానిచ్చేద్దాం' అని. అలాగేనని కార్లనీ, మేళాన్నీ స్టేషనుకు పంపించి ఇక్కడ అన్నీ సిద్ధంచేసి కూర్చున్నారు. మరి కొంత సేపటికి వట్టి కార్లూ, మేళం, తిరిగి వచ్చాయి. విశాలతండ్రికి పిచ్చెత్తిపోయినట్లయింది. పెళ్ళివార్ని తిట్టారు. ఊళ్లో వాళ్లని తిట్టారు. ఆఖరికి ఎదురుగా ఉన్న వాళ్లని కూడా తిట్టారు. "ఇంత ఇలా మోసం చేస్తారా. ఇంత ఖర్చు పెట్టాను, ఇంత ప్రయత్నం చేశాను, ఇదంతా ఊరికే పోవలసిందేనా. కాస్త కూస్తానా——" అని పదిసార్లు అటూ ఇటూ తిరిగి "ఒరే లక్ష్మీనారాయణ నీకే ఇచ్చి చేసిస్తాను తయారవిరా. ఇంత ప్రయత్నం ఊరికే పోకూడదు. అసలాసంబంధం వద్దని తల్లికూడా పోరుతూనే ఉన్నారు. నీకే రాసి ఉంది. తయారవు" అన్నారు. అందరూ "అవును ఎలాగైనా మేనరిక మేగదా" అన్నారు. లక్ష్మీనారాయణ గుండె రెండు చేతుల తోటి గట్టిగా అదిమి పట్టుకున్నాడు.

8

విశాల పెళ్ళి ఆవేళని మురళికి తెలిసింది. కాని అతను పెద్దగా బాధపడలేదు. బాధకూడా తెలియకుండా మొద్దుబారిపోయింది మనస్సు ఈ మధ్య పట్టించుకున్న వేదాంతంతో. అయినా ప్రేయసి సుఖంగా ఉండడమే ప్రియుడికి కొంత ఊరట అనే దృష్టితో విశాలకు తన హార్దికాభినందనలు తెలియపరచి రావాలనుకున్నాడు. బుల్లబ్బాయితో చెప్పాడు. "అలాగే పోదాం ముందు కాస్త గడ్డం గీసుకోరా, బాబూ" అని గడ్డం గీయించి, మంచి దుస్తులు వేయించి పెళ్లివారింటికి బయలుదేరాడు బుల్లబ్బాయి మురళితో.

విశాలతండ్రి మురళి అటు రావడం చూసి లోపలికి ఆహ్వానించి కూర్చోపెట్టారు. లోపలికి పోయినప్పుడు కూతురుతో "మాశావా అమ్మాయీ, ఆ అబ్బాయి రాజాలా ఉన్నాడు. అతని సంబంధం తీసుకువస్తే అది కాదన్నావు" అన్నారు. "ఏ సంబంధం" అని ఆ అబ్బాయికేసి చూసింది. మురళి! తన మురళి! "ఈ సంబంధ మెప్పుడూ నాతో చెప్పందే!" అంది.

"నేను అబద్ధాలకోరుననీ, మోసగాణ్ణనీ మీ పత్రికలో నేనా వేశారు?" అని రాజకీయవాది సంపాదకుణ్ణి నిగ్గదీసి అడిగాడు.

"మా పత్రికలో కాదండి. అవతల వీధిలో మా సమకాలిక పత్రిక అయిఉంటుంది. మాదాంట్లో కొత్త వార్తలు మాత్రమే వేస్తాము"

"చెప్పకపోవడ మేమిటి ఫోటో కూడా చూపిస్తే!" "ఫోటో చూపించందే నా కొప్పుకు". "చూపించకపోవడ మేమిటి చూపిస్తే — పోనీ ఇప్పటికే నా మించిపోయింది లేదు అతనంటే ఇష్టమేనా చెప్పు" అన్నారు. విశాల నిలువెల్లా సిగ్గుతో నిండిపోయి మాట్లాడలేకపోయింది. తల్లి చూసి "చెప్పవే ఇప్పుడైనా" అని అడిగింది "అతనినే నేను చేసుకుంటానన్నది" విశాల మెల్లగా. తలీ తండ్రీ విశాలకేసి ఆశ్చర్యంగా చూశారు. చివరికి పెద్దగా నవ్వివేశారు తండ్రి మురళీదగ్గరకు పరుగెత్తి "మీ నాన్నగారు, అమ్మగారు మీ ఊళ్లోనే ఉన్నారా?" అని అడిగారు. "లేరు, ఈ ఊళ్లోనే ఉన్నారండి" అని చెప్పాడు మురళీ వెంటనే కారు వెళ్లింది వారిని తీసుకురావడానికి. ఈలోపుగా మురళీని పీటల మీద కూర్చోమన్నారు విశాల తండ్రి. పాటొకడిదయితే పంట ఒకడిదయింది లక్ష్మీనారాయణ ఒక సంభం దగ్గర కూలబడిపోయి నాలుగు కప్పుల కాఫీ త్రాగివేశాడు.

వధువు తల్లిదండ్రులు వరుడి కాళ్లు కడగబోతున్నారు అంతలో వచ్చిపడ్డాడు శివరావు చుట్టాలతో "నేను వచ్చాను, నేను వచ్చా" నంటూ పెళ్లిపందిరంతా నిశ్శబ్దమైపోయింది. ఎక్కడివారక్కడ శిలావిగ్రహాల్లా అయిపోయారు "నేను వచ్చానంటే మాటాడరేం ఏయ్ ఆ పెళ్లి ఆపేయండి నేనూ పెళ్ళి చేసుకోవలసింది ఎవడో బద్మాష్ మా బండిని తప్పుదారి పట్టించి పారిపోయాడు. వాడు కనిపిస్తే వాడి పేగులు తీసి నా మెడలో వేయకపోతే నా పేరు శివరావు కాదు" అన్నాడు శివరావు. ఆ మాటలు విని లక్ష్మీనారాయణ ప్రక్కగోడదూకి స్టేషనుకు పరుగెత్తి రాజమండ్రీ బండి ఎక్కి ఉడాయించాడు.

శివరావు తక్కిన చుట్టాలందరూ కూడా వచ్చారు. పెద్ద కజ్జా లేవదీశారు. పెళ్లి పందిరైనా ఊడబీకి పోతాం కాని ఊరికే పోమన్నారు. విశాలతండ్రికి మళ్లీ ఆశ పుట్టుకు వచ్చింది "లక్ష రూపాయిల సంబంధం!" సందిగ్ధావస్థలో పడ్డాను. "అయ్యా ముహూర్తం వేళ సమీపిస్తోంది" అన్నారు పురోహితులు. శివరావు మురళీదగ్గరకు పరుగెత్తుకుపోయి, "లేవయ్యా, లే, వీలు దొరికిందని మధ్యలో వచ్చి కూర్చోవడమే! అసలు నీవాడే ఎవడో ఆ పని చేశాడు. సిగ్గు లేదయ్యా, మనిషీ లేలే" అంటూ రెక్క పుచ్చుకొని గుంజివేయసాగాడు "లేవకురా బాబూ ఏమైనా" అని బుల్లబ్బాయి గోలపెట్టూనే ఉన్నాడు కాని మురళీకి మళ్లీ వైరాగ్యం వచ్చి లేచిపోయాడు. "మంగళాస్నానం లేదు గింగళాస్నానం లేదు. కానియ్యవయ్యా పురోహితుడా" అంటూ పీటమీద కూలబడ్డాడు శివరావు. భజంత్రీలు మ్రోగాయి.

మురళీ మజ్నూ కాక తప్పలేదు. ★

దగా చేసిన దమయంతి

జి. వి. జి. కృష్ణ

శేషావతారం ఎం. ఎస్ సి. ప్యాసయ్యాడు. డిటెక్టివ్ నవలలు చదవడమంటే అతనికి మహా సరదా. పిత్రార్జితం చాలా ఉంది. అంచేత ఉద్యోగం చేయాల్సిన అవసరంలేదు. కాని, ఉన్న డబ్బును ఖర్చు పెట్టుకుంటూ హాయిగా కాలం గడపటమంటే అతనికి ఎంచేతో ఇష్టం లేదు. ఏదో పని కల్పించుకొని, దాన్ని నెరవేర్చడంకోసం ఎంతకాలాన్నైనా వినియోగించేవాడు.

నెలలో రెండుమూడు వారాలు స్వగ్రామంలో ఉండడు, లేడికి లేచిందే పరుగన్నట్లు - తలచుకుంటే చాలు, ఎక్కడికో ప్రయాణమౌతాడు. ఈవేళ విజయవాడలో ఉంటాడు; రేపు చూస్తే గుంటూరులో ఉంటాడు. ఎవరైనా కష్టాల్లో ఉంటే, అతని హృదయం మంచులా కరిగిపోతుంది. ఎవరైనా ఒకర్ని అన్యాయంచేస్తే, ఆ అన్యాయంచేసినవ్యక్తికి తగిన శాస్తిచేసి, అన్యాయం చేయబడినవ్యక్తికి సహాయం చేయకపోతే అతనిమనస్సు విలవిల తన్నుకుంటుంది.

శేషావతారం గురించి ఇంత ఉపోద్ఘాతం ఎందుకు రాయవలసి వచ్చిందంటే - అతను బెంగుళూరులో ఉన్నప్పుడు ఒక విచిత్ర సంఘటన జరిగింది. శేషావతారం ఒకరోజు కబ్బన్‌పార్కుకు షికారువెళ్ళాడు. అక్కడొకచోట సిమెంటుబల్లమీద ఒక వ్యక్తి మోచేతుల్లో తలదాచుకు కూర్చొని, వెక్కివెక్కి ఏడ్వటంచూశాడు. ఆ వ్యక్తి మాసిన గడ్డంతో, సంస్కారంలేని జుట్టుతో, చినిగిపోయిన దుస్తులతో చాలా దీనంగా ఉన్నాడు. అతన్ని చూడగానే శేషావతారం కాళ్లకు బ్రేకులు పడ్డాయి. తిన్నగా ఆ సిమెంటు బల్లకేసి నడిచి, ఆ వ్యక్తి పక్కనే కూర్చున్నాడు.

ఆ వ్యక్తి వొంచిన తల ఎత్తకుండా ఇంకా అలాగే దుఃఖిస్తున్నాడు.

కాసేపయ్యాక శేషావతారం "అబ్బాయ్!" అని సంబోధించాడు మెల్లగా.

ఆ వ్యక్తి తల పైకెత్తి, శేషావతారం కళ్ళల్లోకి చూశాడు.

"నువ్వేమైనా కష్టాల్లో ఉన్నావా?" జాలిగా చూస్తూ ప్రశ్నించాడు శేషావతారం.

ఆ వ్యక్తి జవాబియ్యలేదు, మళ్ళీ తల వొంచుకున్నాడు.

"నిన్నే అబ్బాయ్!" శేషావతారం కాస్త హెచ్చు స్థాయిలో అన్నాడు. ఆ వ్యక్తి తల ఎత్తి, శేషావతారం కళ్లల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు: "ఏం? మీరేమైనా ఆర్చేవారా, తీర్చేవారా?"

శేషావతారం చిన్నగా నవ్వాడు. ఆ యువకుని వీపుమీద చేత్తో తట్టుతూ "నేనెవరో నీకు తర్వాత తెలుస్తుందిలే. ముందు నీ కొచ్చిన కష్టమేమిటో చెప్పు నాయనా!" అన్నాడు.

ఆ యువకుడు కాసేపు మౌనం వహించాడు. "నాకీ ప్రపంచంలో 'నా' అన్నవాళ్లెవరూ లేరు. నాకు ఎలాటి సహాయం చేసేవారుకూడా లేరు. కాని, నా కష్టాలను మీతో చెప్పుకున్నందువల్ల నా హృదయం కొంతవరకూ తేలిక పడొచ్చు...." అంటూ ఇలా చెప్పసాగాడు:

"...నాపేరు గిరిధర్. రసాయనిక శాస్త్రంలో కొంతకాలంపాటు కృషి చేశాను. చాలా పరిశోధనలు చేసి కొన్ని కొత్తగా కనిపెట్టానుకూడా. కాని,దురదృష్టవంతుణ్ణి నిలువునా నాశనమయ్యాను. నా ఆశాసౌధాలన్నీ కూలిపోయాయ్..." బావురుమన్నాడా యువకుడు.

"అబ్బాయ్, విచారించకు. ఆ మాటకొస్తే మన కళ్లెదుట ఎంతమంది ఆశాసౌధాలు కూలిపోవడం మనం చూళ్ళేదు? నీలాంటి యువకులు ఆమాత్రానికే బెదిరిపోకూడదు. ధైర్యం ఉంటే ఎప్పటికైనా మనమే జయిస్తాం. ఇంతకీ జరిగిందేమిటో చెప్పు నాయనా," అన్నాడు శేషావతారం.

గిరిధర్ కన్నీళ్లు తుడుచుకుంటూ ఇలా అన్నాడు: "నేనిక్కడ ఒక కాలేజ్‌లో డిమాన్‌స్ట్రేటర్‌గా పనిచేశాను. వచ్చే జీతం చాలేది కాదు. స్వంతంగా ఏదయినా వ్యాపారం చేయాలనిపించింది. ఉద్యోగంమాని, ఒకటి రెండు వ్యాపారాలు చేశాను. కాని, ఎక్కువ సంపాయించలేకపోయాను. ఒక వారంక్రితం నేనొక పరిశోధనలో విజయం సాధించాను."

గిరిధర్ హఠాత్తుగా ఆగాడు. షర్ట్‌జేబులోంచి ఒక చిన్న డబ్బీ తీసి శేషావతారానికి ఇచ్చాడు. శేషావతారం ఆ డబ్బీ మూత తీశాడు. అందులో బలపంలాటి కడ్డీ ఏదో ఉంది. ఆకడ్డీ చివర ముదురు గులాబీరంగు పూయబడి ఉంది. అదేమిటని అడిగాడు శేషావతారం.

"అదేమిటో నన్నడక్కండి. నే చెప్పలేను. నాగుండె తరుక్కుపోతుంది. కాని, ఈ విచిత్రం మాత్రం చూసి ఆనందించండి," అంటూ గిరిధర్ పైజామా జేబులోంచి మడతపెట్టబడిన ఒక పాత దినపత్రికను తీశాడు. "మీదగ్గర పెన్నా ఉందికదూ? ఈ పేపర్ మీద ఏదైనా రాయండి," అన్నాడు ఆ పత్రికను శేషావతారానికి అందిస్తూ.

శేషావతారానికి ఏం రాయాలో సమయానికి తోచలేదు. చివరికి ఆ పత్రిక మీద ఒక చివరన 'పెసరట్టు' అని రాశాడు.

"ఆ బలపంతో మీరు రాసిన దానిమీద రుద్దండి," అన్నాడు గిరిధర్.

శేషావతారం అలాగేచేశాడు. క్షణకాలం తన కళ్ళను నమ్మలేక పోయాడు. నాలుగయిదుసార్లు ఆ బలపంతో రుద్దగానే, అతను రాసిన అక్షరాలన్నీ అదృశ్యమైపోయాయ్. శేషావతారం ఆ పత్రికను తన కళ్ళకు మరింత దగ్గరగా ఉంచుకొని చూశాడు. ఇందాక తను పెన్నాతో రాసినట్టు అక్కడ సూచనలుకూడా లేవు. ఆ చోటున పేపర్ నలిగిపోలేదు కూడా.

"ఇది బాంకుల్లోనూ, ఆఫీసుల్లోనూ చాలా ఉపయోగపడుతుంది. నాలుగు రోజులు రాత్రింబవళ్లు నిద్రాహారాలుమాని పరిశోధన చేసి దీన్ని కనిపెట్టాను. మామూలుగా ఉపయోగించే సిరాతుడిచే రబ్బరు కాయితాన్ని చింపుతుంది. కొంతమంది సిరా అక్షరాలను పోగొట్టటానికి కొన్ని రసాయనిక ద్రవాలను ఉపయోగిస్తారు. అవి చాలా ఖరీదైనవి. నే కనిపెట్టిన ఈ బలపాలు మాత్రం చాలా చవుక. సులభంగా, త్వరితంగా సిరా అక్షరాలను మాయం చేస్తాయి."

శేషావతారం తల ఊపాడు. "అవును. దీంతో నువ్వు వేనకువేలు సంపాయించవచ్చు," అన్నాడు చేతనున్న ఆ బలపాన్ని ఇటూ అటూ తిప్పిచూస్తూ.

గిరిధర్ మొహంలో మళ్ళీ విచారం అలుముకుంది. నిట్టూరుస్తూ, "అవును.

ంపాదించవచ్చు. కాని, నేనిక సంపాదించ లేను; సంపాదించ కూడదు. నే కనిపెట్టింది మరొకరి సొత్తు అయిపోయింది. దాని మూలంగా నేనొక్క కాణీ కూడా సంపాదించ లేను" అన్నాడు అదో తవేశంలో.

"ఏం? ..ఎందుకూ"

"నేను ఈ పరిశోధనను కొనసాగించటానికి ఏ ముహూర్తాన ఉపక్రమించానో గానీ, నా దగ్గర చిల్లిగవ్వయినా లేకుండా పోయింది. అంచేత గూర్ఖా గూపాయలకు నవాచీరి తాకట్టు పెట్టి, కొన్ని రసాయ ద్రవ్యాలను కొన్నాను పరిశోధన గనేలోగా ఆ డబ్బు కూడా అయిపోయింది. వరైనా పెట్టుబడి పెట్టే వాళ్ళుంటే, నేను భాగస్వామిగా చేరి, పెద్ద ఎత్తున ఈ సిరాశీపే బలపాలను తయారు చేసి డబ్బు సంపాదించా మనుకున్నాను దాదాపు ఎనిమిది రోజుల క్రితం పేపర్‌లో ఒక ప్రకటన చూసేసరికి నాలో ఆశలు చిగురించాయ్... చూడండి—" అంటూ తనవద్ద ఉన్న పేపర్‌లోని ఒక ప్రకటనను శేషావతారానికి చూపించాడు.

శేషావతారం ఆ ప్రకటనను చదువుతూండగా, గిరిధర్ గద్గద కంఠంతో అన్నాడు: "ఎవరైనా వ్యాపారం చేయదలిస్తే, భాగస్వామి పద్ధతుల్లో పెట్టుబడి పెటి సహాయం చేయటానికి సిద్ధంగా ఉన్నానని ఆ దమయంతి చేసిన ప్రకటనను చూశాను ఆమె చేత కొంతడబ్బు పెట్టుబడి పెట్టించి నే కనిపెట్టిన బలపాలను మార్కెట్టులో విరివిగా విక్రయింపజేసి, ఆమెకు చాలా లాభం చూపిద్దామనుకున్నాను. కాని దమయంతి అంత మోసం చేస్తుందని ముందు ఏమాత్రం ఊహించలేకపోయాను. వాటిని ఎలా తయారుచేశానో వివరంగా చెప్పాను వాటిమూలంగా స్వల్ప పెట్టుబడితో నే లక్షలకొలదీ ఎలా సంపాదించవచ్చో లెక్కలు వేసి చూపించాను. ఆమె సంతోషించింది ఆ బలపాలను కనిపెట్టినందుకు నన్ను అభినందించింది.

"నేను ఆ బలపాలను ఎలా తయారుచేశానో ఒక కాగితంమీద విపులంగా రాసి ఇమ్మని నన్ను వేళ్ళమంది. ఆమెకు రసాయనికశాస్త్రం గురించి ఏమీ తెలీదుట ఆమె తమ్ముడు బి యస్ సి చదివాడట. అతను ఊళ్ళో లేడనీ, వారంరోజుల తరువాత వస్తాడనీ అంది. అతనితో సంప్రదించకుండా తానేమీ చెయ్యలేనంది. నేను ఆ బలపాలను ఎలా తయారుచేశానో ఒక కాగితంమీద రాసిచ్చాను. నావద్ద ఉన్న బలపాల్లో ఒక రెండింటిని ఆమెకిచ్చాను. తన తమ్ముడు ఒప్పుకుంటే తను పెట్టుబడి పెట్టటానికి సిద్ధమేననీ, సరిగ్గా ఒక వారంరోజులయ్యాక నేవస్తే నా కేసంగతీ చెప్తాననీ అంది

"నేను నిన్న ఉదయం ఆమె యింటికి వెళ్తే, ఆమె పెదవి విరిచింది. ఆ బలపాలను ఇదివరకే ఎవరో తయారుచేస్తున్నారంది. అది పేటెంటు ఆఫీసులో రిజిస్టర్ చెయ్యబడిందట కూడానూ. నేను ఆమెను మోసంచేయటానికి వచ్చానని బెదిరించింది.

"నేను నమ్మలేక పోయాను. ఆ బలపాలను కనిపెట్టింది నేనే. ఆ రహస్యం నాకొక్కడికే తెలుసు అటువంటప్పుడు ఆ బలపాలను ఇదివరకే ఎవరో తయారుచేస్తున్నారంటే ఎలా నమ్మగలను? ఒకవేళ ఎవరైనా తయారు చేసినా నేను ఉపయోగించిన రసాయనిక పదార్థాలనే ఎలా ఉపయోగించగలరు? తిన్నగా పేటెంట్ రిజిస్ట్రేషన్ ఆఫీసుకెళ్ళి అక్కడొక గుమాస్తాను కలుసుకున్నాను అతని కాళ్ళూ, చేతులూ పట్టుకోగా చివరికి నాకొక ఫైల్‌ను చూపించాడు. అందులో నే కనిపెటిన బలపాలను నేనెలా తయారుచేశానో అచ్చం అలాగే రాయబడి వుంది. క్రితం రోజు నేను దమయంతికి రాసిచ్చిన విధంగానే అందులో ఉంది. కాని, దాన్ని దమయంతి తమ్ముడు విశ్వేశ్వరరావు కనిపెటినట్లుగా రాయబడి ఉంది రిజిస్ట్రేషన్ దమయంతి పేరుతో ఉంది నాకు పట్టలేనంత ఆగ్రహం వచ్చేసింది తిన్నగా దమయంతి ఇంటికెళ్ళి ఆమెను నోటికొచ్చినట్లల్లా తిట్టేశాను. బెదిరించాను. ఆమె నన్ను నౌకరుచేత మెడ పట్టి బయటికి గెంటించింది.

"అవును.. నేనేం చేయగలను. పోలీసు రిపోర్టు ఇస్తే దమయంతి మోసాన్ని ఎలా నిరూపించగలను? సాక్షులు లేరాయె. పైగా, నేను ఆ బలపాలు తయారుచేసే విధానాన్ని దమయంతికి తెలియజేసినట్లుగా రాత పూర్వకంగా ఏమీ లేదాయె అటువంటప్పుడు నేనేం చెయ్యను? అక్కడ్నించి ఏడుస్తూ వచ్చి ఇక్కడ కూర్చున్నాను..." గిరిధర్ ఆయాసంగా ఊపిరి పీల్చాడు.

"విచారించకబ్బాయ్!" అని బుజ్జగించాడు శేషావతారం. కాస్సేపు ఆలోచించాక "అబ్బాయ్!...లే...మా లాడ్జికి పోదాం ఈపూట నా అతిథిగా ఉండు. నేనివ్వేళ సాయంత్రం ఆ దమయంతి ఇంటికి వెళ్తాను నిన్ను అన్యాయంగా మోసం చేసినందుకు ప్రతిఫలంగా, ఆమెదగ్గర్నించి కొంత డబ్బు పరిహారంగా నీకు అందేలా చూస్తాను." అన్నాడు.

గిరిధర్ శేషావతారం కళ్ళల్లోకి ఆశ్చర్యంతో చూశాడు: "అదెలాగండీ?"

"ఎలాగో నువ్వు నన్ను అడుగకు. నేనూ చెప్పను. అంతే. చూడు భాయ్, మన బుర్ర మట్టి బుర్ర కాదు, ఒక్కోసారి ఇటువంటి సమయాల్లో అమోఘంగా పనిచేస్తుంది. అంచేత నీకాగోడవ అక్కర్లేదు. నేను ఆమె దగ్గర్నించి పరిహారంగా తెచ్చిచ్చిన డబ్బుతో నువ్వు కొన్నాళ్ళపాటు ఏ చీకూచింతా లేక కాలం గడపొచ్చు. ఈలోగా కాలం వృధా చేయక తీవ్రంగా పరిశోధనలు సాగించు. ఇలాంటిదే మరేదైనా కనిపెట్టు. కొంత డబ్బును వెనకేసి దానితో నువ్వే కొద్ది పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించు ఈమారు నువ్వేదైనా కనిపెడ్తే, తయారుచేసే విధానాన్ని ఎవ్వరితోనూ చెప్పకూడదన్న విషయాన్ని మాత్రం గుర్తుంచుకో"

సాయంత్రం ఐదు గంటలయింది తెంకు నూరు శ్రీనివాసపురంలో ఒక వీధిలో వెళ్తున్నారు శేషావతారం, గిరిధర్. "అదేనండి ఆ ఇల్లే" అన్నాడు గిరిధర్, దూరంగా ఉన్న ఒక ఇల్లు చూపిస్తూ.

శేషావతారం అటుకేసి చూశాడు.

"అదో-ఎవరో ఒకతను వస్తున్నాడు చూడండి-ఆ ఇతడే" అన్నాడు గిరిధర్.

శేషావతారం కనుబొమలు ముడిచి చూశాడు. "ఒకవేళ ఆ వ్యక్తి దమయంతి తమ్ముడు అయివుంటాడేమో?"

"కావచ్చండి" అన్నాడు గిరిధర్.

"అతను వెళ్ళిపోనీ...అప్పుడే మనకు మంచిది," అన్నాడు శేషావతారం. కాస్సేపయ్యాక "సరే, నువ్వక్కడ ఒక హోటల్ ఉంది చూడూ...అక్కడికెళ్ళి కాఫీ తాగుతూ కూర్చో... నేను ఆమె ఇంటికి వెళ్ళొస్తా," అన్నాడు శేషావతారం.

గిరిధర్ కొంత దూరంలో ఒక హోటల్ ఉంటే - అందులోకి దూరాడు. శేషావతారం దమయంతి ఇంటికి వెళ్ళాడు.

"రండి...ఎవరండీ మీరు?" అంది దమయంతి, శేషావతారాన్ని చూడగానే.

"నా పేరు అహోబలరావు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో రిసెర్చి స్టూడెంట్‌గా పనిచేస్తున్నాను. మొన్న పత్రికలో మీరు చేసిన ప్రకటన చూశాను..."

"ఓ...అలాగా...కూర్చోండి," అంది దమయంతి, ఒక కుర్చీ చూపుతూ.

దమయంతికి దాదాపు నలభైఏళ్ళుంటాయ్.

★ దగా చేసిన దమయంతి ★

కొడుకుకు మించిన లావుపాటి శరీరం. యౌవనదశలో ఆమె అందచందాలు ఎంతో మందిని ఆకర్షించి ఉండాలి. ఇప్పటికికూడా ఆమె కళ్ళలో కొంత ఆకర్షణ ఉందనే చెప్పాలి.

శేషావతారం ఓసారి ఆ హాలు నలుమూలలూ పరిశీలించాడు.

సమీపంలో రెండు టేబుల్స్ ఉన్నాయ్. ఒక టేబుల్ మీద మైక్రోస్కోప్ ఉంది. మరో టేబుల్ మీద పరిశోధన కుపయోగించే స్టాండు, బ్యూరెట్, పిపెట్ వగైరా గాజుసామాను లున్నాయి.

శేషావతారం జేబులోంచి ఒక గోధుమ వర్ణపు సీసా తీశాడు.

"నేను కొత్తరకపు క్రోమియం ప్లేటింగ్‌ను కనిపెట్టాను. ఈ రోజుల్లో క్రోమియం పూత పూయటానికి ముందు నికెల్ పూత పూస్తారన్న సంగతి బహుశః మీకు తెలిసే ఉంటుంది. కాని, నే కనిపెట్టిన విధానం చాలా చవుక, సులువు కూడానూ. కొన్ని రసాయనిక ద్రవ్యాల సంయోగంతో సునాయాసంగా క్రోమియం పూత పూయవచ్చు..." అంటూ శేషావతారం జేబునించి ఒక రాగి కానీ తీశాడు. "చూడండి," అన్నాడు. ఆ రాగి కానీమీద సీసాలోని ద్రవాన్ని జాగ్రత్తగా పోశాడు. జేబు రుమాలుతో ఆ కానీని రుద్దాడు. దమయంతి కళ్ళు జిగేల్ మన్నాయ్. కొన్ని క్షణాలలో ఆమె కళ్ళెదుటే ఆ రాగి కానీ-వెండి కానీగా మారింది.

"ఈ సీసాలోని ద్రవం పావలా కన్నా ఎక్కువ ఖరీదు చేయదు," అన్నాడు శేషావతారం, ఆ సీసాకు కార్కు బిగించి టేబుల్ మీద ఉంచుతూ.

దమయంతికి చాలా ఆశ్చర్యం వేసింది ఆమెలో ఏదో ఆశ మొలకెత్తింది. టేబుల్ మీదున్న ఆ సీసాకేసి మళ్లీ చూసింది. శేషావతారం సిగరెట్ వెలిగించి గుప్పున పొగ వదిలాడు. ఆ పొగలో దమయంతికి ఒక ఫాక్టరీ కన్పించింది. క్రోమియం ప్లేటింగ్ ఫాక్టరీ అది. కొంత మంది కార్మికులు ఎన్నో వస్తువులకు క్రోమియంపూత పూస్తున్నారు. ఆ వస్తువులన్నీ వెండిలాగా తళతళ మెరుస్తున్నాయి. దమయంతి చివాలున శేషావతారంకేసి తిరిగింది. "ఆసీసాలోని ద్రవాన్ని మీరెలా తయారుచేశారు?"

"ఓ...అందులో చాలా రసాయనిక ద్రవాలు మిశ్రమమై ఉన్నాయ్. నేచెప్తే మీకు తెలుస్తుందా?" అన్నాడు శేషావతారం.

"నాకు రసాయనిక శాస్త్రంగురించి ఏమీ తెలియదు. మాతమ్ముడికి తెలుసు. వాడు బి. యస్ సి. చదివాడు. వాడిప్పుడు ఊళ్లో లేడు. వారంరోజుల్లో వస్తాడు. మీరు ఆ ద్రవాన్ని ఎలా తయారుచేస్తారో నాకో కాగితంమీద రాసిచ్చి వెళ్ళండి. మాతమ్ముడు రాగానే వాడితో చర్చిస్తాను. వాడు తప్పకుండా ఒప్పుకుంటాడు..ఎంచేతంటే ఈకాలంలో క్రోమియం ప్లేటింగుకు చాలా విలువ ఉంది" అంది దమయంతి.

"మీ తమ్ముడు రావటానికి ఇంకోవారం అవుతుందా?" నిట్టూర్చాడు శేషావతారం.

"ఏం?" అంది దమయంతి, శేషావతారం కళ్ళలోకి ప్రశ్నార్థకంగా చూస్తూ.

"ఇంకో వారంవరకూ నేను ఆగగలనా? లాభంలేదండి నేనీ ద్రవాన్ని పరిశోధించటానికి దాదాపు రెండు వేలరూపాయలవరకూ ఒక కాబూలీవాలాదగ్గర అప్పుచేశాను. వాడికి ఈ సాయంత్రంలోగా వడ్డీతో సహా రు. 25,00 చెల్లించలేకపోతే నాగదికి సీలు వేయిస్తాడు.

అంచేత రేపు ఉదయం వరకూ ఆగలేను. మీకు పెట్టుబడి పెట్టటానికి ఇష్టం లేకపోతే నిర్మొహమాటంగా చెప్పేయండి. నేను మరెక్కడికైనా వెళ్ళి ప్రయత్నిస్తాను ఇటువంటి ద్రవాన్ని నే కనిపెట్టి తయారుచేయబోతున్నానన్న సంగతి తెలిస్తే చాలు - పెట్టుబడిపెట్టడానికి అనేకమంది ముందుకు వస్తారు, అంటూ లేచాడు శేషావతారం.

"కూర్చోండి," అంది దమయంతి. శేషావతారం మళ్ళీ కూర్చున్నాడు.

"ఐతే ఇటువంటి ద్రవాన్ని తయారు చేయడం మూలంగా ఎంత లాభం వస్తుంది? కుతూహలంతో ప్రశ్నించింది దమయంతి

"చూడండి ... ఈ సీసాలో ఉన్న ద్రవాన్ని తయారుచేయటానికి ఖర్చు పేసకు మించదు. మనం ఈ రెండు ఔన్సుల సీసాను పావలాకు అమ్మవచ్చు. ఈ ద్రవాన్ని మనం పెద్ద ఎత్తున పబ్లిసిటీచేసి మార్కెట్టులోకి ప్రవేశపెట్తే, మాసం మాసం మనకు ఐదువేలకు పైగా లాభం వస్తుందని ఢంకా బజాయించి చెప్పగలను."

దమయంతి కాస్సేపు ఆలోచనలోమునిపోయింది. ఏదో యోచన తోచినదానల్లే ఉన్నట్లుండి చిటిక వేసింది ఆ...ఇ చూడండి ఈ వేళ సాయంత్రంలోగా మీరూ 2,500 లను ఎవరికో ఇవ్వాలన్నారుగా ఆ డబ్బును నేనిప్పుడు మీకిస్తాను. సొమ్మును వ్యాపారం చేసేటప్పుడు మన సర్దుకోవచ్చు. ముందు మీరు ఆ ద్రవాని ఎలా తయారుచేశారో నాకో కాగి మీద రాసియ్యండి" అంది దమయంతి.

శేషావతారం సందేహిస్తున్నట్లు న చాడు.

"మీరేం ఆలోచించక్కర్లేదు. య్యండి". .కావలిస్తే-చూడండి," అం దమయంతి మూలనున్న ఒక బీర్వా కెళ్ళి అందులోంచి, ఒక బలపా తెచ్చింది. "చూశారా ఈ బలపాలను దీన్ని ఎవరో గిరిధర్ అనే అతను పెట్టాడు. అతను ఈ బలపాన్ని తయారుచేశాడో నాకో కాగితం రాసిచ్చిపోయాడు. అప్పుడు కూడా తమ్ముడు ఇట్లో లేడు. వాడు వచ చూపించి, వాడితో చర్చించాను. వ ఒప్పుకున్నాడు. ఈవేళ ఉదయం ఆ గిరి వచ్చాడు. అతనితో మేము అన్నీ సం దించి ఒక నిర్ణయానికి వచ్చాం. వ మాసంలో ఒక మంచిరోజు చూసుకుని బలపాల ఫాక్టరీ ప్రారంభిస్తాం" అన్నది.

"నిజంగా మాలాటి బీదవారికి మీ చేస్తున్న సేవ అమోఘం!" అన్నాడు శేషావతారం.

"అసలింతకీ ఈ బలపం గురించి మీతో చెప్పలేదు" అంటూ దమయంతి ఒక కాగితం మీద పేనాతో రాసి, ఆ బలపంతో రాసిన అక్షరాలను తుడుపేసింది. శేషావతారం ఆశ్చర్యపోయినవాడికి మల్లే ఆ బలపాన్ని చేతికి తీసుకున్నాడు. ఇటూ అటూ తిప్పి చూశాడు. తర్వాత సమీపంలో టేబుల్ మీదవున్న మైక్రోస్కోప్ దగ్గిరి అందులో ఆ బలపాన్నుంచి పరీక్షించి నటించాడు. అతని మొహం వికసించి "ఆ!...తెలిసింది. ఈ బలపాన్ని తయారుచేశారో తెలిసింది" అనా సంతోషంగా.

దమయంతి విస్తుపోయింది. ఎలా త చేయవచ్చో చెప్పండి" అంది

శేషావతారం ఒక కాగితంమీద లెక్కలు వేసి, తర్వాత ఏదో రాసిచ్చా దమయంతి అది చదువుకొని మరింత ఆశ్ పోయింది. "నిజంగా మీరు సావ శాస్త్రవేత్తలుకారు. చాలా అనుభవవ వారు. ఆ గిరిధర్ కూడా ఈ బల

రాజీమార్గం

ఒక రైలు పెట్టెలో ఇద్దరాసాములు చేరి కిటికీ తెరవాలా ముయ్యాలా అన్న విషయమై తగవులాట ప్రారంభించారు. ఎంతకీ తెగక, స్టేషన్‌లో రైలాగగానే, గార్డుని పిలిచారు.

"కిటికీ కనక తెరిచి ఉంచితే జలుబుచేసి మలేరియా ముంచుకొచ్చి చస్తాను. అందుకని మూయించి తీరాలి" అన్నాడు మొదటి ఆసామి.

"మూస్తే, ఊపిరి సలపక ఉక్కిరిబిక్కిరై చచ్చి ఊరుకుంటా తెలుసా? తెరిచే ఉంచాలి" అన్నాడు రెండో ఆయన.

గార్డుకి ఏమీ తోచడం లేదు.

"దానికి ఒకటే మార్గం ఉంది - ముందర కాస్సేపు కిటికీ తెరవాలి. దాంతో ఒకడు గుటుక్కుమంటాడు. ఆ పైన కాస్సేపు మూసిఉంచితే రెండోవాడు హరీమంటాడు అక్కడితో మా అందరికీ పీడ విరగడై గోల అణిగిపోతుంది" అన్నాడు ఆ ఫార్సుతో విసుగెత్తిన మరో ప్రయాణీకుడు గార్డు చెవులో.

ఋ రాసిచ్చిన విధంగానే తయారు గాడు" అంది.

"ఊ...ఇంతకీ ఏం తేల్చారో చెప్పండి... త్వరగా వెళ్లాలి అన్నాడు శేషావతారం.

"చెప్పాకదండీ...మీరు ఆ ద్రవాన్ని తయారుచేశారో రాసియ్యండి. నేను రూ. 2,500 ఇప్పుడే ఇస్తాను. కబ్బుతో మీరు మీ అప్పులు తీర్చేయండి. ఒక వారం రోజులదాకా ఇక్కడికి రావొచ్చు" అంది.

"సరే..." అంటూ టేబుల్ మీదున్న ఒక లెటర్ పాడ్‌ను తీసుకున్నాడు. "మరి మీకు రసాయనికశాస్త్రంలో ఏమీ తెలియదన్నారుగా?" అన్నాడు.

"మాతమ్ముడికి తెలుసని చెప్పానుకదండీ" అన్నది దమయంతి.

శేషావతారం ఆ లెటర్‌పాడ్‌లో ఇలా రాశాడు:

$$Cu + Hg + Hno_3 + Sa = CuHgNo_3 + H_2O + NO_2$$

దమయంతి ఈలోగా వెళ్ళి రూ 2,500 ను తెచ్చి శేషావతారానికి ఇచ్చింది. శేషావతారం తను రాసిన కాగితాన్ని లెటర్ పాడ్‌లోంచి చింపి ఆమెకిచ్చాడు. "ఇది మీతమ్ముడికి బాగా తెలుస్తుంది" అంటూ తాను ఆ ద్రవాన్ని ఎలా తయారుచేశాడో వివరంగా చెప్పాడు.

"ఈ వేళ సోమవారంకదండీ. వచ్చేసోమవారం ఉదయం 10 గంటలకి మీరిక్కడ ఉండాలి. ఫోంచేసి రాకండి-ఇక్కడే ఫోంచేద్దురుగాని, ఆనాడు మీరు మాఅతిథి" అంది దమయంతి కృత్రిమసంతోషంతో.

శేషావతారం దమయంతిదగ్గర సెలవుతీసుకుని బయలుదేరాడు. ఆసమయానికి గిరిధర్ హోటల్లోంచి బయటికివస్తున్నాడు. శేషావతారం అతన్ని కలుసుకోగానే జేబులోంచి నోట్లకట్టలను తీసిచ్చాడు. "ఇందా భాయ్... ఈడబ్బు తీసుకో. నేచెప్పినట్లు ఈడబ్బును సద్వినియోగంచేసుకో. భగవంతుడు నీకు సర్వదా జయంకలిగిస్తాడు..." అని ఆశీర్వదించి, గిరిధర్ జవాబుకు యెదురు చూడకుండానే అక్కడ్నించి వడివడిగా వెళ్ళిపోయాడు.

దమయంతి, తనతమ్ముడు ఇంటికి రాగానే "ఒరేయ్ మురళీ! మనఅడ్వర్టైజ్‌మెంట్ చూసి ఈ వేళ మరొక వెర్రివెంగళాయ్‌వచ్చి మన టోపీలో పడ్డాడు. వాడిపని ముగించి పంపించేశాను. క్రోమియం ప్లేటింగ్ రా తమ్ముడూ! లక్షలు సంపాదించవచ్చు!" అని ఆనందంతో ఉక్కిరిబిక్కిరిఅవుతూ, శేషావతారం అక్కడ వదలిపోయిన పేపరు తమ్ముడికిచ్చి, అంతా వివరంగా చెప్పింది.

శేషావతారం రాసిచ్చిన కాగితాన్ని చూడగానే "మోసపోయావు అక్కయ్యా" అని అరిచాడు ఆమె తమ్ముడు.

"ఏమిట్రా!" అంది దమయంతి గాబరాతో.

"ఇందులో ఏమీ లేదు అక్కయ్యా! Cu అంటే కాపర్-రాగి. Hg అంటే మెర్క్యురీ - పాదరసం. HNO_3 అంటే నైట్రిక్ ఆసిడ్-నత్రికామ్లము. దీని అర్థమేమిటంటే, సజల నత్రికామ్లములో కొంత పాదరసాన్ని పోసి ఆ మిశ్రమాన్ని రాగివస్తువుమీద పోస్తే నత్రికామ్లము ఆ రాగి వస్తువుమీద కొంత భాగం తినేస్తుంది. పాదరసం ప్రభావం మూలంగా ఆ రాగి వస్తువుమీద అమాల్గం ఏర్పడుతుంది. అదే $CuHgNO_3$ ఇది వెండిపూత పూసినట్లు అగుపిస్తుంది. అందులోని మిగతా పదార్థాలు విభాజకమై H_2O అంటే - జలము, NO_2 అంటే - నైట్రోజెన్ డై ఆక్సైడ్ ఏర్పడుతుంది. కొంతసేపయ్యాక ఆ పాదరస సంబంధమైన అమాల్గం క్రమేణా నశించి, మళ్ళీ ఆ రాగి వస్తువు యథాప్రకారం రాగిరంగుకి వచ్చేస్తుంది. ఆ పూత ఎక్కువసేపు ఉండదు అంతే! ఇందులో కొత్త ఏమీ లేదు. ఏ హైస్కూల్ కుర్రాడికైనా ఇది తెలుస్తుంది. కాని అతను రాసిన 'SA' అంటే ఏమిటో నాకు అర్థం కాకుండా ఉంది. అదేమిటో నాకింతవరకూ కెమిస్ట్రీలో రాలేదు. వాడెవడో నీకళ్ళల్లో దుమ్ముకొట్టి పోయాడక్కయ్యా," అంటూ తన అక్కకేసి చూశాడు. ఆమె ఎప్పుడో కుర్చీలో మూర్ఛపడి పోయిఉంది.

దమయంతి పోలీసులకు రిపోర్టిచ్చింది. దొంగపేరుతో, మారువేషంలో ఆమె ఇంటికి వెళ్ళిన శేషావతారాన్ని పోలీసులు ఎలా పట్టుకోగలరు? అసలింతకీ దమయంతి శేషావతారానికి రూ. 2,500 ఇచ్చినట్లు వ్రాతపూర్వకంగా ఏమీ లేదు.

శేషావతారం ఆనాటి సాయంత్రమే బెంగుళూరు వదలి వెళ్ళిపోయాడు. దమయంతి దుఃఖంతో ఒక్క రోజులోనే ఏ ఐదు పౌండ్ల బరువో తగ్గిపోయి ఉంటుంది. కాని, ఆమె తమ్ముడుమాత్రం ఒక విషయం గురించి సతమతమై పోతున్నాడు. శేషావతారం రాసిచ్చిన దానిలో 'SA' అంటే ఏమిటో అతని కెంతకీ బోధపడలేదు. రసాయనిక శాస్త్ర ప్రవీణులు కొంతమందిని కలుసుకున్నాడు. వాళ్ళుకూడా ఆ 'SA' అనేది రసాయనిక శాస్త్రంలో ఎక్కడా లేదన్నారు.

దమయంతి తమ్ముడికి తలక్రిందులా తపస్సు చేసినా తెలియక పోవచ్చుగాని. 'SA' అంటే 'శేషావతారం' అన్న సంగతి పతిలకు ఈపాటికి తెలిసేఉంటుంది.

★



వంశీ పిక్చర్స్ వారి 'సౌభాగ్యవతి' లో సావిత్రి.



అనుపమ ఫిలింస్‌వారి ప్రథమ సాంఘిక చిత్రంలో గుమాస్తా వేంకయ్య భార్య సీతమ్మగా శ్రీ వరలక్ష్మి



వరసూవారి 'ధ



ముడు' లో గిరిజ



ఎ. వి. ఎమ్. ప్రొడక్షన్స్ వారి "శాంతపూరు" లో రాజసులోచన.



జూపిటర్ పిక్చర్స్‌వారి హిందీ చిత్రం 'నయా ఆద్మీ'లో బొంబాయి నర్తకి హెలెన్.

ఏ. వి. ఎం. వారి "నాగులచవితి"

పూజ్యత అనేది లాలించి, బెదిరించి, హింసించి సాధించేది కాదు. అయినా, ఈశ్వర మానసపుత్రిక 'మానసాదేవి', ఒకానొక అచంచల శివభక్తుణ్ణి లొంగదీయడానికి శక్తియుక్తితో ఉపాయాలు అవలంబిస్తుంది. భక్తుడు లొంగిరాడు. దేవత ఓడిపోతుంది. ఏ. వి. ఎం. వారి "నాగులచవితి" చిత్రానికి ఇదే కథావస్తువు.

భక్తుడు చంద్రధరుడిని లొంగదీయడానికి నాగదేవత మానస పన్నాగంలో, ఒకసతి పెళ్ళికాగానే భర్తను పోగొట్టుకుంటుంది. ఆమె పాతివ్రత్య ప్రభావంవల్ల తన భర్తను బతికించుకుంటుంది. ఆమెకు హాని చేసిన మానసా ఆమెవల్లనే పూజనీయత సంపాదించుకొంటుంది. ఆ తర్వాత, రాజా [illegible] మార్చుకొని, మానసను భూలోకంలో అవతరించవలసిందని కోరుతాడు.

అప్పటి వరకూ మూఢభక్తుడైన రాజా ఈ మాటలు అనడంతో జ్ఞానభక్తుడు అయినాడని నారదుడు ప్రవచిస్తాడు.

రాజా చేతి పూజలందడంకోసం మానస అతనిముందు లాలించి, ఆపైన ఆశపెట్టి తరువాత బెదిరించి, కడుగట్టి రాజాకొడుకులు అందరినీ హతమారుస్తుంది. ఇంకా క్రోధం పట్టే నిమిత్తం 'అతడికి మళ్ళీ పుత్ర సంతానం ప్రసాదించి, పెళ్లి జరిగినరోజున హతమారుస్తుంది. ఈ దారుణకాండ చూచిన రాజా మానసను క్షుద్రదేవత అనికూడా అంటాడు. పూజ్యత సంపాదించుకొన్న తరువాత ఆమెను పూజించడానికి ఒప్పుకొన్న రాజా, అంతటితో జ్ఞానభక్తుడు అయ్యాడు అనడంతో అప్పటి వరకూ 'క్షుద్ర దేవత'ను పూజించకపోవడం తప్పు అనీ, అంతవరకూ అతడు మూఢభక్తుడనీ విపరీతార్థం ధ్వనిస్తోంది. ఈ మాటలు అనిపించడంలో పొరబాటు కనబడుతుంది.

అలాగే, పాముకరచి చనిపోయిన భర్తను బ్రతికించుకోవడానికి ఈశ్వరుణ్ణి అర్థిస్తున్న విపుల, విసిగి వేసారి, శివాన్ని, విధిని నిందించే తీరే, అటువంటి పాత్రకు తగనిదిగా, ఒకమాట అనిపించారు. "పతిని బ్రతికించుకోకపోతే ఇంటికివస్తే నగుబాటు పాలుకానా" అంటుంది. ఆదర్శమూర్తిగా ఒక పతివ్రతను చిత్రిస్తున్నప్పుడు, పతిని బ్రతికించుకోడానికి, నలుగురూ నవ్వుతారన్న భయంకూడా ఒక కారణమన్నట్లు చూపించడం ఆ పాత్రకు కళంకం.

ఇది తప్పిస్తే, 'ముత్యమైద' కథా చిత్రణను దర్శకుడు శ్రీ నారాయణమూర్తి ప్రతిభావంతంగా నిర్వహించారు.

రాకుమారుడిని బతికించిన దృశ్యం, విపుల ప్రార్థన ఆలకించి, తిరిగి వెళిపోయిన సన్నివేశం ప్రశంసనీయంగా ఉంది.

విపులగా జమున, మానసగా జానకి, రాజాగా ఆర్. నాగేంద్రరావు తమ భూమికలను సామర్థ్యంతో నిర్వహించారు.

చిత్రంలో పాటలూ పద్యాలూ పుష్కలంగా ఉన్నాయి. ఐదారు నృత్యాలున్నాయి. ఆర్. సుదర్శనం, గోవర్ధన్‌లు వినసొంపైన సంగీతం సమకూర్చారు. సెట్స్, ఫోటోగ్రఫీ మొదలైన హంగులన్నీ ఉత్తమస్థాయిలో ఉన్నాయి.

★

బొంబాయి సినిమా లేఖ

ఫిబ్రవరి 5వ తేదీన దిలీప్‌కుమార్ సోదరి ముంతాజ్ బేగంకు వివాహం జరిగింది. వరుడు హైదరాబాద్ మాజీ మంత్రి నవాబ్ ఫజల్ నవాజ్ జంగ్ కుమారుడు, అసద్. ముంతాజ్ పెళ్ళి విందుకి, బొంబాయి చలనచిత్ర పరిశ్రమ ప్రముఖులు, నటీనటులు దాదాపు అందరూ వచ్చి కానుకలిచ్చి వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. కామినీ కౌశల్, వైజయంతిమాల మాత్రం రాలేదు.

* * *

ఫిలిమిస్తాన్ వారి మొట్టమొదటి సినిమాస్కోప్ చిత్రం "బాంబే ఫ్లయిట్ 417" విడుదల విషయమై ఇంగ్లాండ్‌లో ఏదో పేచీ వచ్చినట్లు తెలిసింది. అదేదో చక్కబెట్టే నిమిత్తం నిర్మాత శశిధర్ ముఖర్జీ లండన్ వెళ్ళారు.

* * *


అమెరికా మోషన్ పిక్చర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎరిక్ జాన్‌స్టన్ ఈ నెల 22న బొంబాయి వస్తున్నారు. ఈయన ఈమధ్యనే ప్రపంచపర్యటనకు బయలు దేరారు

* * *

ఒక ప్రఖ్యాత పంజాబీ ప్రణయ గాథ ఆధారంగా ఫిలిమిస్తాన్ నిర్మించిన చిత్రం "హీర్" పత్రికల వారికి చూపించబడింది. నూతన్ ప్రదీప్‌కుమార్‌లు ముఖ్య భూమికలు నిర్వహించిన ఈ చిత్రానికి హమీద్ [illegible] మిగతా అంశాలు - సెట్స్, వేషధారణ, ఛాయాగ్రహణం, శబ్దగ్రహణం, వంటివన్నీ ఉత్తమంగా ఉన్నాయి. కథను మాత్రం అధ్వాన్నంగా చిత్రించారు. తరతరాలుగా, లక్షలాది ప్రజలను ముగ్ధుల్ని చేస్తూ వచ్చిన ఈ గాథను అనేక రకాల సంభాషణలతో, అనవసర సంభాషణలతో పాడు చేశారు. ఇవన్నీ ఇలా ఉన్నా నూతన్ మాత్రం హీర్ భూమికను బాగా పోషించ గలిగింది. ప్రదీప్ కుమార్ నిర్వహించిన నాయకుని పాత్ర పూర్తిగా దెబ్బతింది. చిత్రానికి ముఖ్యంగా వన్నె తెచ్చినది ఛాయాగ్రహణమే కాక, సుల్తాన్ పురీ వ్రాసిన పాటలు, వాటికి అనిల్ బిశ్వాస్ సమకూర్చిన సంగీతం అద్భుతంగా ఉన్నాయి.

* * *

ఒక న్యాయవాది చాలా తెలివైనవాడు, బహు మంచివాడు. బుజావర్తనము లేని గుణంవల్ల డబ్బు ఆర్జించలేక, కష్టాలు పడి



రాజ్యం పిక్చర్స 'హరిశ్చంద్రలో' వధ్యశిలకు తీసుకుపోబడుతున్న చంద్రమతి.



జూపిటర్ వారి "ఉమాసుందరి"లో నాగయ్య, కన్నాంబ

ం. అది సహించలేనిస్థితి వచ్చేసరికి, ...రీగా మారిపోయి, సదసద్వివేచన ...దా వర్తించి అమాంతం లక్షలార్జి... తిరిగి మామూలుగా అహం దెబ్బ తిని ...దారికి వస్తాడు. హీరేన్‌గుప్తా నిర్మిం... 'టక్సాల్' అనే చిత్రానికి ఇది కథా...వు. అంత ప్రతిభగల న్యాయవాదీ, ...కష్టాలు వచ్చినపుడు సహించి బాధ...ంతప్ప, వాటిని నివారించుకోడానికి ...త్నాలు చేసినట్టు కనపడదు. అంతటి ...వాడూ, అంత తెలివిగలవాడూ, ...తం పరమదుర్మార్గుడైపోవడం సంగతి ...ఉండగా, అసలు అతడికి జీవితంమీద ...ట్ సముద్రికమైన దృక్పథం ఎందుకు ...దా అనిపిస్తుంది. కథా చిత్రణలో, ...చిన అనేక సన్నివేశాలు కూడా ఇదే ...లో దీనికి తగ్గట్టే ఉన్నాయి.

...పాత్రను విపరీత ప్రకృతిగా చిత్రిం...కోసం కల్పించిన వాటిలో ఒకటి మరీ ...గలింగా ఉంది. ఈ న్యాయవాది బాగా ...గాడుగా ఉన్న దశలో ఒక నాటి ముహూర్తాన, ఒక సరదా పుట్టుకుందట. అపశకునంగా ఒకర్ని పిలిచి, మేడమెట్లమీద నుంచి దూకమని ఆజ్ఞాపిస్తాడు.

ఈ కథను దృష్టిలో ఉంచుకొని, మా స్త్రీ, దీనికితగ్గ మేరకు, నటన బాగుందనే చెప్పాలి. ఈ న్యాయవాది పాత్రను, బల్‌రాజ్ సాహ్నీ నిర్వహించాడు. భక్తురాలైన అతని భార్యగా నిరుపరాయ్ కూడా నిగ్రహంతో తన పాత్రను నిర్వహించింది. బాల్‌రూమ్ డాన్సరుగా స్మృతిబిశ్వాస్ నటన, పాత్ర బాగుండినందువల్ల దెబ్బతింది. అసహజంగా తయారైంది.

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)

★

నమ్మినా మానినా...

నాగుపామును చంపడం అరిష్ట సూచకమని ఒక నమ్మకం. ఇలాంటివే మన దేశంలో అనేకం ఉన్నాయి. ఇవన్నీ వట్టి మూఢ విశ్వాసాలు (సూపర్ స్టిషన్) అని కొట్టి పారేస్తూ ఉంటారు. ఒక్కొక్కసారి ఈ 'మూఢ' విశ్వాసాలకు నిదర్శనాలు కనబడుతూంటాయి. అటువంటప్పుడు ఒక్క క్షణం స్థిమితంగా ఆగి ఆలోచించ బుద్ధి వేస్తుంది. ఇది నిజంగా మూఢవిశ్వాస మేనా? అని.

ఫిలింస్థాన్ వారు "బాంబే ఫయిట్ 417" చిత్రం నిర్మిస్తున్నపుడు ఇటువంటి సంఘటన ఒకటి జరిగింది. ఈ చిత్రంలో పాముతో వ్యవహారం కొంత వుంది. దీనికి మొదట్లో "శ్రీ హెడెడ్ కోబ్రా" అని పేరు పెట్టడం కూడా తెలిసినదే.

ఈ చిత్రంలో నాయకి సూర్యకుమారిని ఒక నాగుపాము కరవడం, అపుడు హీరో అజిత్ అనే ఆర్టిస్టు వచ్చి ఆ పామును చంపడను ఒక ముఖ్య ఘట్టం. దీనికోసం ఒక నాగుపామును తెప్పించారు.

సినిమా స్కోప్‌లో టెక్నికలర్ చిత్రంగా నిర్మిస్తున్నందు వల్ల షూటింగ్ వు, మామూలు చిత్రాలలో వాడే వాటికన్నా ఎక్కువ కాంతివంతమయిన దీపాలు,

నమ్మినా మానినా....

ఆర్క్ లైట్లు వాడవలసి వచ్చింది కాబట్టి సెట్ మీద వేడి 140 డిగ్రీల దాకా హెచ్చింది. నటీనటులు ఆ వేడికి ఎలాగో నిభాయించుకున్నా, నాగుపాము మాత్రం తట్టుకోలేకపోయింది. ఆ స్థితిలో అది సొలిపోయి, తల వేలవేసి పడుకుంది. చంపేముందు, దాన్ని రెచ్చగొట్టి బాగరుగా చూపించడానికి వీల్లేకపోయింది. దాన్ని నిజంగా చంపడానికి పాములవాడు ఒప్పుకోలేదు. అప్పటికప్పుడు వాడిచేతే, ఒక కొత్త పామును పట్టించి తెప్పించారట. అపైన దాన్ని తప్పనిసరిగా చంపివేసి, పీచుమీది ద్వారి దాన్ని కెమెరా ఎదుట పెట్టారు. స్టుడియోలో కొందరు పాముని చంపడం కూడదన్నారట.

సరే, తీరా ఆ పాముని ఆలెన్స్ తీకర్సీ ఒక గీపం సెమ్మెవంటి దానితో కొట్టి చంపబోయేసరికి, ఆ విసురులో, సెమ్మెకి బిగించిన దిమ్మ ఊడిపోయి ఎదట కెమేరాపక్కన ఉన్న ఫ్లడ్ లైటుకి తగిలింది. లైటు, అందులో వున్న పెద్దబల్బు పగిలిపోయాయి. గాజు పెంకులు అక్కడేవున్న అసిస్టెంట్ కెమెరామన్‌కు తగిలి అతడు కొద్దిగా గాయపడ్డాడు. ఆ తరువాత రెండు రోజులలో కూడా ఇటువంటివే కొన్ని ప్రమాదాలు జరిగాయట.

మద్రాసులో బాలల చలనచిత్రోత్సవం

మార్చి 8వ తేదీనుండి వారంరోజుల పాటు మద్రాసులో బాలబాలికలకు, పిల్లలు చూడతగ్గ చలనచిత్రాలు చూచి ఆనందించే అవకాశం కలిగింది. బాలచలనచిత్రోత్సవం పేరిట ఈ సదవకాశాన్ని కలిగించినవారు మద్రాసు ఫిలింఫాన్స్ సంఘం. ఇటువంటి ఉత్సవం ఏర్పాటుచేయడానికిది రెండవసారి. ఈ వారంరోజులలోనూ, నగరంలోని 6 థియేటర్లలో పాతిక చిత్రాలను ప్రదర్శించారు. ఇవన్నీ వివిధదేశాల పిల్లలకై ప్రత్యేకంగా తయారుచేసినవి. ఆరు థియేటర్లకీ వందలకొద్దీ బాలబాలికలతోపాటు, వారిని అక్కడకు తీసుకువెళ్ళిన పెద్దలుకూడా ఈ చిత్రాలనుచూచి ఆనందించారు. వీటిలో "లిటిల్ ఎంబాసిడర్స్" (చిట్టి రాయబారులు) అనేచిత్రం దేశదేశాల బొమ్మలను చూచే అవకాశం కలిగించింది. 'శంకర్స్ వీక్లీ' పత్రిక అధిపతి ఢిల్లీలో ఏర్పాటుచేసిన 'అంతర్జాతీయ బొమ్మల ప్రదర్శన'మే దీనికి ఆధారం. ఈ చిత్రాన్ని రంగులలో టెక్నికలర్ చిత్రంగా నిర్మించారు.

శ్రీ సంతానం సలహా

ఈ చలనచిత్రోత్సవానికి, ఇటీవల నగరంలో ఉత్తమథియేటరుగా ఎన్నిక అయిన 'మిడ్‌లాండ్'లో మార్చి 8 ఉదయం శ్రీ కె. సంతానం (ఆర్థిక సంఘానికి కాబోయే అధ్యక్షుడు) ప్రారంభోత్సవం చేశారు. మద్రాసు ఆర్థికమంత్రి శ్రీ కె. సుబ్రహ్మణ్యం సభకు అధ్యక్షత వహించారు. శ్రీ పిల్లల బుద్ధివికాసానికి చలనచిత్రాలు చేయగల దోహదాన్ని వివరిస్తూ ప్రతిచిత్రం పదినిమిషాలలో పూర్తి అయేదిగా ఉండాలనీ, మొత్తం ప్రదర్శన కాలం గంటకు మించరాదని (అంటే ఆరు చిన్న చిత్రాలన్నమాట) సంతానం సూచించారు.

ఆర్థికమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, పిల్లల అభిరుచులను దృష్టిలో ఉంచుకొని చిత్రాలు నిర్మించాలన్నారు. ఈ రంగంలో, ప్రభుత్వం శాయశక్తులా సహాయం చేయగలదని ఆయన చెప్పారు.

ఉత్సవ నిర్వహణ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీ కె. సుబ్రహ్మణ్యం, పిల్లలకై చలనచిత్రాల నిర్మాణం ప్రోత్సహించడం పట్ల మద్రాసు ఆర్థికమంత్రి శ్రద్ధాసక్తులను ప్రశంసిస్తూ మనదేశంలో పిల్లల చిత్రాలపై వినోదం పన్ను రద్దుచేసిన మొట్టమొదటి ఆర్థికమంత్రి ఆయనేనని, అన్నారు.

సభ ఆరంభంలో కుమారి భూమా చి॥ కృష్ణకాల ప్రార్థనల అనంతరం, ఫిలింఫాన్స్ సంఘ కార్యదర్శి శ్రీ ఇ. బి. శామ్యూల్, సభా కాంతులు తెలుపుతూ డా॥ బి. వి. కేసర్కర్, మద్రాసుగవర్నరు శ్రీ శ్రీప్రకాశ ప్రభృతులు పంపిన సందేశాలను చదివారు.

ఉత్సవనిర్వహణ సంఘం అధ్యక్షురాలు శ్రీమతి రాజమ్మాళ్ అనంతరామన్ స్వాగతం చెప్పారు. ఫిలిం ఫాన్స్ సంఘం అధ్యక్షుడు శ్రీ అరుణాచలం మాట్లాడుతూ, ఫిలిం ఫాన్స్ సంఘం చేస్తున్న కృషి దృష్ట్యా, ప్రభుత్వం దీన్ని గుర్తించి, ప్రోత్సహించాలన్నారు.

శ్రీ శామ్యూల్ వందన సమర్పణతో సభ ముగిసింది. అనంతరం, 6 చిన్న చిత్రాలను ప్రదర్శించారు.

సోమవారం నుండి ఆరురోజులపాటు కపాలీ, సన్, స్టార్, న్యూ ఎల్ఫిన్‌స్టన్, బ్రాడ్వే థియేటర్లలో ప్రతిరోజూ ఉదయం 9-30 నుండి 11-30 వరకూ చిత్రాలు ప్రదర్శించారు. పెద్దలువివిధపాఠశాలల, ఉపాధ్యాయులు ఆయాథియేటర్లకు పిల్లలను వెంటబెట్టుకు వెళ్ళి చూపించారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా రుసుము నాలుగణాల చొప్పున వసూలు చేయబడింది ★



గ్యాన్ ముఖర్జీ నిర్మించిన 'షత్రంజ్'లో మీనాకుమారి, అశోక్ కుమార్.

సిరోలిన్

మీ దగ్గుకి కారణము నిర్మూలము చేస్తుంది —మీ దగ్గుటను ఆపుట మాత్రమే కాదు



సిరోలిన్ మీకు దగ్గును కలిగించే అపాయకరమైన రోగ క్రిములను నిర్మూలిస్తుంది



దగ్గు అపాయ చిహ్నము, మీకు దగ్గు వస్తే గొంతుకలోను, ఊపిరి తిత్తులలోను వుండే సున్నితమైన పొరలు వాచి, ఉన్నాయన్నమాట. ప్రత్యక్షముగా మీ దగ్గుకి కారణమును పోగొట్టే ఒక మందు అవసరము — దగ్గుటను ఆపుట మాత్రమే చేసే మందు వాడుట వలన లాభము లేదు.

సిరోలిన్ రెండు విధములుగా మీ బాధను నిర్మూలము చేస్తుంది. మొదటిది. దాని క్రిమి సంహార శక్తి రోగ క్రిములను హరించివేసి అవి యింకా వ్యాపించకుండా ఆపుటలో సహకరించును. రెండవది, గొంతులో అడ్డు పడిన కఫము. దీనిని సులభముగ పైకి రావడానికి సహకరించి సత్వరమైన నిజమగు ఉపశమనము నిచ్చును. సిరోలిన్‌లో ఎఫిడ్రిన్ చేర్చబడలేదు.

దగ్గుకు నిరపాయమైన కుటుంబ ఔషధము కూడను. కుటుంబములో అందరూ దీనిని భయము లేకుండా వాడవచ్చును — పిల్లలుకూడ. ఎందుకంటె సిరోలిన్‌లో హానికరమైన మత్తు మందులు లేక యితర మందులు లేవు. దాని కమ్మని రుచి పిల్లలకు ప్రీతి. సిరోలిన్ ఎల్లప్పుడూ ఒక సీసా మీ యింట్లో ఉంచండి.



సిరోలిన్ 'రోష్'

ఆకాశ నాటిక:

జీవనఫలం

గాత్రధారులు :

1 విలాసిని
2 వినోదిని
3. యువకుడు
4. వృద్ధుడు
5 బాలుడు
6 శాంతి
7. కాంతి

గొంతుకలు...1...2 3...4...

విలాసిని : 'లేదు సుఖం లేదు రసం
చేదు విషం జీవ ఫలం
జీవ ఫలం చేదు విషం
చేదు విషం చేదువిషం'
వినోదిని: 'ఔను నిజం ఔను సుమా
ఔను నిజం నీ వన్నది
నీ వన్నది నీ వన్నది
నీ వన్నది నిజం నిజం'
విలాసిని : ఎవరేనా నాకు తియ్యని
విషమిస్తే బాగుండును
నన్ను మంత్రిస్తే స్వప్నంలా కరిగిస్తే
బాగుండును, బాగుండును.
నా వేదన దగ్ధం చేసి నన్ను సమ్మగ్ధను చేసి
నా కాళ్ళకి చక్రాలు
నా కళ్ళకి అద్దాలు
నా కలలకు రెక్కలిచ్చి
ఇంకో లోకంలోకి మరో తీరానికి
నన్ను ఎగరేసుకుపోతే బాగుండును
వినోదిని : ఒదులుగు గానున్న పాదిగిలిలోంచి
బిగించిన పిడికిలిలోకి
మొద్దుబారిన కత్తుల బాటనుండి
పదునుపట్టిన ద్వేషాల దూరంమీదకి
నిస్సారమైన జీవితంనుండి
సారవంతమైన కష్టంలోనికి
మళ్ళించగల మొనగాడెవడు?
మనను మళ్ళించగలవాడెవరు?
విలాసిని : నీ కన్నుల కాటిరి
బతుకు తర్పించా పాటరి

కలల పడవలమీదపోయి
చేరుకొందాం అద్దరి
చీకటిలోకి వలసపోదాము
జీవితాలు వదిలేసి వెళదాము
ఎన్నటికి కురిసేను స్వాతివాన, ఎన్నటికి
ఆణిముత్యాలు పడతాయి మనస్సులలోన
వినోదిని : పట్టాలి ఎవరికివారే ఒంటరిబాట
పాడుకోవాలి లోలోపల చేదుపాట
విలాసిని : (ఏడుపుగా)
'లేదు సుఖం లేదు సుఖం
లేదు సుఖం జగత్తులో'
వినోదిని : 'బతుకు వృథా చదువు వృథా
కవిత వృథా వృథా వృథా'
విలాసిని : (ఏడుపు) అవమానాలను
చేతపట్టుకొని
~~వినోదిని : పవమానాలను...చేతపట్టుకొని~~

ఆరుద్ర

విలాసిని : పదపోదాం స్వప్నంలోకి
వినోదిని : పదపోదాం నలని నరకంలోకి
విలాసిని : మన అనురాగాలను
చూపెట్టేందుకు
అనువైన వాడెవడూ లేడు
వినోదిని : మనస్తాపాన్ని ఆరవేసేందుకు
మగదండల దండెం లేదు
విలాసిని : కన్నీళ్ళ సిరాతో కావ్యాలు
విరచించేవారు
ప్రయ్యలైన హృదయశకలాలతో
బొమ్మరిల్లు కట్టుకొనేవారు
అలసిపోయిన జీవితాలతో
ఆడుకొనేవారు
సిపాయికి రూపాయి చూపి
అపాయాలు తెప్పించేవారు
ఊర్పులో కూరుకుపోయిన
కోర్కెల రథచక్రాన్ని విదల్చేవారు
తెలిసి తెలిసి చేయరాని పనులు
చేసేవారు వాటికి వెల్లవేసేవారు
పెద్దమనిషితరహాలోకం ఇది
నిక్కమిద్దా మిక్కడనుండి
విశ్రమిద్దాం మృత్యువులో పదండి.

వినోదిని: అలమీద జీవిస్తూ
శ్వాస తీసుకోడం కష్టం
చూసి చూసి మోసాలకు తలవొగ్గడం
దోషాలవైపు విధిలేక మొగ్గడం
ఎందుకు మనకు చెల్లీ
పోదాం వెనక్కి మళ్ళి
విలాసిని: దారిలో బోనులుంటాయి
వాటిలో పడకూడదు మనం.
వినోదిని: దారిలో ఎరలుంటాయి
వాటిని తినకూడదు మనం.
విలాసిని: పద పోదాం చిక్కని చీకటిలోకి.
వినోదిని: పదపోదాం పాతాళంలోనికి ప్రాకి
యువకుడు : పేరుకొనిపోయింది పాపాల
పరస్పర
పేరుపోయింది చెడిపోయింది మనస్సు
ఇది ఉవ్విళ్ళూరించే ఊబి
మానవుడు ఆనందలోభి
కళ్లు తెరచుకొని కాళ్లు విరుచుకొని
పతనమవుతున్నా రెందరెందరో
పడుతున్నారు తలక్రిందులుగా ఇందులో
కొత్తగా వచ్చే మీరెవరు మీరెవరు?
విలాసిని: వాడిపోయిన పువ్వులం.
వినోదిని: ఓడిపోయిన జవ్వనులం
విలాసిని: చెరిగిన చిరునవ్వులం
వినోదిని: చెదరిన స్వప్నాలం
యువకుడు: వద్దు వద్దు ఇందులో
మునగొద్దు ఇది మీరు
చేరరాని సరిహద్దు
వెళ్లిపొండి వెనక్కి మళ్ళి
పడవకండి ఈ పాపంలోనికి
పడవద్దు అగాధ కూపంలోనికి
మీచోటు ఉయ్యాలవద్ద
మీరు ఒకయింటి నట్టింటి దీపాలు
మీరెందుకవుతారు పాలకోల పాలు?
విలాసిని: వెతికాం వెలుగురేకలకోసం
బతికాం మర్యాదాకోసం
పెచ్చుదనం కోరుకొన్నాము
పచ్చగా ఉండాలనుకొన్నాము.
వినోదిని: వేడి లోపించింది
వెలుతురు లోభించింది
ఉద్వేగంగా బతకాలని
ఉద్రేకాన్ని బతకాలని

త్వరపడి నరకంలో అడుగిడి
పొరపడి అక్కడే పడపడి
నగరంలో నగరంలో నగరంలో
ఇళ్ళనుండి వెలువడి
సంకెళ్ల నుండి విడివడి
ఫ్యాషన్లకి లోబడి
ఎడారి నాగరికత బిడారుల జోరబడి
ఒంటికాలు ఒంటెమీద
ఒంటె ఒంటిగా నిమ్మాపుమీద చలికిలపడి
పోతున్నాం ఎండమావుల తియ్యమావి కోసం
పోతున్నాం పోగాలపు మేఘాలమీదకు.

విలాసిని : చిందర వందరల
ముందరోడి జీవితం రుచించలేదు.
సుందరత ఎక్కడో
ఉందనుకొని పోతున్నాం మేము.
ఆపుతున్నారు మమ్మల్ని తేప తేపకు.
పోనిమ్మి పుణ్యముంటుంది మమ్మాపకు.

యువకుడు: ఇది వినాశనానికి దారి
ఈ ట్రంకురోడ్డుమీద లేదు స్పీడులిమిటు
దగాపడిన సుందరులు
కాలుజారిన సోదరులు
తెగించి నడుములు బిగించి వస్తారిటు
చిత్తమొచ్చిన ఆలోచనలమీద
సెవ్నారు కత్తెరులకు
ఐడియాలమీద సి. ఐ. డీలకు
భావాలకి పోలీసులకు
ఎదురు తిరిగిన యువకులు
ఎందరెందరో వస్తారిటు
పసివాళ్లు ముసిలివాళ్లు
పాడుచుకొని వస్తారు పడుచువాళ్లతో.

వృద్ధుడు: విలాసానికి దారి ఇదేనా
బాలుడు: ఖులాసాకి దారి ఇదేనా
విలాసిని : రండి తాతగారూ
దాటేద్దాం నియమాల యేరు
వినోదిని : రా కుర్రాడా
ఎక్కుదాం తిరుగుబాటు ఓడ.
యువకుడు: ఆగండి - చెడిపోకండి
వద్దు పతనం కోకండి
వినాశనం దారిపై వెళ్లిపోకండి
విలాసిని : ఇటు ఇటు
సరదాకి దారి ఇదే.
బాగుపడిపోవడానికి మందొక్కటే.
మనల్ని రక్షింపగలిగేది చీకటే.
వినోదిని. పోకులతో
సోమరిగా బతుకుదాం
విస్వారమైన మర్యాదా మప్పితాలకన్నా
సారవంతమైన చెడ్డతనం మేలు
వృద్ధుడు : పదండి సరేసరే
బాలుడు : పోదాం బలే బలే.
వినోదిని : ఈ దారి నర్తన శాలకు
విలాసిని : ఇది యథేచ్ఛావర్తన శాలకు
వృద్ధుడు: కుర్రాడా చెయ్యి కొంచెం ఇయ్యి
బాలుడు: తాతయ్యా ముందడుగు వెయ్యి
యువకుడు : పోతున్నారు ఆడామగా చిన్నా పెద్దా
అంతులేని పాపాల ప్రాంతాలకు
అంతరాళ కరాళ గహ్వరాలకు
పోతున్నారు పోతున్నారు పోయారు
జీవితంలో ఓడిపోయారు
మంచినుండి విడిపోయారు
అది విలయం
నీచత్వ నిలయం
భయంకర విలాసవలయం
అక్కడికి చేరుకొంటున్నారు
సాగివస్తారు విస్తారంగా వీళ్లు
సాయంకాలపు దీర్ఘచ్ఛాయలవలె
భయం తమం సమంగా కలసినప్పుడు
ఊపిరి ఉల్లాసంగా పీల్చుదామని
దోపిడి కొంతసేపు మరచిపోదామని
ఆహ్వానిస్తాయి పాపపంకిలాల బిలాలు
అరుస్తాయి బేహారుల గొంతుకలు

1వ గొం : ఇచట ఆనందం కొరు చౌక
రిపేరు చేయుబడును మీ విరిగిన జీవననౌక
2వ గొ: సినిమా రికార్డుల వేడి వేడి సంగీతం
మీ సొట్ట సరదాలు నడిచేందుకు ఊతం
1వ గొ: కొద్దిగా రిమ్మెరెక్కితే చాలును
మీ హృదయాలలో ఆనంద విహంగం వ్రాలును
2వ గొం : ఈ సాయంత్రానికి వృద్ధాప్యం రానేరాదు
1వ గొం : ఈమత్తు చీకటితో లగి ఇక తెల్లవారదు
2వ గొం: ఇచటి క్రొత్తకులు సైతరా పాలుగారు కన్నెలు
చూడండి మసక మసక కన్నులతో ఈ వన్నెలు
1వ గొం: మతిపోయిన నాట్యాలు చేసే షోకిళ్ళలకు
పట్టండి మీరు సత్తువలేని కాకి బంగారు పల్లకీలు.
2వ గొం: అగడాల కౌగడాలు వెలిగిస్తా మిక్కడ
1వ గొం: ఇది వాలిపోయిన పాలిపోయిన అందాల అఖాడా
2వ గొం : ఇది నిత్యమిథ్యా సంధ్య

యువకుడు : ఎంత పతనం ఎంత పతనం
సతమత మవుతున్నారు సరదాలకొరకు
హతమవుతున్నారు ఆనందంకొరకు
మీసాలమీద తేనెలు తుచ్ఛసుఖాలు
ఆనందో బ్రహ్మ మంటారు అంటారు పాపాన్ని
ఈప్సితాలకి సంతృప్తిలేక
కామితాలకి మితిలేక
మనస్సుకి ప్రశాంతిలేక
మాతృశ్రీలు కావలసినవారు
వీరపత్నులు, వీరమాతలుగా అవవల సినవారు
చదువుకొన్నవారు, చదవేస్తే ఉన్నమతి పోయినవారు
భవిష్యత్తును లాలించవలసినవారు
వర్తమానాన్ని పాలించవలసినవారు
వెర్రి తలలు వేస్తూ
నాగరికత పేర పిచ్చిపోకడలు పోతూ
ఎంత పతనం
యువకులు జాతి వెన్నెముకలు
ఎంతహీనిగా నడుస్తున్నారు
ఆరముగ్గిన ముసిలివాళ్లు
విచ్చీవిచ్చని పిల్లవాళ్లు
అందరూ ఎంత భోగవరాయణులౌతున్నారు

ఏమిటి దీనికి కారణం
ఏమిటి సంస్కరణకు సాధనం

శాంతి: చెప్తాను జవాబు గనికి, •
శప్తులు ఈ యుగంవారు
జీవితంలో సౌఖ్యం వాంఛనీయమైనా
సౌఖ్యమే జీవితం కాదు
బతకడానికి తిండి తినాలిగాని
తినడానికే బతుకుతారు వీళ్లు
జీవనఫల మందదు వీరికి
అది అందినచో సమస్య లుండవెవరికీ
యువకుడు: ఎవరమ్మా నువ్వు
వచించావు నిజాన్ని
శాంతి: నేను శాంతిని
అమందానందకరమూర్తిని
నిర్మల శుభసౌఖ్య నియతిని
నిశ్చల విజ్ఞాన నిరతిని
నేను శాంతిని.
యువకుడు: ఎటుల పతితుల నుద్ధరించుట
ఎటుల దేశాన్ని బాగుచేయుట
సెలవిమ్మా అమ్మా
నీవు శాంతివేకద, ఈ
అశాంతులకు అభాగ్యులకి
నీ చల్లని దీవన లిమ్మా
శాంతి : నా దీవనలు సులభసాధ్యమ్ములు కా

★ జీవనఫలం ★

ఒక చిలకని వేలం వేస్తున్నారు. ఒకానొక అప్పారావు ముచ్చటపడి, పెద్ద ధరకి పాడి చిలకని కొనేశాడు.

"బాగా మాట్లాడుతుందా?" అని అడిగాడు చిలక స్వంతదారుడిని.

"ఇంకా మెల్లిగా అడుగుతారా. ఇంతసేపూ మీకు పోటీగా పైపాట పాడుతూ వచ్చింది అదేగా?" అన్నాడు అతడు.

ఆయువులో తెలియని మార్గమ్ము లభేద్య
ముల్లు కావు
జీవనఫలాన్ని సాధించి దేశానికందిమ్ము
అది నాకు నైవేద్యమ్ము కానిమ్ము.
యువకుడు : అవును అవును అంతర్ధానం
మమ్మల్ని చేయ కధ్యాన్నం
వెళిపోకు కాంతి
కలిగించకు మాకు భ్రాంతి.
(సంగీతం)
యువకుడు : వెడలిపోయింది, వీడిపోయింది
కాంతి
ఇపుడేమిటి? ఏమిటి? ఏమిటి గతి
ఎలా తొలగుతుంది ఇపుడీదుర్భరస్థితి.
(అందెలరవళి)
కాంతి : ఉన్నానుగా నీతో నేను
అవుతాను నీకు చేదోడు వాదోడు
కాంతిని నీ యింతిని అర్ధాంగిని
కలసి మెలసి పనిచేద్దాం
చేద్దాం నాడుని కాంతివంతం
చూద్దాం కలకాల వసంతం.
యువకుడు : సాధ్యమవుతుందా కాంతీ
చేకూరుతుందా కాంతి
పండించగలమా జీవన ఫలాన్ని
అందించగలమా దాన్ని కోటి కోటి
నిర్భాగ్య జనులకు
పామరులను పామరులను
అమరులుగా మార్చగలమా

చందనవనాన్ని భూమికి దించగలమా
సందేశాన్ని వినిపించగలమా
బ్రతుకుని అర్థవంతం పూర్తిగా చేయ
గలమా?
కాంతి : వీలుపడనిదంటూ ఏమీ లేదు
మేలుపనులు చేయడానికి
అవాంతరాలు అనేకం రావచ్చును
నిరుత్సాహపడకూడదు
నిర్భయస్తులని ఆశ వీడదు
ఆశయం గభీరమైతే
జీవితం గంభీర మవుతుంది
దున్నుదాం హృదయక్షేత్రాలని
జల్లుదాం చేతనాల విత్తనాలని
ఆశయాలని ఆవహింపచేసి
దోహదం చేద్దాం వరుపు ప్రతిష్ఠల
ఎరువు వేసి
పద జీవనఫలాన్ని సాధించి
అందరికీ అందిద్దాం.
(బుల్‌డోజర్లు దున్నుతాయి,
జలం పారుతుంది)
యువకుడు : ఇదేమిటి? ఇంతవింతగా ఉంది?
కాంతి : ఏమో.
యువకుడు : ఇదేమిటి? ఇంత మెరుస్తూ
ఉంది?
కాంతి : ఏమో.
యువకుడు : ఎంత బాగుంది ఏమిటిది?
ఏమిటిది?
కాంతి : ఏమో ఏమో.
యువకుడు : ఎత్తయిన భావంకన్నా
ఎత్తయినదా ఇది
కాంతి : కాబోవు
యువకుడు : మెత్తని పువ్వుకన్నా సుకు
మారమా
కాంతి : కాబోవు.
యువకుడు : కఠినమైనది కఠోరమైనది
ఏమిటిది?
కాంతి : ఏమో—ఏమో.
యువకుడు : ఇది రథమా?
కాంతి : కావచ్చును.
యువకుడు : ఇది శుభమా?
కాంతి : తేవచ్చును
యువ : ఇది వేదిక
కాంతి : నిలబడు
యువ : ఇది పీఠిక
కాంతి : త్వరపడు
యువ : మన ప్రయత్నాలు సఫలం
కాంతి : ఇదే ఇదే ఇదే ఇకే జీవనఫలం
(పెల్లుబికే సంగీతం)
యువ : పద అందిద్దాం-ఇది అందరికీ
పద ఇద్దాం దీన్ని పతితులకి
(కోలాహల వాతావరణం)

యువ : రండి ఇటు రండి చూడండి
మీ కొరకు తెచ్చాను జీవనఫలాన్ని
పడిపోయిన చెడిపోయిన
పతనమైన సోదర సోదరీమణులారా
నా అనుంగు జనులారా ఇందండి.
గొంతుకలు :
1. జీవనఫలం జీవనఫలం
2 ఏమిటిది ? ఏమిటిది ?
8 కష్టపడకుండా సుఖించే మార్గమా
4 మృష్టాన్న భోజనానికి సమానమా
1. ఇష్టసిద్ధి కలిగించే విధానమా
2 పుష్టిగా తుష్టిగా బతికే నిష్టమా ?
విలాసిని : గత జలాలను మరలించగలదా ?
హతాశయులను లాలించగలదా ?
వినోదిని : ఎండిపోయిన ఎడారి పండించ
గలదా
గుండెలలో సంతృప్తి నిండించగలదా ?
యువ : ఇది సార్థక జీవనానికి సంకేతం
మానవత్వానికి సచేతనకేతనం
మంచితనానికి మెదడున్న నికేతనం
ఇది ధర్మార్థ కామమోక్షాల సంక్షిప్త
రూపం
నిజమైన జీవితంయొక్క పరమార్థం
1 వ గొ : ఎవడికి కావాలి వేదాంతం
అనుక్షణం కావాలి మాకు సుఖాంతం
2 వ గొ : మీ రిచ్చే జీవనఫలం
నన్ను పేకాటలో గెలిపిస్తుందా
నా దరిద్రం బట్టతలమీద
సిరులకురులు మొలిపిస్తుందా ?
8 వ గొ : మీ రిచ్చే జీవనఫలం
షేర్ మార్కెట్టు ఫలితాలను సూచించ
గలదా ?
ఇన్‌కమ్‌టాక్సు ఎగేసేందుకు
అపాయంలేని ఉపాయాలను యోచించ
గలదా !
పుత్రుడు : నాకు యస్. యస్. గా సినిమా
చూపించగలదా ?
నేను రాయని పరీక్షల్లో మార్కులు
వేయించగలదా ?
వృద్ధుడు : ఎగిరిపోయిన యౌవనాన్ని
విరిగిపోవని స్వప్నాన్ని
సాధించగలదా ప్రసాదించగలదా ?
విలాసిని : వింత వింత నగలు
నాజూకు నగలు
నాగరికత విలువలు
నాకు కావాలి
వినోదిని : బాధ్యతలులేని హక్కులు
చెల్లే బ్యాంకు చెక్కులు
నవయౌవనం మత్తు
నాకు కావాలి
వృద్ధుడు : ఆ జీవనఫలం ఏమిటో వివరించు

మా భుజాలమీద బరువులు తొలగించు
యువ: పాలకడలి, నగం, పన్నగం, కూర్మం
చిలకేగిన హాలాహలం
తలపోసిన వీతేశ్చ ద్రుమం
కలకాలం బ్రతుకిచ్చే ప్రసవం సవం
అన్నీ ఇందులోనే ఉన్నవి
జీవితం శాశ్వత మథనం
తుదలేని కథనం.
కాంతి: సమష్టి జీవన సౌఖ్యం
శ్రమైక జీవన సౌందర్యం
అందరికోసం ఒక్కడు
ఒక్కడికోసం అందరూ
పలుకరితో నారాయణ
పరుగు రాదుమాట
నియమాలకి లోబడడం
నీతికి కట్టుబడడం
కొంతసేపు శ్రమించడం
పిదప విశ్రమించడం
కలలు నిర్మించడం
కళలు సృష్టించడం
ఇదే సంపూర్ణ జీవనఫలం
అపుడు మానవులం దేవతలం.
విలాసిని: అదా జీవనఫలమంటే
ఏమో అనుకుంటిమే.
వినోదిని: అది చెర
విలాసిని: గానుగ మర
వృద్ధు: అది జర
కుర్రాడు: టోకరా
విలాసిని: "సాహసిక యాత్రలేని
పాయంత్రం
సహించదు నాకు"
వినోదిని: "కోరలు తీసిన రాత్రి
కోరిన ఆనందం ఇవ్వదు"
విలాసిని: "చీకటి దట్టంగా కమ్మి
భయాన్ని వర్షించని
రోజంటే కిట్టదు నాకు"
వినోదిని: నిరవధిక కాలంలో
కరువులేని సరదాలు కావాలి మాకు
యువ: దారితప్పిన తరుణులారా
జారిపడిన తమ్ములారా
మారకండి మానవత హద్దులు
మారకండి దానవులుగా మీరు
రండి ఈ జీవనఫలాన్ని రుచిచూడండి
చక్కని సమాజాన్ని చవిచూడండి.
గొంతు 1: అందులో తీపిలేదు
గొం 2: అది చేదు చేదు
గొం 3: అది బాగులేదు
విలాసిని: దానివల్ల ఆనందంరాదు
వినోదిని: ఉన్న విచారం పోబోదు
యువ: ఆదిలోనే నిరుత్సాహ పొందకు
కాంతి: రండి మీరందరూ ముమ్మొందుకు
యువ: ఒక చిటిదీపం వెలిగిస్తే చాలు
చీకటి పటాపంచలౌతుంది

కాంతి: ఒక్క భావబీజాన్ని నాటితేచాలు
సుందరతర సమాజం లేస్తుంది
యువ: పోసుకోలు కబుర్లలో పడి
ఈసురోమంటూ ఉండొద్దు మీరు
కాంతి: ఎవరో కష్టించి అమర్చిపెడితే
సుఖంగా తిందామని ఆశించకండి
పాటుపడక తినే సాపాటు
ఫలంపాటు కాదు
యువ: రండి ఆరగించండి
ఈ జీవనఫలాన్ని
విలాసిని: అది తిన్నా మింతకుముందు.
ఆచరించా మావిధానాలను మునుపు
వినోదిని: లేదు సుఖం లేదు రసం
చేదు విషం జీవఫలం
జీవఫలం చేదు విషం
చేదు విషం చేదువిషం
గొంతులు: ఔను నిజం ఔనుసుమా
ఔను నిజం నీవన్నది
నీవన్నది నీవన్నది
నీవన్నది నిజం నిజం
విలాసిని: వెనక్కి పోదాం పదండి
వినోదిని: వెనక్కి వెనక్కి

గొంతులు: పోదాం పదండి వెనక్కి
యువ: ఆగండి అభివృద్ధి మీకు తలదా!
విలాసిని: ఉన్నది చాలు.
యువ: నిలవండి దేశాన్ని సస్యశ్యామలం
చేయవద్దా!
వినోదిని: అది ఇంకొకరి పని
కాంతి: సాహిత్యసమీరాలు వీచేటట్టు
చేద్దాం
గొం 1: దండుగ
కాంతి: సౌహార్ద్రసుమాలు పూచేటట్టు
చూద్దాం
గొం 2: ఎందుకు
కాంతి: } అనుభవిద్దాం జీవనఫలాన్ని
యువ: }
అందరు: నిష్ఫలం నిష్ఫలం
యువ: అనురాగ పతాకాన్నెత్తి
ఆనందతటాకాన్ని తవ్వి
బానిసలను విముక్తిచేసి
యంత్రాను బానిసలగాచేద్దాం
వృద్ధు: బతికినన్నాళ్లు బతకనింక
ఈ లోపున సుఖించాలి నేను
కుర్రాడు: ఇంకా బతకాలిగా ఏదో ఏళ్లు

★ జీవనఫలం ★

ఎదిగాక చూసుకొందాంలే
విలాసిని : రండి వర్తించుదాం
యథేచ్ఛగా వర్తించుదాం
వినోదిని : పదండి సైతానుకు దండం పెడదాం
పాపపుష్పాలదండలు కడదాం
యువ : ఉండండి నిన్న కెంత నీచంగా
బలికారో తెలుసుకోనండి
గొం 1 : గతం గతః
కాంతి : రేపు ఏమౌతుందో ఆలోచించి
ఇప్పుడైనా మేలుకోనండి
గొం 2 : రానిరేపుగొడవ ఇప్పుడెందుకు ?
గొం 3 : ఆనందం దస్తావేజులు
కాలదోషంపట్టకుండా రాబట్టుకోవాలి
పోవాలి పోవాలి పోవాలి నేను
గొం 1 : చీకటివ్యాపారంలో వచ్చింది
ఎంతో ఎంతో నష్టం నాకు
అది పూడ్చుకోవాలి పోయి
గొం 2. కుటుంబ కలహంలో వచ్చింది
ఎంతో ఎంతో కష్టం నాకు
అది మరచిపోవాలి పోయి
యువ : ఆగండి ఆజ్ఞ ఇది
నిలవండి కదలకండి
నేను ప్రజని నేను ప్రభువుని
నిర్బంధంగానైనా మీ చేతపని చేయిస్తాను
అనుబంధాలని మీరు మరవకుండా
చూస్తాను
అందరూ పనిచేయాలి ఇది నాశాసనం
ఇకమీదట ఇకమీదట ఇకమీదట
పనిచేయక సుఖించడం పాతకం
కాంతి : అందరికోసం అందరూ పాటు
పడాలి
సుఖించడం కోసం ముందు కష్టపడాలి
యువ : వ్యసనం వ్యామోహం నిషేధం
చేస్తున్నాం
అజ్ఞానం బద్ధకం కూడదంటున్నాను
బదులు చెప్పకూడదు నా మాటకి
ఎదురు తిరగకూడదు నా ప్రభుత్వానికి

విలాసిని: నీయంత నియంత ఇంకోడు లేడు.
వినోదిని: ఏమంత బలవంత పెట్టాలి మమ్ము.
కాంతి: తప్పిజారిన తరుణులందరినీ
తిప్పి మంచిత్రోవలో పెడతాం ముందు.
విలాసిని: నీ తరంకాదు
వినోదిని: తరతరాలనుండీ తరం కాలేదు.
యువ: కట్టివేస్తాం కుమార్గులకు మిమ్మల్ని
బందీలను చేస్తాను భవనాలకి మిమ్మల్ని
పదితలలు ఇరవై చేతులు నాకు
కావడాలు ధరించుతాను
ఖరోడాలాగ సంచరించుతాను.
గొం 1: నా వ్యాపారానికి అడ్డురాకుండా
నాకు రావలసిన లాభాలు పోకుండా
నువ్వు ఎలాగ సంచరించితే నాకేం?
గొం 2: నా పాపిష్టి డబ్బు రాబడిలో
నీకు పావలా వాటా ఇస్తాను
నా జోలికి రాకు నువ్వు
నీజోలి పట్టు పడేస్తా లంచం.
యువ. పనికిరాదు పనికిరాదు
ఈ చక్కని లోకంలో
నీచత్వం పనికిరాదు
రాచరికం వహించిన లే
దోచుకోనడం సమసిపోవాలి
యథావిధి సమాజం కావాలనేవారు
విధిగా మారక తీరదు
నా ఆజ్ఞలు ఉలంఘన చేయరాదు
తప్పులపై మూకుడు మూతయూయరాదు.
వృద్ధు: వయాన పాలించడం మా కేవి
భయపెడితే నీమాట వినడెవడూ
చేసే పాపాలూ వేసే వేషాలూ
చూసీ చూడనట్టు ఊరుకో
నాలుగు గోడలమధ్య లేగే
పాపజ్వాలల నాపగలవా ఆర్పగలవా
ఆదినుండి సమాజం మేడిపండు
అవును అవునాను జీవనఫలం మేడిపండు
కరిమింగిన వెలగపండు కరిమింగిన వెలగ
పండు
నీమీద తిరగబడుతుంది నిరాశావాదుల
దండు
గొం 1: తిరగబడండి ఈ బూటకాలరాయడి
మీద
గొం 2: ఎదురుతిరగండి బూటకాలరాసేవాడి
పైన
విలాసిని: ఆనందానికి అడ్డొచ్చేవాడిమీద
వినోదిని: సరదాల సాగరాన్ని ఔపోసనపట్ట
జూచే
విలాసాల హంతకుడి పైన లేవండి.
గొం 3. కట్టిపడేసికిట కునల్ని బిగించి
వెట్టి చాకిరీ చేయించుకొంటున్నాడు.
గొం 2: అందరి మంచికే అని చెప్పి
ముందర తన లాభం చూసుకొంటాడు.
గొం 1: మంచిమాటల తేనెపూసిన

ప్రపంచ విఖ్యాతి పొందిన డచ్ చిత్రకారుడు విన్సెంట్ వాన్‌గో చిత్రాలు ఈనాడు లక్షలు ఖరీదు చేస్తాయి. అయితే వాన్‌గో స్వయంగా విక్రయించ గలిగినవి రెండే రెండు చిత్రాలు ఆ రెండిటికీ కలిపి ఆనాడు 21 పౌండ్లు లభించిందట. ★

వంచకుడి కత్తి వీడు
మన మెలా పోతే వీడికెందుకు
తిరగబడండి వీడిమీద.
విలాసిని: జవసత్వాలున్న వాళ్ళంతా
జవదాటాలి, వీడిమాట
వినోదిని: వెచ్చని నెత్తురున్న వాళ్లంతా
విచ్చలవిడిగా విజృంభించాలి.
గొం 1 శృంగాటకాల శకటాలు తగలెట్టండి.
గొం 2: కూల్త్రోయండి భవనాలు
నేలకూల్చండి శాసనాలు
గొం 3: కయ్యానికి కాలుదువ్వండి వీడి
ముందరి కాలుకి బంధాలు వెయ్యండి
చిందరవందర చెయ్యండి వీడు
కోలుకోనకుండా చీకాకుపర్చండి.
[భీభత్సం, కేకలు, తుపాకి పేల్పులు]
యువ: తుచ్ఛులు విచ్ఛిన్నకర శక్తులు
పెచ్చురేగి పోయారు
మంచి సంకల్పాల రాజ్యాన్ని కింపడ
దించి వేశారు ఆశయాల మొక్కని
తుంచివేశారు తుంచి వేశారు
మొక్కవోయింది చక్కని కల
ఎక్కడికి పోతుందో కథా ఈ యిల ?
మానవులలో మంచితనం ఏమయింది?
సజ్జనులంతా ఏమయ్యారు?
సత్పురుషులు పరుపకార్యాల నాపరేమి?
విలాసవతులు విజృంభించినప్పుడు
వీరనారీమణు లూరుకొన్నారేమి?
ఏరీ ఏరీ శిష్టజనులంతా ఏమయ్యారు?
దుష్టులు దుర్మార్గులు విద్రోహులు
సమార్గాన్ని ముళ్లమయం చేస్తూ ఉంటే
చూస్తూ ఊరుకొన్నారా మంచివాళ్లు?
మంచివాళ్లు ఎక్కడున్నారు కాంతీ,
ఎక్కడున్నారు వాళ్లు?
కాంతి : మన కెందుకని ఊరుకొన్నారు
వెనుకాడుతారు ముందుకొచ్చేందుకు
మంచివాళ్లు మంచిని ప్రతిఘటించరు
ప్రతిఘటించేవారిని కూడా
ప్రతిఘటించరు తాము
సంఘటితం కానప్పుడు

(55-వ పేజీ చూడండి)

సుందర జీవితం

ఉషశ్రీ

"శ్రుతి, స్మృతి, పురాణేతిహాససాగరు సాగరాన్ని మథించి సారభూతమయిన అమృతంగా అధ్యాత్మరామాయణాన్ని వ్యాసభగవానులవారు..." అని రామమూర్తిగారు వేణుగోపాలస్వామి ఆలయంలో తమ గంభీరోపన్యాసం ఆరంభించారు. శ్రద్ధగా విందామని కూర్చున్న ప్రకాశానికి అంతలో ఏదో జ్ఞాపకంవచ్చి లేవబోయి ఇంత జనంమధ్య కూర్చుని, ఉపన్యాసం మొదలెట్టుతుండగానే వెళ్ళిపోవటం మంచిది కాదనిపించింది. అందులోనూ ఆ రోజున ఆంజనేయస్వామివారు మహేంద్రగిరిమీదనుంచి ఎగిరి లంకా ప్రవేశ ప్రస్తావంచేస్తారు. ఆ ఘట్టం రామమూర్తిగారు చెప్తుండగానే వినాలన్నారు- అతనితో కొందరు. అంతవరకూ ఎలా నడిచినా ఆ ఘట్టంలో మాత్రం ఆయన ఆంజనేయోపాసకుడిలా కనిపిస్తాడని అంతక్రితం రెండు మూడుసార్లు విన్నవారు అనుకోగా ప్రకాశం విన్నాడు. అందుచేత ఏమయినాసరే కదలకూడదనుకున్నాడు. అందులోనూ కిష్కింధాకాండ ఆ సన్నివేశంతో ఆఖరై సుందరకాండ ప్రారంభమవుతుంది. అదేదో గమ్మత్తుగా 'దశచ్ఛిద్రంలో కనియోగించినట్లు' కిష్కింధాకాండ అంతంనుంచే రామాయణగాథ సుఖాంతమవుతుందనే విశ్వాసం కలుగుతుంది. జీవిత రామాయణంలోకూడా పూర్తిగా నిరాశపడి 'తావుల్ దప్పెను' అనే స్థితికి జారాకనే సుందరకాండ ప్రారంభిస్తుందని ప్రకాశం నమ్మకం. అలానే కూర్చున్నాడు.

* * * *

ఉదయ సంధ్యాకాంతులు హేమంత తుషారంలో చిక్కుపడి పోయాయి. విషాదతమో వృతమయిన తన భార్య వదనంలోని దివ్య ప్రసన్నతలా కనిపించింది ఉదయ శోభ ప్రకాశానికి.

కిటికీ ఎదురుగా పడక మంచంమీద కూర్చుని గోడకి నడుంచేర్చి ఆకాశాన్ని చూస్తున్నాడు. కిటికీకి తన దృష్టికి మధ్యగా ఉయ్యాలలో రెండేళ్ళ 'బాబి' చిరునవ్వుతో నిద్రపోతున్నాడు. ప్రక్కగా కొస్త దూరంలో వంటింటి గుమ్మందగ్గర కుంపటి అంటించి కాఫీకి నీళ్లుపడేసి విసరతోంది సుబ్బులు. ఒక్కసారి ఆమెవైపు తేరిపార చూశాడు ప్రకాశం. ఆమె తన పనిలో తాను నిమగ్నురాలయి ఉంది.

ఇదివరలో ఆమె విసురుతూంటే ఆ చేతులు బంగారపు గాజుల తళతళలతో గలగలలాడేవి. ఇప్పుడా చేతుల రబ్బరుగాజులు నీరసించిన ఆమె శరీరంలా వెలవెల బోతున్నవి. ఆమె వంచిన తలపైకెత్తి విసనకర్ర క్రిందపడేసి కళ్లు ఒత్తుతుంది పైటచెంగుతో. ఇదివరలో మనిషి కొస్త కదిలితే చంద్రహారాలతో కంఠాలతావళం చిక్కులు పడేది. మంగళ సూత్రాల తాడుతో పెనవేసుకుని జడలా అయేవి. ఇప్పుడా మెడలో చిక్కుచిక్కుమంటూ ఒక్క మంగళ సూత్రం, దానినీడలా నల్లపూసలపేరు...ఒకటేమిటి ఆమె కాపురానికొచ్చేనాటికి ఏడువారాల నగలతో మహారాణి వచ్చినట్లుగా అనిపించింది. వచ్చిన మూడు, నాలుగేళ్ల వరకూ ప్రకాశం రాజులాగ సుబ్బులు రాణీలా బ్రతికారు. అంతలో వచ్చింది మహాప్రమాదం... ఆ ఏడాదే ప్రకాశం తండ్రి పోయాడు. ఆయన పోయేవరకూ ఆ సంసారం దివ్యంగా సాగిపోయింది. ముగ్గురు కూతుళ్ళకూ దమ్మిడీ కట్నం ఇవ్వకుండా, ఆత్రేయ, శాక్తేయాది కాలు మానిః పెళ్ళిళ్ళుచేసి, ఆ అయిదు రోజులూ జరిగిన భోజన భాజనాదికాల కోసం సుమారు పాతిక, ముప్ఫైయేకరాల మెట్ట క్రయంచేసిన దాన పురుషుడాయన. అంతగా గాకపోయినా ఆయన కొడుకు ననిపించుకున్నాడీయన. ఆస్తులమ్ముకుని అప్పులు వండుకు తినటం, ఇళ్ళమ్ముకుని ఇడ్లెన్లు తినటం ప్రకాశం జ్ఞానం వచ్చిన దగ్గరనుంచీ ఎరిగిన విషయం. ప్రకాశానికి మైనారిటీ వెడుతుండగానే మిగిలిన ఆ ఒక్క ఇల్లు అమ్మకానికి రిజిస్ట్రారు ఆఫీసుకు వెళ్ళినప్పుడాయనడిగాడు—'ఏమయ్యా, ఈ యిల్లు మీ నాన్నగారు అమ్మటం నీ కిష్టమేనా?' అని.

'ఆయన మా నాన్నగారు, అంతే' అని సంతకంచేసేశాడు. ఇది చూసినవాళ్ళంతా తెల్లబోయారు.

ఆ రకంగా ఆస్తి అయిపోయినా తండ్రి హయాంలో కొన్నయిల్లు, ఆయన ఉండగా సాగినభోగం - ఎలా జరిగిందని ఒక్కనాడూ ఆలోచించలేదు ప్రకాశం. ఆయన పోయిన మూడో నెలలో ఇల్లుజప్తుకొచ్చింది. ఏమిటని అడిగాడు. 'నాన్నగారు చేసిన అప్పు' అన్నాడో పెద్దమనిషి.

'అంతేనా! దానికి వేలం ఎందుకూ? ఎవరికి తణఖా ఉందో వారు వచ్చి ఇల్లుస్వాధీనం చేసుకోండి' అని సాయంత్రానికి ఖాళీ చేసి యిచ్చేశాడు. గ్రామంలోని శాస్త్రులు చాలా ప్రలోభాలు కనపరిచారు తణఖా పత్రంమీద నీ సంతకం లేదనీ, అదనీ, ఇదనీ...వినలేదు ప్రకాశం. నాన్నగారు చేశారంటే ఎవరికోసం చేశారు. మాకోసం. అందుచేత ఆయన ఆత్మ క్షోభించటం నా కిష్టంలేదు. అంతే! ఆ మరునాడే ఊరు వదిలేశాడు. అక్కణ్నుంచి ఆరంభమైంది జాతకంలో శని.

శ్రీధర వెంకయ్యగారుకూడా చెప్పారు, అప్పాయిది పూర్వఖండ రోగజాతకం కాదనీ, ఉత్తరఖండం బ్రహ్మాండంగా వెలుగుతుందనీనూ. వేళాకోళంగా వదిలేశాడు దాన్ని. పైగా ఇరవై అయిదోయేడు ప్రారంభిస్తుండగా ఉన్నకొంప వదులుకోవటం యోగమా? బి. ఏ. డిగ్రీ చేతిలో ఉండీ ఉద్యోగం లేకపోవటం యోగమా?

★ సుందర జీవితం ★

నమ్మలేదు నవ్వి ఊరుకున్నాడు. తనజాతకంలో ఉన్న మహారాజయోగమో, విపరీత రాజయోగమో అది ఒకటేకట: అనుకూలవతి అయిన అర్ధాంగి దొరకటం. ఆనందాన్నీ ఆపదల్నీ ఒకే స్మితశ్రీతో ఆహ్వానించగలిగిన కళత్రం దొరకటం కంటె మహారాజయోగం లేదన్నాడు, ప్రకాశం తన జ్యోతిశ్శాస్త్రంలో.

యథాశక్తిగా ఉద్యోగంకోసం ప్రయత్నించాడు - కాదు - చేశాడుకూడా. మరి స్వేచ్ఛాజీవితానికి అలవాటుపడ్డ ప్రాణి తలవంచలేక చేరిన ఉద్యోగాన్ని వదిలేశాడు. అయితే కళత్రంతోపాటు మిత్రక్షేత్రం కూడా బావున్నట్టుంది కొంతలో కొంత మెరుగ్గా కొన్నాళ్ళు నడిచింది. కాని ఎన్నాళ్ళని నడుస్తుందీ—నడవకనే భార్య అలంకారాలన్నీ బజారుకెక్కాయి.

'కడుపునిండా తిండివుంటే కైసేతలు కాని, అది లేనప్పుడు ఈ అలంకారాలు శరీరానికి బరువే' అని వొలిచి అతని చేతుల్లో పోసింది.

ఒకటి రెండుసార్లు సుబ్బుల్ని రాళ్ళమ్మ అడిగింది, 'మెడ యింత బోసిగా ఉందేమే' అని

'ఓ గొలుసు చిక్కుపడి తెగిపోతే అతకటానికి పంపించానని..... ప్రక్క వీధివారి పద్మావతిని పెళ్ళిమాపుల కలంకరిస్తూ తీసుకెళ్ళారనీ' సర్దిచెప్పేసింది. సుబ్బులు అలా చెప్తూంటే ప్రక్కగదిలో ఉండి వింటూన్న ప్రకాశానికి విచిత్రమయిన నవ్వు వచ్చేది పెదవులమీదికి. ఆ నవ్వు వెనకనే హృదయములో ఒక గులాబీముల్లు కసుక్కున గ్రుచ్చుకొనేది.

జీవితచరిత్రను నెమరు వేసుకుంటూన్న ప్రకాశంముఖంమీద ఏదో తళుక్కున మెరిసి, కన్నులు జిగేల్ మనిపించింది. తూర్పుసముద్రం ప్రసవించిన రక్తపుగుడ్డు సూర్యుడు తూర్పుకొండమీదికి ఆడుకోనేందుకు యెక్కాడు. ఆ బాలుడి అరుణకాంతులు కిటికీలోంచి దూసుకు వచ్చి ఉయ్యాలలో నిద్రపోయే 'బాబి'గాడి పెదవుల్ని ముద్దుపెట్టుకుని, వాడి మొలమీది మామిడిపిందెల మొలత్రాడు మీద పడి ప్రకాశం ముఖంలోకి నవ్వుతూ చూశాయి ఒక్కసారిగా కన్నులు మూసి రెండు కన్నీటిచుక్కలు రాల్చాడు.

ఆరోజు సాయంకాలంలోగా అద్దె చెల్లించకపోతే ఇల్లు ఖాళీచెయ్యమని హుకుం చేసి వెళ్ళాడు యజమాని ఔను! ఒకనెల ఊరుకుంటారు, రెండునెల లూరుకుంటారు గాని మరింక ఊరుకోగలరా, ఎంత ఇనపపెట్టెలు కలవారయినా? పైగా సుఖంగా ఉందామని కట్టుకున్న డాబాలు ప్రకాశం లాంటివారికోసం వదిలేసి, పక్క దొడ్లలో తాటాకుగుడిసెలు వేసుకుజీవించే ధనవంతులు సకాలంలో అద్దెడబ్బులు రాకపోతే... వారు తమవంటివారికోసం ఎంత త్యాగం చేస్తున్నారు? అని నవ్వుకున్నాడు.

సరిగ్గా అదేరోజు సాయంత్రానికి తన రెండోబావమరది పెళ్ళాంపిల్లలతో దత్తతల్లి తద్దినం పెట్టుకునేందుకు వస్తున్నానని టెలిగ్రాం యిచ్చాడు. నీరుతిరిగిన ప్రకాశం కన్నులు పొడారిపోయాయి. ఈ ఆలోచనలో ప్రక్క నిలబడి కాఫీ అందిచ్చే భార్యవైపు చూడలేదు. అతనిదృష్టి బాబిగాడి మొలమీద జిలుగుకాంతులీనుతున్న మామిడిపిందెలలో ఇరుక్కుపోయింది. ప్రక్కవాటాలోంచి రేడియోలో లతామంగేష్కర్ ఆలాపనాలహరి ఆకస్మికంగా అతనిచెవుల్లో పడింది. ఆ సమయంలో అతనికి ఆ అమృతలహరిని ఆస్వాదించాలనే కుతూహలానికి బదులు ఒక చిరునవ్వుమాత్రమే ముఖంమీద నాట్యంచేసింది ఆ సావకాశంలో!

"ఏం...ఊహాలోవున్న కథలో అమ్మాయెవరేనా పెళ్ళిబాధ తప్పించటానికి లేచిపోతోందా ఏమిటి?" అంటూ కప్పు చేతికందిచ్చింది, సుబ్బులు.

"లక్ష్మీ...కథలో అమ్మాయి కాదు... జీవితంలోని అబ్బాయే శ్రీమతినీ ... చిరంజీవినీ విడిచి.. " అని ఇంకా చెప్పబోతుండగానే, సుబ్బులు ముక్కుమీదకు తర్జనీ నడిపించి: "తప్పు...తప్పు.. అలా విడిచి వెళ్ళిన బుద్ధుడు స్థాపించినమతం ఈ దేశానికే పనికిరాకుండాపోయింది! అని నవ్వింది

"నవ్వు కాదు!...ఇదిగో మీతమ్ముడు దత్తతల్లి తద్దినం పెట్టుకోనేందుకు వస్తున్నానని టెలిగ్రాంఇచ్చాడు. సరే యింటిఅద్దె'

అని నీరసంగా దృష్టి ఉయ్యాలవైపు మరలించి కాఫీ త్రాగ సాగాడు.

సుబ్బలక్ష్మి కన్నుల్లో తిరిగిన నీరు ధర్తకు కనిపించటం ఇష్టంలేక వెనుతిరిగి వంటింట్లోకి నడిచింది.

ఔను! బాబిగాడికి వాళ్ళ తాతయ్య పుట్టినరోజు కానుకగా పంపారు పంపినాయన ఆగలేక ఆ రోజు మధ్యాహ్నానికే వచ్చి మనవడి మొలకు తగిలించి, ఒళ్ళో కూర్చోబెట్టుకుని, ఇంటికొచ్చిన వారందరితోనూ...

'చూశారా! అసలు పనివాడితనమే పోయింది. పోయిందంటే పోదు మరీ. నకిలీసరుకులమీదికి మనబుద్ధి పోతూంటే...అయినా అసలు ఏ వస్తువు ఎక్కడుంటే శోభిస్తుందో అది అక్కడే ఉండాలి. ఈ మామిడి పిందెల మొలత్రాడు వీడి మొలను ఎంతగా శోభిస్తున్నదో చూడండి. అసలు ఈ రకమయిన పిందెలు తయారు చేయటంలో మా ఊరు సాంబమూర్తి ఉన్నాడే-అతనొక్కడే సమర్థుడు. ఇప్పటికతనికి ఎనభైనిండినా సులోచనాలు లేకుండా ఈ శిల్పం ఎలా నడిపించాడో చూడండి' అని మురిసిపోయాడు.

ఈ ఊహతో ప్రకాశం మనస్సు మలమల లాడింది.

కాని......

కాఫీ పూర్తిచేసి కప్పు కింద ఉంచాడు.

ఇంతసేపేడ్చి, ముఖం తుడుచుకుని దగ్గరగా వచ్చి నిలబడింది.

'పాపం! మీ నాన్నకేం తెలుసునే— యాభై యకరాల ఆస్తికీ, రెండంతస్తుల మేడకూ దత్తుడయిన తన కొడుకు దత్తతల్లి తద్దినానికి మన యింటికి వచ్చేటప్పటికి అందుకోసం ఈ మామిడి పిందెల మొలత్రాడు...'

అని ఒకే ఒక్కసారి ఆమె కన్నుల్లోకి చూసి తలవాల్చేశాడు.

సుబ్బులు గంభీరమౌనంతో అడుగులు కదలించి ఉయ్యాల సమీపించింది నిశ్శబ్దంగా నిద్రపోతూన్న 'బాబి' చెయ్యి మొలత్రాడుమీద పడింది.

సుబ్బులు కన్నీటిచుక్కలు 'బాబి' మీద పడి ఉలిక్కిపడ్డాడు. నెమ్మదిగా వాడి చెయ్యి తప్పించి, మొలబోసిచేసింది.

సుబ్బులు చేతులోంచి అందుకుంటూన్న మామిడిపిందెల మొలత్రాడుమీద ఇద్దరి కన్నీటి చుక్కలూ ఒకేసారి పడ్డాయి.

అదే రోజు సాయంత్రం టపాలో కాలేజీలో ఉద్యోగం వచ్చినట్టు ఉత్తరం అందుకున్నాడు ప్రకాశం. ★

వనితాలోకం

మేడమ్ మేయరు

ఇల్లిందల సరస్వతీదేవి

గడచిన నెలలో, ఒకనాడు బొంబాయి పురపాలక సంఘ సమావేశములో, ఒక స్త్రీమూర్తిమీద పూలహారాలు పుష్పగుచ్ఛాలు అనేకముగా వర్షింపబడ్డాయి. ఆమెను సమీపించలేని మహిళలు, దూరమునుంచే, పూలదండలను విసరివేశారు. అక్కడ సమావేశమయినవారందరూ ఆమె నభినందించి తమ ఆనందోత్సాహాలను ప్రకటించారు. జయజయధ్వానాలతో చావడి మారుమ్రోగిపోయింది.

88 సంవత్సరాల పురపాలకసంఘ చరిత్రలో, అనూహ్యమైన ఒకానొక సంఘటనతో నూతనాధ్యాయము ప్రారంభమయినది. మేయరు పదవికి ఒక మహిళ ఏకగ్రీవముగా ఎన్నుకొనబడింది. ఆసంభ్రమములో కార్యకర్తలకు ఒక నూతనసమస్య వచ్చిపడ్డది- 'ఆమెను ఏమని సంబోధించాలి!'

'మేయరెస్' అందామా అని ఒకసూచన వచ్చింది. అలా అనడములో 'మేయరు భార్య' అనే అర్థము స్ఫురిస్తుందన్న సందేహము వెంటనే కొందరికి కలిగింది. ఎలాగయితేనేమి-కొంత తర్జనభర్జన జరిగిన తరువాత 'మేడమ్ మేయరు' అని ఆమెను సంబోధించటానికి నిశ్చయించారు.

మేడమ్ మేయరు సులోచనా మోడి సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ "ఈ పదవికి నన్ను ఏకగ్రీవముగా ఎన్నుకోవటములో పురపాలక సంఘము నారీలోకాన్నంతనూ గౌరవించినట్లుగా భావిస్తున్నాను. నేను ఈ పదవికి ఎన్నుకొనబడిన ప్రథమ స్త్రీని. దీనికి కారణభూతులైనవారి కందరికి నా కృతజ్ఞతల నర్పించుతున్నాను. కాని- ఈ పదవికి చివరిదానను కాకూడదని కోరుతున్నాను" అన్నారు.


ఆమె పురపాలక సంఘ సభ్యురాలైనప్పటినుండీ సభ్యురాండ్ర సంఖ్య, సగానికి సగము ఉండవసినట్లుగా ఉండక పోయినా, కనీసము నాలుగవంతు అయినా ఉండాలి' అని అంటూ ఉండేవారు. పురపరిపాలనలో పురుషులకంటె స్త్రీలు సామర్థ్యముతో నిర్వహించగలరని ఆమె దృఢ నమ్మకము.

గ్రామములోగాని పట్టణములోగాని ప్రజల సుఖజీవనానికి తగిన వసతులను ఏర్పరచి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించటము పురపాలక సంఘ బాధ్యత.

ప్రతి గ్రామములో మంచి నీటిబావులు గాని, పంపులుగాని ఏర్పరచి ప్రజలకు నీటి వసతి కల్పించటము అన్నిటిలో ప్రధానమైనది. ప్రతి వీథికి, పరిమితమైన సంఖ్యలో పంపులను ఏర్పాటు చేయటమూ, ఇండ్లలో పెట్టించుకొనదలచినవారికి వసతులను కల్పించటమూ, సంఘ బాధ్యత.

వీథులలో దీపాలు పెట్టటమూ, విద్యుచ్ఛక్తి సౌకర్యముగల గ్రామాలలో ప్రజలకు దానిని అందుబాటుగా చెయ్యటమూ పురపాలక సంఘ బాధ్యత.

వీథులు, బహిరంగ ప్రదేశాలు, కూరగాయల మార్కెట్టు మొదలయిన స్థలాలలో మురుగునత్తలేకుండా గ్రామ పారిశుద్ధ్యము కాపాడవలసి ఉంటుంది. వీటిని ఏ దినము



★ మేడమ్ మేయరు ★

కాదినము శుభ్రము చేయింపవలసి ఉంటుంది.

పురములో ఏమూలనయినా అగ్నిప్రమాదముగాని నీటి ప్రమాదముగాని సంభవించినట్లయిన తగిన సహాయము చేసి ప్రజలను రక్షించవలసిన బాధ్యత సంఘానిది.

వర్తకులు సరకుల నమ్ముటలో ప్రజలను మోసము చేయకుండా కాపాడవలసి ఉంటుంది. కొలతలలో, తూనికలలో, లెక్కలలో హెచ్చుతగ్గులు చేసి, ప్రజలను మోసపుచ్చటానికి ప్రయత్నించే వర్తకులను కనిపెట్టి తగినట్లు శిక్షించవలసిన బాధ్యత ఆ సంఘానిది.

శిథిలమయిన, ప్రమాదకరమైన భవనాలలోను, ఇండ్లలోను ప్రజలు నివసించి, ప్రమాదాలకు లోనుకాకుండ కాపాడటం, ప్రజలు నివసించకుండా వాటిని నిషేధించటము సంఘ నియమావళిలో ఒక సూత్రము.

బహిరంగ ప్రదేశాలలోను వీథులలోను ప్రజల రాకపోకలకు భంగము కలిగించే వాటిని తొలగించవలసిన బాధ్యతకూడా దానిదే.

గ్రామములో లేనిచోట్ల రోడ్లను వేయటము ఉన్న వాటిని బాగుచేయటము, మార్గాలను అనుకూలముగా మార్చటము, గ్రామ పరిహద్దులను నిర్ణయించటము దాని బాధ్యత.

విక్రయశాలలో చెడిపోయిన వస్తువులను అమ్మినందువల్ల ప్రజలకు ఆరోగ్య భంగము కలుగుతుంది మురుగుదొడ్లను, మురుగు కాలవలను, చాకలిరేవులను, మంచినీటి బావులను చెరువులను ఎప్పటికప్పుడు శుభ్రపరచి మురుగువాసన రాకుండా శ్రద్ధ తీసుకొనవలసి వుంటుంది.

పరిపాలనాసౌకర్యముకొరకు వీథులకు ఇండ్లకు గుర్తులేర్పరచి, నంబర్లు వెయ్యటము, జననమరణాలను రికార్డు చేయటము, ప్రజారోగ్యము కాపాడటానికి ఆయా ఋతువులలో బయలుదేరే అంటువ్యాధులను అరికట్టటానికి తగిన జాగ్రత్త వహించటము సంఘ కార్యక్రమములో చేరినవి. అంటువ్యాధులను అరికట్టటానికి కనిపెట్టబడిన మశూచి, కలరా, బి. సి. జి. టీకాలను ప్రచారము చేసి ఉపయోగములోకి తీసుకొనిరావలసి ఉంటుంది.

గ్రామములో ప్రాథమిక పాఠశాలలు. వయోజన పాఠశాలలు నెలకొల్పి నడపటము, బిడ్డల క్రీడలకు, పోటీలకు, వ్యాయామానికి, తగిన వసతులను కల్పించటము పురపాలక సంఘ బాధ్యత. పశుపాలన వాటికనుగుణ్యమైన వసతులను కల్పించటము కూడా సంఘ బాధ్యతే

పురపాలక సంఘము తన బాధ్యతలను నెరవేర్చటానికి ప్రతిగ్రామములోను వైద్యాలయాలు, ప్రసూతి వైద్యశాలలు, శిశురక్షణ కేంద్రాలు, ఔషధాలయాలు నిర్మించి ప్రజారోగ్యము కాపాడటములో తన అధికారాలను ఉపయోగించుకొనవచ్చు. క్రొత్తవీథులు, క్రొత్తభవనాలు నిర్మించవచ్చు వాటికి తగిన స్థలాలను సేకరించవచ్చు ప్రజాహితకార్యాలకు పూనుకున్న వ్యక్తులకు, సంస్థలకు సహకరించవచ్చు.

పురోద్యానవనాలు, క్రీడలకూ వ్యాయామానికీ తగినవసతులు, పురపాలకసంఘాల ద్వారా కల్పింపబడుతూ వుంటాయి. గ్రంథాలయాలు, పఠనాలయాలు, మ్యూజియములు, ధర్మశాలలు, యాత్రికుల వసతిగృహాలు ఈసంఘముచేత వ్యవస్థీకరింపబడి నడుపబడుతూ ఉంటాయి విద్యావిజ్ఞానాలకు సాధనమయిన రేడియోను బహిరంగస్థలములలో నెలకొల్పి ప్రజలలో విజ్ఞాన ప్రచారము కావించటము కూడా దీనిలో చేరినదే.

బాటలకిరువైపులా వృక్షాలను పెంచటము సహకారసంస్థలను నెలకొల్పి ప్రజల దారిద్ర్యాన్ని పారద్రోలటము, కుటీరపరిశ్రమలను పునరుద్ధరించటము, పశుసంపదను అభివృద్ధిచేయటము, సంఘ కార్యక్రమములో చేరినవి. పిచ్చికుక్కలను నాశనము చేయటము, పిచ్చికుక్క కరచినవారికి చికిత్స చేయించటము, ఉన్మాదులను ఉన్మాదుల వైద్యాలయాలలో చేర్పించటము మొదలయిన కార్యములను బాధ్యతతో నిర్వహించవలసిఉంటుంది. సంఘశ్రేయస్కరమైన కార్యములన్నీ, పురపాలక సంఘ కార్యక్రమములో చేర్చబడినవి. క్రొత్తవి అనేకముగా చేర్చబడుతున్నాయి.

ఈ పైకార్యక్రమము స్త్రీలచేత విజయవంతముగా నిర్వహింపబడుతుందనటములో ఎంతమాత్రము సందేహము లేదు. పురపరిపాలనలో స్త్రీలకు సంబంధించిన కార్యక్రమమే అధికభాగము ఉన్నది. స్త్రీలచేత నిర్వహింపబడితేనేగాని ఆ కార్యక్రమము విజయవంతము కాదు. ఈ దృష్టితో అన్ని ప్రాంతాలలోని పురపాలక సంఘాలలోను ఎన్నికలు జరగాలి. అప్పుడుగాని ప్రస్తుతము కనబడుతున్న లోపాలు సర్దుబాటు కావు.

మేడమ్ మేయరు సులోచనా మోడికి ఈ పదవి మార్చి ఆఖరువరకే ఉంటుంది. ఆ పైన తిరిగి ఎన్నికలు జరుగుతాయి. పురపరిపాలనకై తన శక్తిసామర్థ్యాలను వినియోగించటానికి తగినంత అవకాశము ఆమెకు తిరిగి లభించినట్లయిన, మేయరుస్థాన మలంకరించిన ప్రథమ మహిళ తన పరిపాలనా దక్షతను నిరూపించి చూపగలదు. ★

అతనికంటె ఘనుడు!

పూర్వం ఒకప్పుడు రాముడు భీముడూ అనే దొంగ లిద్దరు ఒక చెరువుగట్టున కలిసికొన్నారు. వాళ్ళిద్దరూ చెరొక ఊర్లోనూ నివసిస్తున్నారు. రాముడు ఒక మట్టి పాత్ర చేత పుచ్చుకుని వున్నాడు. భీముడు ఒక అన్నపుకెరడు పట్టుకుని వున్నాడు. అది ఉదయం పది గంటల సమయం.

"నేనీ బియ్యాన్ని ఇప్పుడు వండుకోవాలి. నాకు వంటకూడా సరిగ్గా చేతకాదు. అసలే ఆకలిగా వుంది... ఎవరూ అన్నమేనా పెట్టేరు కారు..." అంటూ రాముడు విసుగ్గా మూలుగుతూ వస్తున్నాడు భీముని వైపు.

"నాకు ముష్టి ఎవ్వరూ బియ్యమేనా వేశారుకాదు ఈ చద్దిఅన్నం నాకసలు పడదు. బియ్యమయితే వండుకుతిందును..." అనుకుంటూ రాముని వైపు నడిచేడు

ఒకరిమాటలు ఒకరికి వినిపించేలాగే అనుకున్నారు. వాళ్ళిద్దరికీ ఆలోచనలు తట్టేయి.

"ఇదిగో ఏమోయ్ ... నీ పేరేమిటి?" అని అడిగాడు రాముడు.

"నా పేరు భీముడు ... మరయితే నీపేరేమిటి ?"

"రాముడు ... నువ్వేం చేస్తాంటావు?" ఆశగా చూస్తూ అడిగేడు.

"ముష్టెత్తుకుంటూంటాను...మరి నువ్వో ?"

"నాపనీ అదే ... వెధవది ఈ బియ్యం వండుకోవడం ఎలాగో తెలియట్లే లేదు. ఎవరూ అన్నం పెట్టేరుకాదు..." భీముని వైపు చూస్తూ నసుక్కున్నాడు రాముడు.

"నా కెవళ్లూ ఒక్క బియ్యపు గింజ పెట్టేరుకారు. ఒక్కమ్మ ఈ చద్దన్నం కూడు పడేసింది. నాకసలే అజీర్ణం ... పడదు ... ఎలాగా అని చూస్తున్నాను..." అన్నాడు భీముడు రాముని బియ్యంకేసి చూస్తూ.

"అయితే ఓపని చేద్దామా?" అన్నాడు రాముడు.

"ఏమిటది...?"

"మధుశ్రీ"

"నీకు చద్దిఅన్నం పడదుకనక... నేను అన్నం వండుకోలేను కనక మనిద్దరం ఒకరివి ఒకరికి మార్చుకుంటే...?" అన్నాడు.

"అవును. అదే నేనూ అనుకుంటున్నాను." అంటూ ఒకరివి ఒకరు పుచ్చుకున్నారు. ఒకరి మాయ ఒకళ్ళకి తెలియదు. నా మాయలో అంటే నామాయలో అనుకుంటూ ఇద్దరూ చెరోవైపుకీ గబగబా వెళ్లిపోయేరు మార్చుకున్న వాట్లతో.

చెరో చెట్టుచాటుకీ వెళ్ళి చూసుకుని ఆశ్చర్యపోయేరు! చూసుకుంటే ఏముంది? రాముడు తన మట్టిపాత్రలో నిండా ఇసుకపోసి దానిమీద ఇసుక కనబడకుండా బియ్యపుగింజలు పేర్చేడు! భీముడు నల్లరేగడిమన్ను అన్నపుకరడు ఆకారంగా చేసి దానిమీద మట్టి కనబడకుండా అన్నపు మెతుకులు అంటించాడు. ఈ మాదిరిగా రాముడూ, భీముడూ వొకర్ని వొకరు దగా చేసుకున్నారు!

ఇద్దరూ తక్షణం వెనుదిరిగి ఒక చెట్టుక్రింద కలుసుకున్నారు. "ఇదేం పనిరా రాముడూ" అంటే "ఇదేం పనిరా భీముడూ" అనుకున్నారు. ఒకరి తెలివికి ఒకరు మెచ్చుకుని "భాయీ...భాయీ" అని చేతులు కలుపుకున్నారు. అప్పటినుండీ వారిద్దరు తోడుదొంగలు.

"ఇంత తెలివైనవాళ్లం మన ఇద్దరం కలిస్తే ఇంక ఏమన్నా వుందా? ...ఎంత డబ్బైనా దోచుకోవచ్చు" అన్నాడు రాముడు.

"అవున్నా రాముడూ...నడు... మనిద్దరం "బిజినెస్" పెడదాం..." అంటూ ఇద్దరూ కలిసి బయలుదేరేరు. అడవులూ, కొండలూ దాటి దాటి చివరకొక అడవిదగ్గిర ఒక పేదరాసి పెద్దమ్మని కలుసుకున్నారు.

ఆమెకు ఎనభయ్ ఏళ్లుంటాయి. కదురులాటి మనిషి. ఎన్నో డక్కాముక్కీలు తీరింది. వీళ్ళను అంత దూరాన్నుంచే చూసి—

"రండి నాయనా రండి ... ఈ ముసిలి ముండమీద మీ కే నా

★ అతని కంటె ఘనుడు! ★

దయుంది ... సా కెవ్వరూలేరు ... చస్తే గుక్కెడునీళ్లు పొయ్యడానికే లేదు!..." అంటూ కన్నీరు మున్నీరుగా విలపించింది.

రాముడూ భీముడూ ఆమె మాటలకు ఉహూఁ ... బాధ పడిపోయేరు...ఎంతో జాలి నటించేరు. ఒకళ్ల మొఖంకేసి ఒకళ్లు చూశారు. దీనిదగ్గిర చాలా డబ్బు వుండి వుంటుంది. ఎలాగయినా చెక్కెయ్యాలని అనుకున్నారు. ఎంతో జాలీ దయా నటిస్తూ

"అయ్యో అదేమిటి బామ్మా... మేం వున్నాంగా ... నీ కేలోటూ రాదు. రానివ్వం. బాధపడకు" అని ఊరడించేరు. ఆమె కన్నీరు తుడుచుకుంటూ—"మా నాయనే...! ఎంత మాటన్నార్రా ...!! ఇక్కడ తినండి ... హాయిగా మసలండి... మీ కిద్దరికీ చెరో పనీ చెబుతాను. ఆ పనులు చేసుకోవడం హాయిమంటూ పడుండడం ... ఇదే మీ పని...అన్నట్లు అదిగో ఆ భోషాణం దాన్నిండా డబ్బు వుంది. నా అనంతరం అది మీదే..." అని చెప్పి "మీ పేర్లేమిటి?" అడిగింది పెద్దమ్మ.

"నా పేరు రాముడూ... వీడిపేరు భీముడూ..." అని విన్నవించుకున్నారు.

"రాముడూ ... అదిగో నువ్వు ఆవుని మేపు ... భీముడూ నువ్వు ఆ వంగతోటలోకి నీరుతోడు ... ఇదంతా మీకేన్రా..." అంది పెద్దమ్మ సాగదీసుకుంటూ.

రాముడు భీముడూ ఓస్ ఇంతేనా పని అనుకుని మురిసిపోయేరు. కీలు దొరికినప్పుడు ఆ భోషాణం కొట్టెయ్యాలని చూస్తున్నారు.

ఆ ఆవు సంగతేమిటీ అది "అ" అంటే ఆరు ఆమడలదూరం పరుగెడుతుంది. ఈ దురోమంటూ రాముడుకూడా పరుగెట్టి దాన్ని మేపుకుని వచ్చేసరికి సాయంత్రం అయ్యేది. వంగతోటలా వుందీ? దిబ్బమీద ఎత్తుగా వుంది. పల్లంలో నుయ్యివుంది. ఎన్నినీళ్లుతోడిపోసినా అన్నీ మళ్ళీ నూతులోకే వస్తున్నాయి. పాపం స్నేహితు లిద్దరూ ఎప్పుడో వచ్చే సంపదకోసం నానా యాతనా పడుతున్నారు. మళ్ళీ అక్కడ స్వార్థం ఒకరిపని ఒకరికి మార్చుకుందామని బుద్ధిపుట్టింది. ఒకనాడు రాముడన్నాడు భీమునితో-

"ఒరే భీముడూ నీ పని ఎలా వుందిరా...?"

"ఆఁ...ఏముందిరా మాంచి సులువుగా వుందిలే...!...కాని నీ పనెలా వుందిరా?"

ఆఁ...పెద్ద నాకేంవుందిరా ఆవునొకసారి విప్పడం కులాసాగా కూర్చోవడం...మేతమేసి అది మళ్ళీ నా దగ్గిర కొచ్చి నిలబడుతుంది" అన్నాడు గొప్పగా.

"అయితే భీముడూ...కొన్నాళ్ల పాటు మనిద్దరం పనులు మార్చుకుందామేమిట్రా?" రాముడడిగేడు. మార్చుకున్నారు అనుకోవడమే తడవుగా. ఒకళ్ల పనిలో బరువులు ఒకళ్లకి తెలిసాయి! ఒక నాడు కూర్చుని ఈ పెంకిముండని ఎలాగయినా మాయచేసి డబ్బంతా కొట్టుకుపోవాలని ప్లాన్ వేసుకున్నారు. పెద్దమ్మ వీళ్ళ ప్లాన్ కనిపెట్టింది.

రాముడతా భీముడూ ఆ రాత్రి నిద్రపోలేదు. పెద్దమ్మ హోరాత్రి వేళ లేచి "ఎందుకేనా మంచిది... దొంగలుంటున్నారట" అనుకుంటూ భోషాణం పట్టుకెళ్ళి దభీమని నూతులో పారేసింది. రాముడూ, భీముడూ బలే అనుకుంటే బలే అనుకున్నారు. పెద్ద ఇంట్లోకి పోయి హాయిగా పడుక్కుంది.

మిత్రులిద్దరూ లేచేరు. కడుబ నూతులో దిగేడు. దిగి పెట్టె తెరచి చూసేడు. దానినిండా రాళ్లున్నాయి. రాముడు లోపలికి దిగేడు. ఒక్కొక్క రాయే తీసి నూతులో పారేసి తను అందులో కూర్చుని, ఆ భోషాణానికి త్రాడుకట్టి లాగేయ్‌రా అన్నాడు. భీముడు భోషాణం పైకి తీసి నెత్తిన పెట్టుకుని పరుగుపెట్టడం మొదలుపెట్టేడు. ఒక అడవిలోంచి వెళ్తూండగా..."ఆగు ఆగు" అని వినిపించింది భీముడికి. ఇంకా గబగబా పరుగెట్టడం మొదలుపెట్టేడు భీముడు రాముడు వస్తున్నాడని.

"ఆగు ఆగు" అని మళ్లీ వినిపించింది. ఇదేమిట్రా దగ్గరనుండి వినిపిస్తూందని భీముడు భోషాణం క్రిందికి దింపి ఆయాసంతీర్చుకుని వెను దిరిగి చూశాడు. ఎక్కడా ఎవడూ కనబడలేదు. ధైర్యంగా పెట్టె తెరచాడు. చూస్తే లోపలనుండి రాముడివతలకు వచ్చేడు

"హారి! నువ్వట్రా? రాముడూ ...!" అని ప్రశ్నించేడు.

"అవున్రా" అంటూ బట్టలు దులుపుకుని ఇవతలకు వచ్చేడు.

"మరి డబ్బేదిరా?"

"ఆ ముండ వెర్రిదనుకున్నావా? మనకంటె గట్టిది. అందులో అన్నీ

గులకరాళ్లే!...రాళ్లని చెబితే నువ్వు నన్ను నూతిలో వదిలేసి పోతావని నేలంనులో కూర్చుని వచ్చేను.

"మళ్లీ ఇద్దరూ బయలుదేరి ఒక ఊరు చేరుకున్నారు. ఆ దేశపు రాజు ఒక ఆరునెలల క్రితం చచ్చి పోయేడని ఆ ఊళ్లో చెప్పుకుంటూ వుండగా స్నేహితులిద్దరూ విన్నారు. యువరాజు పాలిస్తున్నాట్ట.

రాముడూ భీముడూ ఒక ప్లాన్ వేసుకున్నారు.

ఇద్దరూ రాజధాని చేరేరు. ఆ వూళ్లో స్మశాన వాటికలో ఒక గొయ్యి తీసి రాముణ్ణి అందులో కూర్చోమని పైన కర్రలూ అవీ పడేసి అవి కనబడకుండా మట్టితో పూడిచేడు భీముడు. నేలలాగేవుంది. వెంటనే భీముడు రత్నాల వర్తకుడి వేషం వేసుకుని కోటగుమ్మం దగ్గిర కూర్చొని "మొర్రో" మని ఏడవటం మొదలుపెట్టేడు. ఎందరో వచ్చి అడిగేరు "ఎందు కేడుస్తున్నావ"ని. ఏమీ సమాధానం చెప్పకుండా ఏడవడం సాగించేడు. మంత్రి వచ్చి ఈ ఏడుపు చూసి ఎన్నో అడిగి ఇక లాభం లేక యువరాజుతో చెప్పి తీసుకు వచ్చేడు "కోట గుమ్మంలో కూర్చొని" అన్యాయం అంటూ ఎవరో వర్తకు డేడుస్తున్నాడని.

యువరాజు వచ్చి "ఏమిటి అన్యాయం? ఎందుకేడుస్తావు?" అనడిగేడు.

"నేను రత్నాల వర్తకుణ్ణండి... బాబయ్యా ... నాకు మీ. నాన్నగారికీ మంచిస్నేహం అండి నలభయ్ వేలరూపాయలు విలువ చేసే రత్నాలు మీ నాన్నగారి కిచ్చి డబ్బు మీదగ్గిరే అట్టేపెట్టమని వర్తకానికి దేశాంతరం పోయానండి. తీరా వచ్చేటప్పటికి ఆయన పోయారని తెలిసిందండి ... ఇంక నాడబ్బు రాదని చెప్పి ఏడుస్తూ కూర్చున్నానండి. అంటూ వలవల ఏడవడం మొదలు పెట్టేడు.

"అయితే డబ్బివ్వాలన్నట్లు నమ్మకం ఏమిటి?" యువరాజడిగేడు.

"ఏదోమాట నమ్మకం మీద పోయేదండి మా వర్తకం...ఏ ఆధారాలూ లేవండి.. ఇంక దేముడే దయండి..." అంటూ గట్టిగా ఏడిచేడు. మళ్లీ ఇలా అన్నాడు. "నిజంగా నాకు ఇయ్యాలంటే ఆయనను దహనం చేసినచోట పిలిచి అడగండి ఊ అంటే ఇయ్యండి. లేకపోతే వద్దు." అన్నాడు.

సరేనంటూ యువరాజూ భీముడూ మిలిగిన అనుచరులూ స్మశాన వాటికకు వెళ్లేరు. "పిలవండి. అడగండి" అన్నాడు ఒక చోట నిలబడి భీముడు

"నాన్నా మనం ఈ వర్తకుడికి నలభయ్ వేలరూపాయలియ్యాలా?" అని అడిగాడు గాలిలోకి చూస్తూ యువరాజు.

"ఊ...ఇవ్వాలి నాయనా...!" అంది ఒకగొంతు. అది భూమిలో కూర్చున్న రాముడే అన్నాడు. యువరాజూ పరివారం ఆశ్చర్యపోయేరు. వర్తకుణ్ణి ఇంటికి తీసుకు వెళ్లి అణా పైసలతో లెక్కచూసి ఇచ్చాడు యువరాజు.

ఈ డబ్బుమూట పట్టుకుని భీముడు రాముణ్ణి లేపకుండా ఒక కాలువగట్టు పట్టుకుని పరుగెట్టి పరుగెట్టి ఆయాసంవచ్చి ఒక చెట్టు క్రింద పడుకున్నాడు డబ్బు మూట మొలబంటినీటిలో దాచి కొని. ఎప్పటికీ భీముడు రాకపోవడం వల్ల రాముడికి అనుమానం వేసింది. గభీమని ఇవతలకి వచ్చి ఊళ్లో పరుగెట్టి ఊళ్లోవాళ్ల నడిగేడు "భీముడనేవాడు మూట నెత్తినపెట్టుకుని ఎలా వెళ్లేడు" అని. కాలువగట్టునే పోయేడుఅని చెప్పేరు. రాముడు కాలువగట్టునే పోయి పోయి చెట్టుక్రింద పడుకుని నిద్రిస్తున్న తనమిత్రుణ్ణి చూసి ఎగిరి గంతేశాడు. వొళ్లంతా తడిమేడు. ఎక్కడా డబ్బుమూట కనబడలేదు. పాదాలదగ్గరనుండీ నాకటం మొదలుపెట్టేడు. మొలవరకూ తియ్యగానూ అక్కడనుండీ ఉప్పగానూ వుంది. అంచాత మొలబంటినీళ్లలో దాచేడని ఆ కాలువలో మొలలోతునదిగి వెతికేడు. అక్కడే వుంది డబ్బుమూట!

ఆ మూట తీసుకుని బయలుదేరి దారిలో రెండు ఎద్లు కనబడితే ఒకదానిమీదఎక్కి వెళ్లిపోయేడు ఒక గడ్డిమేటి కనబడింది. అక్కడ ఆ ఎద్దుని వదిలి గడ్డిమేటిలో దూరాడు రాముడు!

భీముడికి మెలుకువ వచ్చి చూడబోయేటప్పటికి డబ్బుమూట కనబడలేదు. అడుగులజాడ చూసుకొంటూపోయేడు కొంత దూరం పోయేటప్పటికి అక్కడ ఒక్కటే ఎద్దు కనబడింది భీముడికి. అయితే రెండోఎద్దు ఏమయినట్లు? అనుకొని ఆ యెద్దుమీద తనెక్కి బయలుదేరేడు. ఆ గడ్డిమేటిదగ్గర కొచ్చేటప్పటికి అక్కడ ఒకే ఎద్దు కనబడింది. ఇక్కడే ఉండి ఉంటాడనుకొని ఎద్దుమీదినుంచి దిగి

సంకల్ప వికల్పాలు

రాణి }
వాణి } అక్కచెల్లెండ్రు

సరళ: వారి స్నేహితురాలు

తులసమ్మ: వారి మేనత్త.

(స్థలం: సుందర రామయ్యగారి మేడలో రాణి గది)

తుల: మళ్ళీ మళ్ళీ నీకు చెప్పాల్సిన అవసరం లేదు రాణీ! శుక్రవారం సాయంత్రం ఆరింటికల్లా నువ్వూ, వాణి మా యింటిదగ్గర హాజరు కావాలి.

రా: అదికాదత్తయ్యా...

తుల: కాదు గీదంటే ఒప్పుకునేమనిషే నా రాణీ మీ తులసమ్మత్తయ్య! ఒకవేళ నేనూరుకున్నా మీ మామగారూరుకోరు.

రా: మామయ్య సాధారణంగా దేనికీ ఒప్పుకోడులే అత్తయ్యా! కానీ నువ్వూ అలాగే పట్టుబట్టి కూచుంటే ఎలాగ? మా పిన్ని కూతురు తెలుసుగా నీకు, విమల, అది శుక్రవారం వస్తానని జాబు వ్రాసింది. వస్తే సినిమా కెళ్ళాలంటుందో ఏమిటో!

తుల: మరేం ఫరవాలేదులే రాణీ! విమల వస్తే దాన్ని మా యింటికి తీసుకురా. చూచి చాల రోజులయింది (లేస్తూ) మరి నే నిక వెళ్తాను రాణీ! ఈ పాటికి మీ మామయ్య ఆఫీసునుంచీ వచ్చి వుంటారు.

రా: సరే అత్తయ్యా!

తుల: మరి శుక్రవారం సాయంత్రం?

రా: రాక తప్పుతుందా అత్తయ్యా!

తుల: అదీ మంచివాళ్ళలక్షణం. వెళ్తున్నాను రాణీ! వాణి ఎక్కడుందో కనపడ్డం లేదు. తప్పకుండా రమ్మన్నానని చెప్పు. (నిష్క్రమిస్తుంది)

రా: (లోపలికి చూస్తూ) అమ్మా! అమ్మా!

వా: (తలుపుచాటునించీ వస్తూ) అమ్మ తోట్లోకి వెళ్ళింది.

రా: మనల్ని అత్తయ్య విందుకు రమ్మంది.

వా: విన్నాను, విన్నాను. అక్కయ్యా! అత్తయ్యగారి విందు కొక నమస్కారం. నాకు వేరే పనుంది.

రా: అదేమిటే! ఆవిడ నిన్ను తీసుకురమ్మని మరీమరీ చెప్పి వెళ్ళింది.

వా: అవునమ్మా అక్కా! అంతా విన్నాను.

రా: మరి రానంటున్నావే!

వా: ఎలా వస్తాను! నాన్నగారు శుక్రవారం సాయంత్రం ఫస్టుషోకి రెండు టికెట్లు తెచ్చియిచ్చారు. మళ్ళీ శనివారం చూడాలంటే చూడలేం అక్కయ్యా! శుక్రవారంతో ఆఖరు.

రా: ఐనా యిప్పుడేం చేయాలబ్బా!

వా: చేయడానికేముంది! విందుకు రావడానికి వీల్లేదని అత్తయ్యకొక కబురు పంపించు. హాయిగా యిద్దరమూ వెళ్ళి సినిమా చూచొద్దాం.

రా: వద్దు వాణీ! బాగుండదు. అత్తయ్య కోప్పడుతుంది.

వా: అత్తయ్య కోప్పడుతుందని సినిమా ప్రోగ్రాం వదలుకుంటావూ! బాగుంది. వెనుకటి కెవరో నీలాంటి అమ్మాయి ఇలాగే సిరివత్తే పొమ్మంటే కాలడ్డిందట!

రా: సినిమా పోతే పోయిందిలే వాణీ! మనం విందుకే వెళ్దాం.

సరళ: (ప్రవేశిస్తూ) ఏమిటే రాణీ! పెద్ద తైలమాలో పడ్డట్టున్నారు

అతనికంటె ఘనుడు

అక్కడ వెతికేడు. ఎక్కడా కనబడలేదు. గడ్డిమేటిలో వుంటాడని ఎద్దు మెడలో గంటవిప్పి తన మెడలో కట్టుకుని గడ్డిమేటి చుట్టూ తిరిగేడు. "ఏమిటి ఇలా తిరుగుతూంద"ని భీముడు బుర్ర ఇవతలకి పెట్టి చూశాడు. గబుక్కున వాణ్ణి పట్టుకుని ఇవతలకు లాగేడు భీముడు.

"హారినీ..." అంటే హారినీ అనుకుని ఆడబ్బు ఇద్దరూ సమంగా పంచుకుని హాయిగా వున్నారు. అతనికంటె అతను ఘనుడు!! ★

[ఒకానొక సంస్కృత కథ ఆధారంగా]

మధురాంతకం రాజారాం



రమేశ్ ఇంటికి
వెళ్లుటకు భయపడ్డాడు...
నా బట్టలను మాపుకొన్నాను రామ్. మా అమ్మ నన్నిప్పుడు తిట్టుతుంది
రమేశ్ నేను కూడాతరచుగా బట్టలను మాపుకొంటుంటాను గాని మా అమ్మ నన్నెప్పుడూ తిట్టదు, రావోయ్.
రామ్ ఇంటివద్ద:
ఎందుకతనేడుస్తున్నాడు?
అతడింటికి వెళ్లుటకు భయపడుచున్నాడు, ఎందుకంటే అతడు తన బట్టలను మాపుకొన్నాడు
రమేశ్ ఇంటివద్ద:
మళ్లీ మురికిగా ఇంటికొచ్చావు! నిన్నింక యెప్పుడూ ఆటకు బైటకు వెళ్లనీయను!
ఈ బాలుని తిట్టకమ్మా - పిల్లలందరూ ఆడునప్పుడు మురికిగా నగుదురు.
ప్రతిరోజూ వాడి బట్టలను ఉతుకుటకు చెమట వోడుస్తున్నాను వాటిని బాదుతూ అందుకవి చాలాత్వరగా చిరిగి పోతున్నవి.
అది నిజమే. బాదుట బట్టల పోగులను తెంచును మరి అందువల్లనే బట్టలు,త్వరగా చిరిగి పోవును.
బాదబడినబట్ట పెద్దదిగా చూపబడినది
కాని మీరు సన్‌లైట్ సబ్బుతో ఉతికినప్పుడు బట్టలను బాదనక్కర్లేదు దాని సమృద్ధయిన నురగమురికి నంతటిని సులభంగాతొలగించును, ఆవిధంగా మీ బట్టలు చాలాకాలము మన్నును కూడ.
అది నిజం' త్వరగా నురగను గలిగించు సన్‌లైట్ సబ్బు బట్టలను బాదకుండానే సరిగ్గా తెల్లగాను మరియు కాంతివంతముగాను ఉతుకును అంటే - బట్టలు చాలాకాలము మన్నును మరియు నాకు డబ్బు మిగులును.
SUNLIGHT SOAP
సన్‌లైట్ సబ్బు
భారతదేశంలో తయారుచేయబడినది
బట్టలు చాలకాలము మన్నునట్లు చేయును

బొమ్మల పెళ్లి

'శ్రీ హరి'

రండమ్మ రండమ్మ రారండి! రండి!
బొమ్మలకు పెళ్ళిళ్ళు చేదాము రండి!

చెల్లాయి తెచ్చింది మల్లెపూదండ
శశిరేఖ తురిమింది తలలోన పూలు
శాంత కట్టిం దదిగో బంతిపూదండ
సీత తొడిగిందండి చెంగావి రవిక
జలజ తీసుకువచ్చె జడగంట గుత్తి
నిలువెల్ల వెల్గుతో నిండిపోయింది.

రండమ్మ రండమ్మ రారండి! రండి!
బొమ్మలకు పెళ్ళిళ్ళు చేదాము! రండి!

ముస్తాబు చేశాము పెళ్ళికూతురికి
పీటపై నున్నాడు వరుడు చూడండి
ఊదరా తమ్ముడూ! ఊదరా బూరా!
సీతమ్మ బాజాలు వాయించవమ్మ!
తమ్మకం డెవ్వరూ పుణ్యముంటుంది!
అక్షతలు జల్లండి అమ్మలక్కల్లార!
కట్టవే కాంతక్క తాళి మెడలోన
జరిగిపోయిందమ్మ బొమ్మలకు పెళ్ళి
ముత్యాల పల్లకిలో కూర్చుండబెట్టి
ఊరేగి రండమ్మ ఊరెల్ల మీరు.

రండమ్మ రండమ్మ రారండి! రండి!
బొమ్మలకు పెళ్లిళ్లు చేదాము రండి!

★ సంకల్ప వికల్పాలు ★

రా: పడకేంచేస్తాం. నాన్నగారు సినిమాకని టిక్కెట్లు తెచ్చి యిచ్చారు. అత్తయ్య అదేరోజున...

వా: అదేసమయానికి నాన్నకూడా చెప్పి విందు కాహ్వానించింది.

రా: మరి, అత్తయ్య మాట నిరాకరిస్తే ఆవిడ ఊరికే విడిచి పెట్టదు.

వా: కనిపించిన ప్రతిమనిషితోనూ, ఈకాలపు పిల్లలు బొత్తిగా పెద్దవాళ్లని ఖాతరు చెయ్యడం లేదని, చదివీ చదివీ వాళ్లు చెడిపోతున్నారని ఉపన్యాసవర్షం కురిపించేస్తుంది.

రా: ఐతే వాణీ! నువ్వా దోవకీ వస్తున్నానన్న మాట! 'మన సినిమా ప్రోగ్రాం కాన్సిలయిన ట్టేకదూ!

వా: మరేం చేయనే అక్కయ్యా! తులసమ్మత్త నోటికి భయపడని వారు ఈ ప్రపంచంలో ఎవరున్నారు గనుక!

సరళ: ఐతే టిక్కెట్లనోసారి యిలా పారేయండి నేనూ, మా అమ్మ మీ పేరు చెప్పుకుని సినిమా చూచొస్తాం.

వా: ఐనా నీకింత దురాశ తగదే సరళా! 'దురాశ దుఃఖమునకు చేటు' అని వినలా!

రా: ఇందులో దురాశ ఏముంది? మనం ఎలాగూ సినిమాకి వెళ్ళడం లేదు. మరి టిక్కెట్లనేం చేసుకుంటాం? నువ్వు తీసుకెళ్లు సరళా!

వా: మరి సినిమాకి వెళ్లొచ్చి మాకు కథ చెప్పాలి సరళా! మేము నీకు అత్తయ్యగారింట్లో విందులతాలూకు పిండివంటల్ని గురించి చెబుతాంలే మరి!

* * *

(శుక్రవారంసాయంత్రం మూడు గంటలకు అదేచోట)

వా: (లోపలికి వస్తూ) ఇంకా తల దువ్వుకోడమే పూర్తిగాకపోతే ఎలాగే అక్కయ్యా! అమ్మా నాన్నగారికోసం టిఫిన్ చేసిపెట్టి వెళ్ళమంటోంది. వంటలక్క ఈరోజు సెలవు తీసుకుందట.

రా: అయిపోయిందిలే నువ్వు వెళ్లి పొయ్యి రాజెయ్! ఐదునిమిషాల్లో వస్తాను...అరరే, సరళ వస్తోందే!

వా: సినిమాకి వెళ్లే ఆడంబరమేమో, ఎప్పుడూ లేంది సాటిన్

సిల్కు ధరించేశారు అమ్మాయి గారు! రా అమ్మా సరళా! అప్పుడే సినిమాకి తయారైపోయావన్న మాట!

సర: దరిద్రుడి తలగడగను పోతే ఏం కురుస్తుందో తెలియదా వాణీ!

వా: ఎందుకు తెలియదు! వడగండ్ల వాన కురుస్తుంది.

సర: అలాగే అయింది నాపని. మా అమ్మ ససేమిరా సినిమాకి వెళ్ళడానికి ఒప్పుకోలేదు. అక్కడెక్కడో గుడిలో రామాయణ కాలక్షేపమట! అదీ ఈ రాత్రితో ఆఖరు. కడపటికి యిద్దరమూ అక్కడికి వెళ్ళడానికి నిర్ణయం జరిగింది.

రా: మరి టిక్కెట్లు?

సర: ఆవిషయమే చెబుదామని వచ్చాను. టిక్కెట్లు మా నాన్నగారు తీసుకున్నారు.

రా: పోనీలే, ఆయనైనా చూచి రానీ!

సర: తొందర పడుతున్నావు రాణీ! మా నాన్నగారికీ సినిమాలకీ జన్మవిరోధం. ఆయనగారు టికెట్లను భద్రంగా ఆయన ప్రాణస్నేహితులు రామచంద్రంగారికి అప్పజెప్పారు.

రా: ఏమిటీ!

వా: సరళ నాన్నగారు టికెట్లను మన రామచంద్రం మామగారికి యిచ్చేశారన్న మాట!

రా: ఇంట్లో విందు పెట్టుకుని ఆయన సినిమా కెలా వెళ్తాడు వాణీ?

వా: అదే నాకూ తెలియడం లేదు.

(ఫోను మ్రోగుతుంది)

రా: బహుశా తులసమ్మత్తే అయివుండాలి...(ఫోనుదగ్గరికి వెళ్ళి రిసీవర్ తీసుకుంటూ) హల్లో ... ఎవరు?... రామచంద్రంమామయ్యే! ఏం మామయ్యా ? ... అత్తయ్య ఒంట్లో బాగుండడం లేదూ!.. ఈరోజు విందు లేదన్నమాట ! సరే... అలాగే!

వా: కథ అడ్డం తిరిగింది. అక్కయ్యా! తులసమ్మత్తంటే ఏమనుకున్నావ్ మరి! అఖండురాలు. నేను గుండెపైన చేయి వేసుకుని బల్లగుద్ది చెబుతాను. తులసమ్మత్త నిక్షేపంలా వుంటుంది. ఇదంతా వాళ్లు సినిమాకి వెళ్ళడానికి చేసుకున్న ఏర్పాటు.

సర: అంతే అయివుంటుంది.

రా: అయివుంటుం దేమిటి! చదువుకోలేదుగానీ లేకుంటే తులసమ్మత్త రాజ్యాలేలుతూ వుండవలసిన మనిషి.

వా: వాళ్లు మనల్ని బుట్టలో వేసి సినిమా చూచిరావాలనుకుంటున్నారక్కయ్యా!

రా: అదెలా కుదురుతుందో నేనూ చూస్తాను.

వా: ఏంచేస్తావు?

రా: మరేంలేదు. (ఫోనుదగ్గరికి వెళ్ళి రిసీవర్ చేతికి తీసుకుని) ఒక చిన్న చిట్కా ... వన్ సిక్సు ఫోర్ నాట్ ప్లీస్ ... హలో తులసమ్మత్తా! నేనే రాణిని! ఒంట్లో ఎలా వుందత్తయ్యా? అయ్యయ్యో! నీ వజ్రకాయానికి ఈ కష్టం రావలిసిందికాదత్తయ్యా!...మరేంపరవా లేదు లే... నేనూ, వాణి పస్తుపో చూచి రావాలనుకుంటున్నాం ... ఫ్రీ ప్యాసులు దొరికాయి...ఏమిటీ...అలాగా ... (రిసీవర్ క్రిందపడవేసి) హతోస్మి, హతోస్మి.

వా: ఏమైందక్కయ్యా!

రా: మనం పొరబడ్డామే వాణీ!

వా: ఎందుకూ?

రా: ఎందు కేమిటి? తులసమ్మత్తకు నిజంగానే ఒంట్లో బాగున్నట్టులేదు. టికెట్లు మనకిచ్చి పంపాలనుకుందట. ఇంతలో నేను మనం అదేసినిమాకి వెళ్తున్నట్టు చెప్పానా, ఆవిడ "అయితే మీరు వెళ్ళండి. టికెట్లు నేను మా పొరుగింటి కమలమ్మగారికిచ్చి సినిమా చూచి రమ్మంటాను" అంది.


వా: ఓ మైగాడ్! కథ బెడిసి కొట్టింది.

సర: రాణీ అండ్ వాణీ!మీరూ, నేనూ మా అమ్మ, మీ తులసమ్మత్త, రామచంద్రం మామయ్య అందరమూ మూకవుమ్మడిగా దురదృష్టవంతులం. అదృష్టమంటే ఆ కమలమ్మగారిది.

వా: పోనీలే సరళా! మేమిద్దరం కూడా నీ పేరు చెప్పుకొని ఆ రామాయణసత్కాలక్షేపానికి హాజరౌతాం.

(తెర)

★



12. జరిగిందేమిటి?

జాన్ మిడిల్టన్ చక్రవర్తి కాలంలో నేరస్థుల పరిశోధనా, విచారణా, శిక్షణా బలే చిత్రంగా ఉండేవి. మిడిల్టన్ మహాశయుడు ఆ నాడు దొంగలందరికీ తుపానులాంటివాడు. ఎంత కన్నుగప్పి ఎంత నేర్పరితనంగా దొంగతనాలు చేసినా చిటికలో పట్టి బంధించేవాడు. ఇందుకు ఆయనముందు ఎంత చిన్న అబద్ధమయినా నిముషాలమీద పట్టుబడిపోయేది. ఉదాహరణకి చిన్న సంగతి చెబుతాను. ఓసారి నాలుగు దేశాలూ తిరిగివచ్చిన ఆయన అంతరంగిక కార్యదర్శి ఆయనతో చెబుతున్నాడు.

'మీరు చెబితే నమ్మరు చక్రవర్తీ, నేను ఆఫ్రికా అరణ్యాలలో ఉన్నప్పుడు ఓసారి ఎంత చిత్రం జరిగిందనుకున్నారూ?'

'ఏమిటదీ?'

'నేను పరాకుగా ఉండగా నామీద ఓ ఖడ్గమృగం పడ్డదనుకోండి!'

చక్రవర్తి తప్ప అందరూ ఆత్రుతగా వింటున్నారు.

'అయితే ఆతరవాత ఏం జరిగిందీ?' అని అడుగుతూ మనసులో అనుకున్నాడు విదేశాంగమంత్రి ఎడ్మండ్ హెర్రింగ్టన్. కాని చక్రవర్తి మొహం చూడగానే ఆయన ఉత్సాహం చచ్చిపోయింది.

'అదేమిటి ప్రభూ! ఆయనమీద ఖడ్గమృగం పడితే మామీద చిన్న చీమ పడినట్టయినా లేదేం?'

'ఆయన మాట నిజం కాదు గనక'. ఈ జవాబుకి అందరూ స్తంభించిపోయారు. కార్యదర్శి మొహం పూర్తిగా మాడిపోయింది.

'నిజం కాదని మీకెలా తెలిసింది? ఖడ్గమృగం మైబడితే బ్రతకడనా?'

'ఎందుకు బ్రతకడూ? ఎందరు బ్రతకలేదు?'

'మరి?'

'మరీ లేదు సరీ లేదు. నే చెప్పింది కాదనగలదేమో కార్యదర్శి నడుగుదాం. ఏమంటారు మహాశయా?'

అంతరంగిక కార్యదర్శి వెలవెల బోతూ అతి నెమ్మదిగా అన్నాడు. 'నా అబద్ధం బయటపెట్టి నాకు సిగ్గు తెప్పించారు. నా సంగతి అసత్యమని మీ కెలా తెలిసింది?'

ఆఫ్రికాలో ఆ ప్రాంతాలలో ఖడ్గమృగాలు లేవు. చక్రవర్తికి ఇంత బాగా జాగ్రఫీ తెలుసునని కార్యదర్శికి తెలీదు. ఆ విషయం అతని నోటమ్మట విని అందరూ ఆశ్చర్యపోయారు.

అవసరాల రామకృష్ణరావు

మిడిల్టన్ చక్రవర్తి విషయ పరిజ్ఞానం యింత విపులంగా ఉండేది.

ఒకప్పుడు టోకియో నగరంలో ఓ చిత్రమైన దురంతం జరిగింది. ఒకనాడు చక్రవర్తి కొలువు తీర్చి ఉండగా ఒకడు పరిగెత్తుకు వచ్చి మిడిల్టన్ పాదాలమీద పడ్డాడు. భోరున ఏడుస్తూ మొరపెట్టుకున్నాడు.

'ఇలాంటి ఘోరాలు జరుగుతూండగా యిక మే మీ నగరంలో ఎలా బతకగలం మహాప్రభూ! ఇవాళ మా బావమరది ఘోరంగా హత్య చేయబడ్డాడు.'

సేవకులు అతన్ని కేకలేసి ఊరుకోపెట్టారు.

'అసలేం జరిగిందో వివరంగా చెప్పు' అన్నాడు మిడిల్టన్ చక్రవర్తి.

'నేనీ నగరానికి వ్యాపార నిమిత్తం రెండు రోజులై వచ్చాను మహాప్రభూ! మా బావమరిదికీ నాకూ యీ ఊళ్ళోని తోళ్ళ వ్యాపారంలో సమాన వాటాలున్నాయి. మా బావకీ నాకూ మధ్య మా అక్కయ్యగాని పిల్లలుగాని ఎవ్వరూ లేరు. ఏం చెప్పను,

వీనాడో అంతరించిపోయారు. అంచేత మా యిద్దరిలో ఎవరు పోయినా వ్యాపారం మిగిలిన ఒక్కడికే పూర్తిగా చెందుతుంది. అందుకని మా బావమరదిని నేనే చంపేశానని లోకులు నన్ను నిందిస్తున్నారు ప్రభూ! అసలే సహచరుడు చచ్చిపోయాడని దుఃఖం, పైగా ఈ నింద......'

'ఇవన్నీ ఎవరడిగేరు? హత్యా వివరాలు చెప్పు' అన్నాడు మంత్రి నికోడమస్.

'ఈ హత్య నిన్న రాత్రి జరిగింది. నేను నాటకానికెడుతూ మా బావను రమ్మంటే తలనొప్పిగా ఉందని రాలేదు. హంతకుడు చింత చెట్టుమీదంచి పిట్టగోడమీదకు దిగి కిటికీలోంచి దూరి హత్యచేసి తిరిగి ఆ మార్గాన్నే పోయిఉండాలి.'

'ఈ సంగతి మీ కెలా తెలిసింది?'

'నేను రాత్రి $1\frac{1}{2}$ కి వస్తూంటే చింతచెట్టుమీదంచి ఎవరో సన్నని వ్యక్తి దూకి పారిపోతూండడం చూశాను. కటికిచీకటీ, పైగా వానచూ, మనిషి సంచారం లేదు. ఎలా వెంబడించను? గబగబా యింట్లోకిపరిగెత్తి మేడమీదకువచ్చి చూశాను. కుర్చీలో బావ కూలబడిఉన్నాడు, గుండెల్లో కత్తి!'

మిడిల్టన్ చక్రవర్తి స్వయంగా కొందరు ముఖ్య పరివారంతో హత్యాప్రదేశానికి వెళ్ళేడు.

అది రెండంతస్థుల భవనం. 'పాంగ్ ఫూ' చెప్పినట్లే పక్కని పెద్ద చింతచెట్టూ దాని కొమ్మల మీదంచి పిట్టగోడమీదకు దిగడానికి వీలుగానే ఉంది. అక్కడ్నుంచి మిడిల్టన్ క్రిందికి చూశాడు. చింత చెట్టు బాగా ఎత్తుగా ఉంది, క్రింది కొమ్మలు రోడ్డుమీదికి వస్తే కొస్తే కారట, లేవు. హంతకుడు దూరి వచ్చివుంటాడని 'పాంగ్ ఫూ' చెప్పిన కిటికీ చిన్నదిగా గుండ్రంగా ఉంది. ఊచలు లేవు. కర్రది. సన్నంగా ఉన్న మనిషి మాత్రం అందులోంచి దూరి రావచ్చు. ఆ కిటికీకి అతి అందంగా కొత్తగా వార్నిష్ రంగు వేయబడిఉంది.

'రంగు చాలా బాగుందే, మన వైపు యిటువంటివి దొరకవు. ఉన్నా యింత శ్రద్ధగా చక్కగా రంగు వెయ్యరు – ఎక్కడ తెప్పించారో...' అన్నాడు చక్రవర్తి.

'నేనే వస్తూ 'నానగసాకి' నుంచి తెచ్చేను. నిన్న మేమిద్దరం కూర్చుని సరదాగా వేశాం – ఏం లాభం, మా బావ అదృష్టం నా అదృష్టం యిలా ఉంది'

'ఒక్కసారి ఆ రంగు డబ్బా చూపెడతారా?'

'పాంగ్ ఫూ' తెచ్చి చూపించాడు. దానిమీద లేబిల్లో ఆ రంగు రెండు రోజులదాకా ఆరదని రాసిఉంది. మిడిల్టన్ దాన్ని చూసి యిచ్చేశాడు.

హతుడిదగ్గిరకు చక్రవర్తి దారి తీశాడు.

ఎవరో ఎదుటినుంచే పొడిచారు. గుండెల్లో కత్తి దిగిఉంది. చచ్చిపోయిన వ్యక్తి చాలా బలమైన వాడు. బావమరదు లిద్దరూ బలాబలాలలో ఒకర్నిమించి ఒకరున్నారు.

'పదండి పోదాం అంతా తెలిసిపోయింది' అన్నాడు మిడిల్టన్.

'నా మాటేం చెప్పేరు? నాకు జరిగే న్యాయం యింతేనా?'

'ఇలారా చెబుతాను.'

మిడిల్టన్ చక్రవర్తి 'పాంగ్ ఫూ'ని దగ్గిరగా పిలిచి కుడిచేత్తో అతన్ని గట్టిగా పట్టుకుని చెవిలో ఏదో చెప్పేడు.

'పాంగ్ ఫూ' మొహం వెలవెలపోయింది.

మిడిల్టన్ 'పాంగ్ ఫూ' చెవిలో చెప్పిం దేమిటి?

అలా చెప్పడానికి అతనికున్న ఆధారా లేమిటి??

★

గతవారం సమస్యకు జవాబు

ఇది సైన్సుకి సంబంధించిన చిన్న తమాషా. విచిత్ర స్వభావం గల రసాయనిక పదార్థా లెన్నో ఉన్నాయి. వాటి విలువలూ, శక్తులూ దైనందికం చెయ్యడంలోనే ఉంది శాస్త్రజ్ఞుని ప్రతిభ. మా మామయ్య వేసిన ప్లానూ అలాంటిదే. అమ్మోనియం క్లోరైడ్ (నవాసారం) కాపర్ సల్ఫేట్ (మైలతుత్తము) సమాన నిష్పత్తిలో కలిపి ద్రావణంచేసి, నీలంగా ఉంటుంది గనక, పెన్ లో పోసి ఇంక్ లా రాయవచ్చు. ఆ అక్షరాలు రాసిన కొంత సేపటికి మాయం అయిపోతాయి. మళ్ళీ నిప్పు సెగని పెడితే నల్లగా అక్షరాలు వచ్చేస్తాయి. మా మామయ్య తన పెన్ చేత, ముందుగా మేజిక్ యింక్ పోయించుకుని ఉంచుకుని నా చేత రాయించాడు. మా మామయ్యకి కావల్సిన కెమికల్స మా లేబరేటరీలో దొరికేయి. రాత్రి వేళా, లాంతరుదగ్గిరా కాబట్టి నేను పోల్చుకోలేకపోయాను. ఇది మాయా కాదు, మంత్రము కాదు. మా మామయ్య చేసిన మేజిక్ సిరా ప్రభావం!

★

★ రాజ్యాంతే నరకం ధ్రువం! ★

(11-వ పేజీ తరువాయి)

పట్లయింది 'ఇదంతా ఎవరికోసం? తనకోసమే గదా!' అనుకున్నాడు శంకరవర్మ. పిమ్మట ఒక్క పెద్ద నిట్టూర్పు విడిచి గోపాలవర్మతో ఇలాగన్నాడు:

"ఈ రాజ్యాధికారం చేపటక పూర్వం మీ పితామహుల చేతిలో నేనెన్ని కష్టాలనుభవించానో నీ వెరుగుదువా?"

"నేనెరగనే! నాకేమీ తెలియదే!"

"అయితే చెబుతున్నాను. విను! ఒకసారి ఆయన వేటాడుతూ తానెక్కిన అశ్వం వెనువెంటనే పరుగెత్తమని నాకాజ్ఞాపించారు. కాళ్ళకు పాదరక్షలైనా లేకుండా ఆ అశ్వం వెంట వెంట పరుగులు పెట్టాను! నా పాదాలంట రక్తధారలు ప్రవహించాయి!"

గోపాలవర్మ విస్తుపోయి—

"ఎందుకంతటి క్రౌర్యం?" అన్నాడు.

శంకరవర్మ మళ్లీ మొదలుపెట్టాడు.

"అదే చెబుతున్నాను. శ్రద్ధగా విను! వళ్ళు కొంకరపోయే తీవ్రశిశిరంలో నా చేత సన్నని వస్త్రాలు ధరింపజేసేవారు! మండు వేసంగిలో దట్టమైన ఉన్ని వస్త్రాలు ధరింపజేసేవారు! ఇలాగ నేనెన్నో యమయాతనలు అనుభవించాను. తెలిసిందా?"

"దీనికి కారణం?"

"అప్పటి మహామాత్యులొకసారి మీ పితామహుల నీవిధంగానే ప్రశ్నించారు. దానికాయన ఇచ్చిన సమాధానమేమో విన్నావా?"

గోపాలవర్మ వినలేదన్నట్లుగా అతనికేసి చూచాడు.

శంకరవర్మ తిరిగీ ప్రారంభించాడు:

"మహామాత్యునితో మీ పితామహులేమన్నారో కొంచెం విను! ఆగర్భ శ్రీమంతులకు క్షుద్రదరిద్రుల కష్టసుఖాలు తెలియవు! రాజ్యాధికారం చేజిక్కిన తరవాత అవి జ్ఞప్తికి రావాలనే దృష్టితో నే నీవిధంగా నా కుమారునికి దుఃఖానుభూతి కలిగిస్తున్నాను. అన్నారాయన!"

"ఎంతటి నిశితమైన అసిధారా శిక్షణ!" అన్నాడు గోపాలవర్మ.

పిమ్మట ఒక్క నిమిషంవరకు శంకరవర్మ ఏమీ అనకుండా రెప్పపాటు లేకుండా కుమారుని ముఖం పరిశీలించాడు. గోపాలవర్మకూడా అలాగే రెప్పపాటు లేకుండా శంకరవర్మ ముఖంకేసీ చూచాడు.

"అవిఘ్నంగా కష్టసుఖాలు చవిచూచినా కొంతకాలం రాజ్యపరిపాలనం సాగించేసరికి నాలో కారుణ్యం లేశమైనా మిగలకుండా పూర్తిగా నశించిపోయింది. కాని బాల్యంలో నేను నీవలెనే ప్రజలకష్టాలు చూచి ఎన్నెన్నోమారులు కన్నీరు విడిచిపెట్టాను. కాని క్రమక్రమంగా నా హృదయం కఠిన శిలగా మారిపోయింది నీ వన్నట్టు నాది క్రూరపరిపాలనమే. అయితే ఇంతకంటె గత్యంతరం లేదు!"

గోపాలవర్మ కాయన హృదయం లోభ పిశాచావిష్టమైపోయినదనీ అంగవల్లనే ఆ విధంగా ప్రసంగిస్తున్నాడనీ అనుకొన్నాడు. అయినా నిరుత్సాహపడక—

"మరి పితామహులీ విధంగానే పరిపాలించారా?" అని ప్రశ్నించాడు.

"అప్పటి కాలమాన పరిస్థితులు, అప్పటి ప్రజ వేరు!" అన్నాడు శంకరవర్మ.

ఆ పైన అతడేమీ మాట్లాడకుండా గాఢంగా ఏదో ఆలోచించాడు. తరవాత గోపాలవర్మ ఒక్క క్షణంపాటు మాట్లాడ కూరుకుని తన ప్రార్థన మన్నించి, వాగ్దానం చేసినట్టుగా వరప్రదానం చెయ్యవలసిందని బ్రతిమాలుకొన్నాడు.

పిమ్మట శంకరవర్మ తిరిగీ అలాగే వికటాట్టహాసం చేశాడు. దానికిదూరదూరంగా కూర్చున్న విటవిదూషకుల నవ్వులుకూడా తోడైనాయి.

శంకరవర్మ అంతలోనే తన నవ్వాపి కుమారునికేసి నిశితంగా చూసి—

"సరే! నీవు కోరినట్టుగానే నీకు వరప్రదానం చేస్తున్నాను నీవుకూడా నాకొక వరప్రదానం చేస్తావా?" అన్నాడు.

"నేనా? వరప్రదానమా?"

"అవును నీవే!" అన్నాడు శంకరవర్మ.

"నేను మీకు వరప్రదానం చెయ్యగలనా?"

"చెయ్యగలవు!"

"అయితే అలాగే!" అన్నాడు గోపాలవర్మ.

శంకరవర్మ ఒక్క నిమిషం గుంభనగా మాట్లాడకూరకుని—

"నా అనంతరం నీవు రాజ్యాధికారానికి వచ్చిన తరవాత నా కంటె ఎక్కువ క్రౌర్యం వహించనని వాగ్దానం చెయ్యాలి! అదే నేనడిగే వరం! నాకది చాలు!" అన్నాడు.

అటు పిమ్మట శంకరవర్మ తిరిగీ ఉవ్వెత్తుగా విరగబడి నవ్వడం మొదలుపెట్టాడు. దానితో బాటు విటవిదూషకులుకూడా అదే పనిగా విరగబడి నవ్వడం ప్రారంభించారు.

ఆ అవహేళనతో గోపాలవర్మ కన్నులలో రక్తం ప్రవహించింది. విటవిదూషకుల దగ్గిరికి వెళ్ళి ఒళ్లెరగని క్రోధంతో—

"ఎందుకలా నవ్వుతున్నారు! మీరు మానవులా? పశువులా?" అని దూషించాడు గోపాలవర్మ.

వారిలో ఒక విదూషకుడు వెటకారంగా కళ్ళెగరవేసి శంకరవర్మవైపు తిరిగి—

"మహాప్రభూ! పశువులు నవ్వవు! మానవులే నవ్వేది!" అన్నాడు. ఆ మాటతో మళ్ళీ సభలో కలకలహాసం చెలరేగింది!

గోపాలవర్మ ఉగ్రుడైపోయాడు: "ప్రస్తుత పాశవిక పరిపాలనలో మానవుల ముఖాల్లో నవ్వులు నశించిపోయాయి! ఇక పశువులే నవ్వగలిగేవి!"—అన్నాడు.

దీనితో సభలోనివారంతా పిడుగు మొత్తినట్లుగా స్తంభించిపోయారు. శంకరవర్మ ముఖం జేవురించింది. అయినా అతడేమీ అనలేక తలవంచుకొని ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు. వెంటనే గోపాలవర్మ సాధిక్షేపంగా సభ్యుల ముఖాలు పరిశీలిస్తూ కనురెప్పపాటులో ఆ భవనంలోనించి వెళ్ళిపోయాడు.

3

అటుపిమ్మట క్రమక్రమంగా ఒక సంవత్సరం గడిచిపోయింది. ఆ సమయంలో శంకరవర్మ, గోపాలవర్మ క్రమక్రమంగా ఒకరొకరికి దూరులైపోయారు. ఎప్పుడో గాని పరస్పర ముఖావలోకనాలే జరిగేవి కావు. ఆపిమ్మట శంకరవర్మ క్రూరపరిపాలనలో అంతగా మార్పేమీ గోచరించలేదు. అయితే అతని పేరు చెబితేనే శత్రువుల గుండెలు దద్దరిల్లిపోయేవి. అనంతరం అతడెన్నెన్నో దండయాత్రలు చేసి కాశ్మీర రాజ్య ప్రాభవం నాలుగుమూలలా విస్తరింపజేశాడు. అయితే కాశ్మీర ప్రాభవ విస్తరణతో బాటు ప్రజలలోను, చతురంగ సైన్యంలోను అసంతృప్తి, విద్వేషాగ్ని కూడా బాగా పెచ్చుపెరిగిపోయాయి.

తరవాత కొంతకాలానికి శంకరవర్మ తన అపార సేనావాహినితో సింధునదీతర రాజన్యుల దర్పం అణచివేసి వారందరినీ కాశ్మీర సామంతులుగా మార్చివేశాడు. ఉరశాపురంలో కాశ్మీర సైన్యంలో కొంత విప్లవాగ్ని చెలరేగిందనే వార్తలు శ్రీనగరంలో వ్యాపించాయి గాని, క్రమంగా అవన్నీ అంతరించిపోయాయి. శంకరవర్మ ఆ దిగ్విజయం ముగించుకొని తిరిగీ శ్రీనగరానికి వచ్చివేస్తున్నాడని వేగరులు కొందరు కొన్ని వార్తలు చేరవేశారు.

ఆ వేళ బాగా చీకటిపడింది. ఒక వార్తాహరుడు నురగలు కక్కుకుంటూ వచ్చి గోపాలవర్మతో కాశ్మీర మహారాజు శ్రీనగర సింహద్వారం దాటి నగరంలో ప్రవేశించారనే వార్త అందించాడు

గోపాలవర్మకు తండ్రి అధర్మ పరిపాలన ఎడల ఎంతటి వైముఖ్యం కలిగినా అతని బలపరాక్రమదక్షతలంటే ఎంతైనా గౌరవం. అదీగాక మహారాజు పురప్రవేశం చేస్తున్న

న్వాడు యువరాజాతని కెదురేగడం మహారాజ మర్యాద.

గోపాలవర్మ తండ్రి బహూకరించిన పంచకల్యాణిపైకి లంఘించి ఒక్క క్షణంలో శ్రీనగర సింహద్వారం చేరుకొన్నాడు.

ఒక పెద్ద పట్టపు ఏనుగుపై అధిరోహించి శంకరవర్మ మెల్లిమెల్లిగా నగరంలో ప్రవేశిస్తున్నాడు. అతని వెనువెంట అపారమైన కాశ్మీర సేనాసముద్రం. శ్రీనగర పౌరులు దిక్కులు పిక్కటిల్లేటట్టు జయ జయ ధ్వానాలు చేస్తున్నారు. వేలాది కరదీపికలతో ఆనాడు శ్రీనగర రాజవీథులలో పండు వెన్నెలలే వెల్లివిరిశాయి.

శంకరవర్మ అధిరోహించిన మత్తగజం నెమ్మదిగా ఆగింది. యువరాజా ప్రదేశానికి చేరుకోగానే తిరిగీ పౌరుల జయ జయ ధ్వానాలు మిన్ను ముట్టాయి. శంకరవర్మ మెల్లిగా శిరః కంపంచేస్తూ చేతులెత్తి నమస్కరిస్తూ పౌరుల అభినందన పరంపర లందుకొంటున్నాడు. గోపాలవర్మ నెమ్మదిగా పట్టపుఏనుగుపై అంబారీలో ప్రవేశించాడు. దానిలో మహామాత్యుడు, కాశ్మీర చక్రవర్తి శంకరవర్మ మాత్రమే కనిపించారు.

గోపాలవర్మ సవినయంగా జనకునికి నమస్కరించాడు. శంకరవర్మ శిరఃకంపం చేశాడు.

గోపాలవర్మకు ఆ శిరఃకంపం అపూర్వంగా కనిపించింది. ఎంతో పరిశీలనగా తండ్రి ముఖకవళిక పరిశీలించాడు. ఆ ముఖంలో జీవకళ లేదు! అది మృతదేహం! గోపాలవర్మ నిర్ఘాంత పడిపోయి అదేమని మహామాత్యుణ్ణి ప్రశ్నించాడు. మహామాత్యుడు చేయెత్తి మాట్లాడవద్దని నెమ్మదిగా సంజ్ఞ చేస్తూ అతనితో ఇలాగన్నాడు.

"మహాప్రభూ! మీ రిప్పుడు గుండె రాయి చేసుకొని ధైర్యం చిక్కబట్టాలి. శంకరవర్మ చక్రవర్తి మరణించి అప్పుడే రెండు రోజులయింది. ఉరశాపురంలో సైనికులు కొందరు తిరుగుబాటు చేశారు. చక్రవర్తి ఆ తిరుగుబాటంతా అణచివేశారు. కాని పర్వతం చరియపై పొంచి కూర్చున్న శబరయోధుడొకడు విషదిగ్ధమైన బాణం చక్రవర్తిపై ప్రయోగించాడు. అది తగిలిన కొన్ని గడియలలోనే చక్రవర్తి స్వర్గస్థులైనారు. వెంటనే సైన్యంలో విప్లవాగ్ని చెలరేగితే కాశ్మీర రాజ్యానికే ముప్పు వాటిల్ల గలదనే భయంతో మే మొక ఉపాయం ఆలోచించాము. మహారాజు స్వర్గస్థులయినా సైనికుల కెవరికీ అది తెలియనీయలేదు! ఆయన సజీవులే అన్నట్టుగా సైన్యంలో అందరికీ భ్రమ కలిగించాము. శిరస్సుకు, హస్తాలకు చినచిన్న తాళ్లు కట్టి ముందు వెనకలకు కదలాడేటట్లు ఏర్పాటు చేశాము. అందువల్లనే చక్రవర్తి స్వయంగా ప్రజాభినందనా లందుకుంటూ నమస్కరిస్తున్నట్లుగా మీ కందరికీ స్ఫురించింది. ఈ ఉపాయంవల్లనే కాశ్మీరసైన్యం శ్రీనగరంలో ప్రవేశించే వరకు తీవ్ర విప్లవం చెలరేగకుండా జాగ్రత్త పడ్డాము. ఇది చక్రవర్తికి మహాపచారమే కాగలదని మాకు తెలియకపోలేదు. కాని కాశ్మీర రాజ్యసంరక్షణ దృష్టితో చేసిన ఈ అపచారం మన్నించవలసిందని మిమ్మల్ని సవినయంగా ప్రార్థిస్తున్నాము."

అదంతా గోపాలవర్మకొక వజ్రాఘాతంలా తగిలింది.

మొదట అతడది నమ్మలేదు! తిరిగి జనకుని ముఖం పరీక్షగా పరిశీలించాడు. నిజమే! అది ప్రేతదేహమే! సందేహంలేదు! మహామాత్యుడు తన గుప్పిట బిగించిన చిన్న చిన్న తాళ్లతో శంకరవర్మ శిరస్సు, హస్తాలు కదిలాడేటట్లు చేస్తున్నాడు! అప్పుడిక ఉద్వేగపడడంవల్ల ప్రయోజన మేమీలేదని గోపాలవర్మ మారు మాటాడకుండా అలాగే జనకుని ముఖం పరిశీలిస్తూ ఒక్క వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు. అతని చెంపలవెంట వేడి కన్నీరు సంతతధారగా ప్రవహించింది!

ఎంతటి ధైర్యశాలి కెంతటి దారుణ మరణం సంభవించింది! ఎంతటి కరుణార్ద్రహృదయుడు ధనలోభావిష్టుడై ఎంతటి కఠిన హృదయుడుగా మారిపోయాడు! అని అనుకొన్నాడు గోపాలవర్మ. ఎంతటి కరుణాళువులైనా కర్కశ రాజ్యాధికారం చేజిక్కించుకోగానే ఇలాగే మారిపోతారేమోనని అతనికి హఠాత్తుగా స్ఫురించింది.

సంతతధారగా ప్రవహించే కన్నీటిమధ్యనించి శంకరవర్మ ముఖం పరిశీలిస్తున్న గోపాలవర్మ హృదయంలో ఆ భావం స్థిరస్వరూపం ధరించింది.

కాశ్మీర చక్రవర్తి శంకరవర్మ మృతదేహము, యువరాజు గోపాలవర్మ, మహామాత్యుడు అధిష్ఠించిన ఆ పట్టపుఏనుగు అల్లాగే మెల్లి మెల్లిగా శ్రీనగర రాజవీథుల గుండా సాగిపోయింది. ఆ దృశ్యం అంతా నిశ్చల దృష్టితో పరిశీలిస్తున్న కాశ్మీర యువరాజు గోపాలవర్మ పెదవులనుండి అప్రయత్నంగా "రాజ్యాంతే నరకం ధ్రువం!" అన్న దేవవాణీసూక్తి అస్పష్టంగా పైకి వెలువడింది. ★

జీవనఫలం

(40 వ పేజీ తరువాయి)

తగినంత ప్రచారం లేనప్పుడు
తప్పుడు పనులుచేసేవారితో భుజంకలపరు
వేటగాడు జంటపిట్టలని కొట్టేవరకూ
ఆ సంఘటనని ముందుగా తలంచరు
కొట్టిన పిదప శోకించుతారు
శోకించుతారు
కొండంచి మేలెంచమన్నా
చూడలేరు రానున్న ఆ వ్రణాన్ని
విపత్తుని

యువ : ఎవరిది లోపం కాంతీ
ఈ అరాచకం ఎవరి దోషం
కాంతి : మనదే మనదే
కనబడలేదా మనం చేసిన తప్పులు
సందేహజీవుల మనస్సులలో
సంచలనం కలిగినప్పుడు సమాధాన
మివ్వలేదు
యువ : నిజం ఓదార్చలేదు
కాంతి : స్వార్థం నగుమోముకి తగిలిన
గాయాలే మానెనుగాని
మాయని పెనుమచ్చలు మిగిలెను
పోయిన తొలి కాంతులు మరలవు
యువ : అవును మరల మరల మరలవు
కాంతి : విలాసాన్ని వైరివేషాలని
నిషేధిస్తున్నామని
వినోదాన్నే నిషేధించాం మనం
యువ : అవును విశేషించి కావేషం
పెంచాము
కాంతి : లక్ష్య శుద్ధి లేకుండా అసలు
లక్ష్యమే లేకుండా
తిరుగుబాటు కొరకే తిరగబడుతున్నా
రందరూ
గమ్యస్థాన మొకటి నిర్దేశించి ఆశయ
ముపదేశించి
మార్గం సుగమ్యం చేయలేదు మనం
యువ : తత్వానికి తలవొగ్గమన్నాము
మనవైపే మొగ్గమన్నాము
అభిప్రాయభేదం అనంగీకరించమ
న్నాము
అజ్ఞలు శిరసావహించమన్నాము
కాంతి : ఆలోచనలలో వైవిధ్యాన్ని
బహిరంగ వైరుధ్యం గావించాము
వంచినతల ఎత్తినవారిని
పంచమహాపాపు లన్నాము
యువ : వ్యక్తిత్వాలు విసర్జించమని సమష్టిని
దుష్టశక్తిగా రూపొందించాము
కాంతి : అధినేతలలో అధికారవాంఛ
ప్రబలినప్పుడు
అనుచరులు నిశాచరులు కాకతప్పదు
యువ . యౌవన దీపం ఉండగానే
జీవితపుటిల్లు చక్కబెట్టుకొందామని
నేడే రేపుగా కోరిక లీడేరే తలంపుతో
మందకొడి జీవితాన్ని వదిలి
మందలో కలిసిపోతారు మందులు
మృత్పిండమ్ములవలె పైకెగరలేరు
క్రిందంబడి వుందురారు
కాంతి : లోకమండలి మంచి చెడ్డలు
లోకు లేకారణముచేతనో ఎరుగలేరు

జీవనఫలం


మనుష్యులలో మంచి చెడ్డలు రెండూ
జవిలిగా జతగా కలిసిమెలిసి ఉంటాయి
చెడ్డతనం కూడదన్నాము గానీ
మంచితనం కావాలనలేదు
మనం వ్యతిరేక ప్రచారం చేశాముగాని
అనువైన అనుకూల ప్రబోధం చేయలేదు
నిదానంగా నినాదం ఇవ్వాల్సింది
తొందరగా తోలాం మనుష్యులని
యువ : మంచివాళ్ళని పిలుద్దామయితే
కొంచెం కొంచెమే సాగుదాం ముందుకు
కాంతి ఉంటుందు మనం సాధించిన పండు
నిజంగా వేడిపండేమో ఇందులో
పులుపులు మెండేమో యోచించు
దీనిని ముందు స్వీకరించలేరు
వారంతా నిరాకరించారు
ఎందుకో తెలుసుకోవాలి
అందే ద్రాక్ష లివ్వాలి
యువ అభ్యాసం కూసువిద్య
అనూచితంగా దొరికేదాని పైన
నిరాదరణ కలుగుతుందెవరికైనా
ఎవరొండుకొన్న చప్పిడితిండి
వారికి తియ్యగానే ఉంటుంది
ఎవరి జీవనఫలం వారు స్వయంగా
కోసుకొంటే తీసుకొంటే మేలు
కాంతి: పిలు అందర్నీ పిలు
ఇస్తానను కలల సిరులు
యువ. అందర్నీ పిలువను
పాపాత్ములకి మోక్షంలేదు
దుష్టకర్ములకు మంచి గతులుండవు
నేరగాళ్లకి మోసగాళ్లకి
దోషులకి సమాజంలో చోటులేదు
వాళ్లకి ఆనందమెన్నుకొందికి వోటులేదు
గంగిగోవుపాలు గరిటెడు చాలు
విత్తనం ఒక్కటె మహావృక్షమై మొల్లు
స్తుంది
పుణ్యాత్ములు ముందుకొస్తే చాలును
కాంతి: (నవ్వి)
పుణ్యాత్ములు ఎక్కటందుకు
స్వర్గానికి నిచ్చెన కన్నా
పాపాత్ములు తరించడానికి
వైతరణికి వంతెనకడదాం
యువ ఏమిటే అంటున్నావు
ఏమిటి వింటున్నాను
కాంతి పుణ్యాత్ములు ఎక్కటందుకు
స్వర్గానికి నిచ్చెనకన్నా
పాపాత్ములు తరించడానికి
వైతరణికి వంతెన కడదాం
యువ అభాగ్యులు యోగ్యులు కారు
కాంతి. నీ విచింతన ఎచట మొదలైనదో
మరచినావు విస్మరించినావు
స్మరించుకో నీ ఆశలమంత్రాలను
గుర్తించుకో పునాదులు

పతనం చూసి బాధపడ్డావు
ఏ సముద్ధరణ సంకల్పించావు
ఆ ప్రణాళికలే అమలు చేయుము
నీకనీనిక లేచిప్పి చూడుము
యువకుడు : కొలకన్నారు నా జీవనఫలం
అయింది నా ప్లాను విఫలం
ఇపుడు మంచివారి నే పిలుస్తాను
మరో రాగాన్ని ఆలపిస్తాను
కాంతి · రోగం పాతదే
ఔషధం మంచిదే
అదే మందుకు లేబిల్ మార్చు
సాంఘిక వ్యాధిగ్రస్తుల నోదార్చు
పిలు అందర్నీ పిలు
ఇస్తానను సౌఖ్యాల దొంతరలు
(శృంగనాదం రండోలు)
కాంతి రండు రండు మంచివాళ్లు
తియ్యని మామిడిపండు
పండు తినబోతే దొరకదు
తీపులు మెండు లెండు లెండు
(కోలాహలం)
కాంతి : నిస్త్రాణంగా బతుకుతారెందుకు
విస్తారమైన వినోదాలొద్దా మీకు
అంతులేని సౌఖ్యాల పుంత
తొక్కుతారా
చింతలు తొలగించే దేవతను
మొక్కుతారా?
యువకుడు :
మూసిన అరచేతిలో వైకుంఠం కావాలా
కోసుకొంటారా అమందానంద ఫలాలు
విలాసిని : ఎక్కడున్నాయి చిక్కులు లేని
మొక్కలు
వినోదిని : ఎక్కడున్నాయి ప్రమోద
ప్రసూనాలు
కాంతి : అక్కడ అల్లదక్కడ
యువకుడు : మిక్కుటముగ చక్కదనా
లక్కడ తప్పక నుండును
వృద్ధు : పోయిన పసితనం దొరకుతుందా
కుర్రాడు : హాయిగా ఉంటుందా
కాంతి : ఉంటుంది చల్లగా
యువ : ఉంటుంది తియ్యగా
గొం 1 : అచ్చట లాభాలు వచ్చే రెట్లు
కాంతి : నూటికి నూరు రెట్లు
గొం 2 : అచ్చట వ్యాపారం సాగే రెట్లు
యువ : మీరు కోరుకో నేటట్లు
విలాసిని : గుండె ఝల్లుమంటోందా?
కాంతి · కళ్లు గగుర్పొడుస్తుంది
వినోదిని : తిమ్మిరెక్కుతుందా జీవితమ్మ
యువ · ఊపిరి ఉల్లాసవంత మవుతుంది
కామితమే జీవితమవుతుంది
కుర్రాడు : చదువుమానేసి సినిమాలు
చూడొచ్చా
కాంతి: సినిమాలుమానస్తానే చదువుకోవచ్చు
బాలు : బడిమానేసి ఆడుకోవచ్చు
పాడుకోవచ్చా

యువ : బడిలోనే ఆటలాడవచ్చు
పాటపాడవచ్చు
కాంతి . మీ హృదులు జీవనదులు
వాటిలోని సృజనాత్మకజలాలు
లవణసాగరపు లోతుల్లోనికి పోతున్నవి
వృథా అవుతున్నవి యింకిపోతున్నవి
విలాసిని : ఎటుల వాటి నాపుట?
వినోదిని . ఆనందబాష్పనదుల నీరాన్ని
సంతోషసేద్యానికెటులవినియోగించుట?
కాంతి . కట్టండి ఆనకట్టలు
యువ : పెంచండి ఆయకట్టలు
కాంతి ఆటంకాల వారాశిదాటితే
అనురాగాల రాశిపోసిన
మురిపాల దీవి చేరుకోవచ్చు
అచట ప్రతిమోమూ నగుమోము
అచట ప్రతిమదిలో ఎంతోగోము
విలాసిని . అందుకు నోచాలా నోము
వినోదిని : అది ఎలా సాధించగలం మేము
కాంతి : ఉరకండి ఉరకండి ముందుకు
సరిలేని సుఖం సాధించేటందుకు
యువ . సాగండి సాగండి జీవనఫలంకొరకు
సాగండి అది మనకు దొరికేవరకు
కాంతి: పదండి అంచులచివరకు
పదండి కులాసాల కొసలకు
విలాసిని ఈదారిలో వున్నవి ముళ్లు
వినోదిని . ఇవి చాలా ఎగుడు దిగుళ్లు
కుర్రాడు: నా కాళ్లకిగుచ్చుకొంటున్నవిరాళ్లు
వృద్ధు వణుకుతున్నవి నా ముసిలి వేళ్లు
యువ ఏరిపారెయ్యండి ముళ్లు
కాంతి. చదును చెయ్యండి దార్లు
యువ వేసుకొందాం మంచిబాటలు
కాంతి. పాడుకొందాం కలిసి పాటలు
విలాసిని: సాగండి ఆగకండి
వినోదిని: సంతోషం దొరుకుతుంది
వృద్ధు. పదండి సరేసరే
కుర్రాడు: అవునండి బలేబలే
గొం 1: నవజీవన ఫలంకొరకు
అందరు. నవజీవన ఫలంకొరకు
గొం 1: కోరినది దొరికేవరకు
అందరు: విరామమే లేదు మనకు

(ప్రస్థానధ్వనులు—కోలాహలం)
యువ . కోరుకొన్న ఆనందం చేరువైనది
కాంతి : మేరునగం దానిముందు చిన్నదైనది.
: విజయశంఖం - మంగళ వాద్యాలు :

(ఆలిండియా రేడియో ప్రసారితం.)★



Printed and Published for Nageswara Rao Estates Ltd., by S Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S Sambhu Prasad.



వేటకాడు


సొగసులరాణివంటి చర్మ సౌందర్యము మీకున్నూ గలుగును
దినదినమున్నూ అతి
మనోహరముగా నుండుటు...
అవును. కాంతివంతమైన సొగసైగు చర్మ సౌందర్యము బొంద
గోరు మీ కల నిజము కాగలదు కూడ: మీరు స్నానము చేయు
చున్నప్పుడున్నూ చేతులు ముఖము కడుగుకొనునప్పుడున్నూ ప్రతి
మాటూ. రెక్సోనాను ఉపయోగించుడు — ఎల్లప్పుడూ
దానియొక్క కేడిల్‌తోగూడిన నురగను మీ
చర్మముమీద మెల్లగా రుద్దుడు తరువాత
కడిగివేయుడు. దినదినమున్నూ మీ చర్మ
సౌందర్యము ఇంకా క్రొత్త మరీ మృదు
వైన. మనోహరత్వమును బొందును
"మిస్ రెక్సోనా"
1955 రెక్సోనా సౌందర్య
పోటీలో మనోహరమైన
గెలుపుదారు
Rexona
BLENDED WITH CADYL
...సహజంగా రెక్సోనాతో
ఇది ఒక్కటే కేడిల్ తోగూడిన సబ్బు
పెద్ద సైజులో కూడ దొరకును
RP 130X52-TL